అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సోమవారం 21-8-2023

తుది ఘట్టానికి చేరువలో చంద్రయాన్-3



వివరాలు 11లో..

సంపుటి : 9 | సంచిక : 232 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

# పింఛన్లు పెంచుతాం

## తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్

- 50ఏండ్లలో కాంగ్రెస్ ఏం చేసింది? ◆ చత్తీస్‌గఢ్, కర్నాటకలో రూ.4వేల పెన్షన్ ఎందుకు ఇస్తలేదు?
- ధరణితో రైతుకే అధికారమిచ్చాం ◆ నల్లగొండలో అల్ట్రా మెగా పవర్ ప్లాంట్ రాబోతోంది
- కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటే ◆ ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి
- సూర్యాపేట ప్రగతి నివేదన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



**నవతెలంగాణ-సూర్యాపేట**

త్వరలో పింఛన్లు పెంచుతామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు తగ్గాయని సీఎం కేసీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాలు ప్రారంభించిన అనంతరం జరిగిన ప్రగతి నివేదన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. సూర్యాపేట జిల్లా కావడం ఒక చరిత్ర అని అన్నారు. రూ.100 కోట్లతో ప్రభుత్వ కార్యాలయాలను అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలో 23వ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరంగా ఉందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏండ్లలో కాంగ్రెస్ ఏం చేయలేదని, కాంగ్రెస్ తన జన్మలో రూ.1000 పెన్షన్ ఇవ్వలేదని.. రూ.200 పెన్షన్ ముఖాన కొట్టారని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. 4వేలు పెన్షన్ ఇస్తామంటున్న కాంగ్రెస్.. అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్, కర్నాటకలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఒకరు మోటర్లకు మీటర్లు పెట్టాలని అంటున్నారని, మరొకరు మూడు గంటల ఉచిత విద్యుత్ చాలు అంటున్నారంటూ బీజేపీ, కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి తీసేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, ధరణి తీసేస్తే మళ్లీ పాత కథే మొదటి కొస్తుందని, దరఖాస్తులతో ఆఫీసుల చుట్టూ రైతులు తిరగాలా అని ప్రశ్నించారు. ఒక్కసారి ధరణిలోకి భూమి ఎక్కితే మార్చే అధికారం తనకూ లేదని, రైతు బొటన వేలుకే ఆ అధికారం ఉందని స్పష్టంచేశారు. దశాబ్దాల తరబడి మూసీ మురికి నీరు తాగించారని, ఇప్పుడు నల్లగొండలో అల్ట్రా మెగాపవర్ ప్లాంట్ రాబోతోందని తెలిపారు. రూ.37 వేల కోట్ల రైతుల రుణమాఫీ చేశామని.. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ ఎక్కడా చేయలేదని చెప్పారు. తెలంగాణ మూడు కోట్ల టన్నుల వడ్లు పండిస్తోందని.. త్వరలో పంజాబ్‌ను మించి నాలుగు కోట్ల ...2లో

## నేడు బీఆర్ఎస్ తొలి జాబితా

- మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రకటన
- తెలంగాణ భవన్‌లో 105 మంది పేర్లను ప్రకటించనున్న కేసీఆర్

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల తొలి జాబితాను సోమవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రకటించనున్నట్టు సమాచారం. మొత్తం 95 నుంచి 105 మంది అభ్యర్థుల జాబితాను ఆయన ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మెజారిటీ అభ్యర్థులు సిట్టింగులే కాగా, దాదాపు 8 నుంచి 10 మంది కొత్త అభ్యర్థులు ఉండే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దీనిపై ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ తుదినిర్ణయానికి వచ్చేశారనీ, టిక్కెట్ రాని సిట్టింగులకు ఎమ్మెల్సీలు లేదా కార్పొరేషన్ల చైర్మెన్ల పోస్టులు వంటివి ఇస్తామని ఒప్పించే ప్రయత్నం జరుగుతున్నదని పార్టీలో ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుత సిట్టింగ్స్‌లో దాదాపు 20 నుంచి 22 మందికి ఈ సారి టిక్కెట్ ఇచ్చే పరిస్థితులు లేవని గతంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారని వారు గుర్తుచేస్తున్నారు. మారిన రాజకీయ సమీకరణాలు, సిట్టింగుల పనితీరు, ...2లో



గద్దర్‌కు నిజమైన నివాళి...

## కమ్యూనిజాన్ని నిలబెట్టడమే

### దేశానికి కమ్యూనిస్టుల అవసరం పెరిగింది



- విప్లవోద్యమంలో అంతర్భాగమే సామాజిక న్యాయ పోరాటం
- సమరశీల పోరాటాల్లో వామపక్షాల ఐక్యత పెరగాలి
- దేశం ముందుకెళ్లడంలో విద్య, సైన్స్, టెక్నాలజీదే కీలక పాత్ర : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

దేశంలో కమ్యూనిజాన్ని, ఎర్రజెండాను నిలబెట్టడమే ప్రజాకవి గద్దర్‌కిచ్చే నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సామాజిక న్యాయ పోరాటం విప్లవోద్యమంలో అంతర్భాగమేనని నొక్కి చెప్పారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సమరశీల పోరాటాల్లో వామపక్షాల ఐక్యత పెరగాలని ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. దీనికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేశ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. వామపక్ష పార్టీల ముఖ్యనేతలు, కవులు, కళాకారులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గద్దర్ మృతికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. విప్లవ కవి, కళాకారుడు, కమ్యూనిస్టు యోధుడు, ప్రజల మనస్సు గెలిచిన గొప్ప నాయకుడు గద్దర్ అని కొనియాడారు. మతోన్మాదం పెచ్చరిల్లుతున్న సందర్భంలో, పాలకులు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న క్రమంలో వీటిని ఎదిరించేందుకు ఎవరు ముందుకొచ్చినా కలిసి పనిచేస్తానని గద్దర్ పలు సందర్భాలలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం పేరుతో సీపీఐ(ఎం) చేపట్టిన మహాజన పాదయాత్ర, టీమాస్ కార్యక్రమాల్లో గద్దర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆ సమయంలోనే గద్దర్‌తో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం తనకు లభించిందన్నారు. మార్క్సిజం, అంబేద్కరిజం పరస్పర విరుద్ధ అంశాలు కావన్నారు. కొన్ని అంశాల్లో భేదాభిప్రాయాలుండొచ్చునీ, అంతిమంగా ఆ రెండింటి స్ఫూర్తి సామజిక న్యాయమనే విషయాన్ని మరవొద్దని సూచించారు. కమ్యూనిజాన్ని సాధించడంలో సామాజిక న్యాయం అంతర్భాగంగానే ఉంటుందనీ, అది వేరు కాదని చెప్పారు. మన దేశంలో కుల వ్యవస్థ రూపుమాపకుండా అభివృద్ధి సాధించడం అసంభవమన్నారు. ఇది కులం గురించో, ...11లో

## ముస్లిం దంపతుల దారుణ హత్య

### యూపీలో మరో ఘాతుకం



**లక్నో :** యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో ముస్లిములపై దాడులు తీవ్రమయ్యాయి. తమ కుమార్తెను ముస్లిం యువకుడు తీసుకెళ్లి, వివాహం చేసుకున్నాడన్న కోపంతో హిందూ యువతి కుటుంబ సభ్యులు ముస్లిం దంపతులను దారుణంగా హత్య చేశారు. ఇనుప రాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా ...2లో

మిత్రుడికి మోడీ ..కుటుంబానికి కేసీఆర్

## దోచి పెడుతున్నారు

### బీజేపీది విభజించు పాలించు విధానం




- దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి
- దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం ◆ రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి

...2లో

## ప్రమాదంలో ప్రజాస్వామ్యం

### దారుణంగా దిగజారిన భారత ఆర్థిక వ్యవస్థ



- పెరిగిన నిరుద్యోగం ◆ క్షీణిస్తున్న ప్రయివేటు పెట్టుబడులు
- భారత పౌరసత్వం వదులుకుంటున్న లక్షలాదిమంది...
- 'ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా' పుస్తక పరిచయంలో పరకాల ప్రభాకర్

...3లో

ప్రజాస్వామ్య శక్తుల

## ఐక్యత అవసరం

### 'వి20' సమ్మిట్ డిక్లరేషన్ ఆమోదం

- మూడోరోజూ పోలీసుల ఆంక్షలు




**న్యూఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు సమ్మిళిత, పారదర్శక, సమానమైన భవిష్యత్తు అందించేందుకు ప్రజాస్వామ్య శక్తుల మధ్య సంఘీభావం, ఐక్యత, సహకారం అవసరమని 'వి20' సమ్మిట్ స్పష్టం చేసింది. పార్లమెంటేరియన్లు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలతో కూడిన వి20 పీపుల్స్ సమ్మిట్ 'ప్రజలు.. ప్రకృతికి సమ్మిళిత, పారదర్శక, సమాన భవిష్యత్తు' పేరుతో ఆదివారం ఈ డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్ (హెచ్‌కేఎస్)లో మూడు రోజుల పాటు జరగాల్సిన 'వి20 పీపుల్స్ సమ్మిట్' శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే ఈ సదస్సును శనివారం పోలీసులు అడ్డుకుని, నిర్బంధాన్ని విధించారు. నిర్వాహకులు, వక్తలు ప్రతిఘటించడంతో శనివారం కార్యక్రమం కొనసాగింది. ఆదివారం పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతి నిరాకరించడంతో సెషన్‌లను రద్దు చేసి, వి20 సమ్మిట్ డిక్లరేషన్‌పై చర్చించారు. ప్రతినిధులంతా డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. దేశంలోని 18 రాష్ట్రాల నుంచి ప్రజా ఉద్యమకారులు, కార్మిక, ప్రజా సంఘాల నుంచి 700 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో శ్రామిక వర్గం, దళితులు, ఆదివాసీలు, వికలాంగులు, జాతి, మతపరమైన మైనార్టీ వర్గాలు, రైతులు, మత్స్యకారులు, అటవీ కార్మికులు, వ్యాపారులు, చేతివృత్తులవారు, అసంఘటిత కార్మికులు, విద్యావేత్తలు, పౌర సమాజ సభ్యులు ఉన్నారు.

'ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు న్యాయమైన, సమ్మిళిత, పారదర్శకమైన, సమానమైన భవిష్యత్తు అందించేందుకు అన్ని ప్రజాస్వామ్య శక్తులు, ప్రజా ఉద్యమాలు, పౌర సమాజ సంస్థలు, మానవ హక్కుల పరిరక్షకులు, ప్రగతిశీల వ్యక్తుల మధ్య సంఘీభావం, ఐక్యత, బలమైన సహకార అవసరాన్ని వి20 సమ్మిట్ నొక్కి చెప్పింది' అని డిక్లరేషన్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 9,10 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే 18వ జి20 నాయకుల శిఖరాగ్ర సమావేశానికి ముందు జరిగిన వి20 సమ్మిట్ అనేక అంశాలపై వర్క్‌షాపులు నిర్వహించింది.

"జి20 సమావేశాలు సాధారణంగా ధనిక, అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు సేవ చేయడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రపంచ బ్యాంక్, ...11లో

## అవినీతిలో హోం శాఖ

### దానిపైనే ఎక్కువ ఫిర్యాదులు

- సీవీసీ 2022 వార్షిక నివేదిక
- తరువాత స్థానాల్లో రైల్వే బ్యాంక్ అధికారులు




**న్యూఢిల్లీ :** అవినీతి విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ముందుంది. గత ఏడాదిలో ఈ శాఖకు చెందిన అధికారులపై అధికంగా అవినీతి ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాన్ని కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) 2022 వార్షిక నివేదిక వెల్లడించింది. తరువాత స్థానాల్లో రైల్వే, బ్యాంక్‌లకు చెందిన అధికారులు ఉన్నారు. 2022లో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థలకు చెందిన అధికారులు, ఉద్యోగులపై మొత్తంగా 1,15,203 అవినీతి ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 85,437 ఫిర్యాదులను పరిష్కరించారు. మరో 29,766 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో 22,034 ఫిర్యాదులు మూడు నెలలుకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. గత ఏడాదిలో హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులపై మొత్తంగా 46,643 ఫిర్యాదులు వచ్చాయి. రైల్వే శాఖకు చెందిన ఉద్యోగులపై 10,580, బ్యాంకులు చెందిన ఉద్యోగులపై 8,129 ఫిర్యాదులు వచ్చాయి. హోం మంత్రిత్వ శాఖపై వచ్చిన ఫిర్యాదుల్లో 23,919 ఫిర్యాదులను పరిష్కరించగా, 22,724 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 19,198 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రైల్వే ...11లో



## 84 మందితో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

### సచిన్ పైలట్, శశిథరూర్‌కు స్థానం.. 39 మంది సీడబ్ల్యూసీ సభ్యులు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)ని 84 మందితో పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియామకాన్ని చేపట్టారు. ఇందులో 39 మంది సీడబ్ల్యూసీ జనరల్ సభ్యులు, 18 మంది శాశ్వత ఆహ్వానితులు, 14 మంది ఇంఛార్జ్‌లు, 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు, నలుగురు (యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ అధ్యక్షులు) ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమితులయ్యారు. సభ్యుల్లో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ...11లో

## చర్చలే ఏకైక మార్గం

### మణిపూర్ సంక్షోభంపై సీతారాం ఏచూరి

- కుకీ, మైతీ వర్గాల మధ్య చర్చలకు ప్రభుత్వం ముందుకు రావాలి
- బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు విఫలం ◆ సహాయక శిబిరాల్లో కనీస సౌకర్యాలు లేవు
- మణిపూర్‌కు పార్లమెంటరీ బృందాన్ని పంపాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** మణిపూర్ సంక్షోభ పరిష్కారం కోసం చర్చలు ప్రారంభించాలని, ఇదొక్కటే ఏకైక మార్గమని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సూచించారు. కుకీ, మైతీ వర్గాలతో చర్చలు ప్రారంభించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని, అందుకోసం నిరాయుధీకరణకు హామీ ఇవ్వాలని తెలిపారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేతృత్వంలో సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, అసోం రాష్ట్ర కార్యదర్శి సుప్రకాష్ తాలూక్‌ధర్, కేంద్ర కమిటీ సభ్యురాలు డెబ్లీనా హెంబ్రామ్‌లతో కూడిన నలుగురు సభ్యుల బృందం మూడు రోజుల మణిపూర్ పర్యటన ఆదివారం ముగిసింది. బృందం సభ్యులు మూడు రోజుల పాటు కుకీ, మైతీ సహాయక శిబిరాలను సందర్శించారు. వారికి భరోసా కల్పించారు. కుకీ, మైతీ, నాగా జాతుల నేతలను కూడా కలిశారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితి, శాంతి కోసం అందరూ కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. బృందంతో సీపీఐ(ఎం) మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి క్షత్రిమయుమ్ శాంత కూడా ఉన్నారు.

మణిపూర్ రాజధాని ఇంపాల్‌లో ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సీతారాం ఏచూరి ఆదివారం మాట్లాడారు. మూడు నెలలుగా కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించడంలో బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం విఫలమైందనీ, ఇప్పటికే తన ప్రయత్నాలను రెట్టింపు చేయాలని సూచించారు. 'దయచేసి ప్రతి ...11లో

**నవతెలంగాణపై స్పందన**
**ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016**

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

**అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.**

# రంజుగా సాగర్ పాలిట్రిక్స్

## రోజురోజుకీ పెరుగుతున్న గ్రూప్ వార్

- ఇదే సమయంలో అల్లు ఎంట్రీతో క్యాడర్‌లో కన్ఫ్యూజన్
- బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ అంటూ ప్రచారం
- అవకాశం కోసం కాంగ్రెస్, బీజేపీల వెయిటింగ్

**నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీల్లో టికెట్ కోసం పోటాపోటీగా ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు అధికార బీఆర్ఎస్ పార్టీలో గ్రూప్ వార్ రోజురోజుకీ తారాస్థాయికి చేరుతోంది. వీలు చిక్కినప్పుడల్లా నేతలు తమ బలనిరూపణకు దిగుతున్న సందర్భాలు లేకపోలేదు. నియోజకవర్గంలో టికెట్ ఆశావహులు సామాజిక సేవా కార్యక్రమాలు, ఫౌండేషన్ల పేరుతో ప్రజల్లోకి వెళ్లి.. అధినాయకత్వం దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి నియోజకవర్గంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**గ్రూప్ వార్‌తో పెరిగిన ఆశావహులు..**

నాగార్జునసాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో గ్రూప్ వార్ పెరిగిపోయింది. ప్రధానంగా ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మధ్య వివాదం తీవ్రమైన సంగతి తెలిసిందే. వీరు కాకుండా నియోజకవర్గం నుంచి ఏకే ఫౌండేషన్ చైర్మెన్ కట్టబోయిన అనిల్ కుమార్ యాదవ్, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎక్కువగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే గ్రూపుల మధ్య వార్ పెద్దఎత్తున సాగుతోంది. సొంత నియోజకవర్గంలో పక్కోడి పెత్తనం ఏంటంటూ బహిరంగంగానే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలో 70 శాతం లోకల్ లీడర్లు ఎమ్మెల్సీ కోటిరెడ్డి గ్రూపులోకి వెళ్లిపోయినట్టు ప్రచారం జరుగుతోంది.

**పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీల స్కెచ్..**

సాగర్ నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంటూ వస్తోంది. కానీ 2018 అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఉపఎన్నికలోనూ బీఆర్ఎస్ విజయం సాధించడంతో మూడోసారీ బీఆర్ఎస్ పాగా వేయాలని భావిస్తోంది. సాగర్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి మరోసారి పోటీ చేస్తారా..? లేక ఆయన తనయుడు కుందూరు జయవీర్ రెడ్డి పోటీ చేస్తారా..? అన్న సందిగ్ధత నెలకొంది. బీజేపీ నుంచి రిక్కల ఇంద్రసేనారెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తుండగా, గత ఉపఎన్నికలో పోటీ చేసిన రవినాయక్‌కు మరోసారి టికెట్ ఇవ్వడం కష్టమనే తెలుస్తోంది. అయితే, బీఆర్ఎస్‌లోని కుమ్ములాటలు తమకు కలిసొస్తాయని కాంగ్రెస్, బీజేపీ భావిస్తున్నాయి.

**అల్లు ఎంట్రీతో సీన్ రివర్స్**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి(సినీ నటుడు అల్లు అర్జున్ మామ) సైతం బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల నియోజకవర్గంలో కేసీఆర్(కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి) ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు విపరీతంగా చేపట్టారు. దీనికితోడు అల్లుడి సినీ గ్లామర్‌తోపాటు కంచర్లకు ఇక్కడ ఉన్న బంధువులు, స్నేహితులు తదితర అంశాలు కలిసొస్తాయని భావిస్తున్నారు. ఇదే సమయంలో గతంలో ఆయనకు ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేసిన అనుభవం కొంత కలిసొస్తుందని సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు. తాజాగా పెద్దవూరలో కంచర్ల కన్వెన్షన్ ప్రారంభోత్సవానికి సినీ నటుడు అల్లు అర్జున్ రావడం.. అది కూడా అసెంబ్లీ ఎన్నికల సీజన్ ముమ్మరవుతున్న వేళలో కావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. అసలే అధికార బీఆర్ఎస్ పార్టీలో నేతల మధ్య గ్రూప్ వార్‌తో సతమతమవుతున్న క్యాడర్‌ను కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి ఎంట్రీతో మరింతగా కన్ఫ్యూజన్‌లో పడేసిందనే చెప్పాలి.

# ముస్లిం దంపతుల దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

దాడి చేయడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. గత శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ చక్రేష్ మిశ్రా తెలిపారు. ఆయన, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సీతాపూర్ ప్రాంతానికి చెందిన అబ్బాస్, కమ్రుల్ నిషాల కుమారుడు షౌకత్ అదే ప్రాంతానికి చెందిన రాంపాల్ కుమార్తె రూబీ ప్రేమించుకున్నారు.

2020లో మైనర్‌గా ఉన్న రూబీని 28 ఏళ్ల షౌకత్ అపహరించాడంటూ ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 13 నెలల జైలు జీవితం అనంతరం విడుదలయ్యాడు. ఈ ఏడాది జూన్‌లో మళ్లీ షౌకత్, రూబీ పారిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదైంది. అప్పటికే మేజర్ అయిన రూబీ షౌకత్‌కు అనుకూలంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చింది. ఆ తరువాత వేరొక కేసులో షౌకత్‌ను రెండు నెలల క్రితం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. రాంపాల్ కుటుంబ సభ్యులు షౌకత్ తల్లిదండ్రులు అబ్బాస్, కమ్రుల్ నిషాలపై శుక్రవారం ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేశారు.

దీంతో, అక్కడికక్కడే ప్రాణాలు విడిచారని స్థానికులు చెప్పారని ఎస్‌పి తెలిపారు. గ్రామంలో పోలీసు బలగాలను మోహరించామని చెప్పారు. ఈ కేసులో రూబీ సోదరుడు, ఆమె బావ, ఆ కుటుంబ స్నేహితుడిని అరెస్టు చేశామని తెలిపారు. ఆమె తల్లిదండ్రుల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

# నేడు బీఆర్ఎస్ తొలి జాబితా

(మొదటిపేజీ తరువాయి)

అవినీతి, అక్రమాల ఆరోపణలు, భూ కబ్జాలు వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొనే ముఖ్యమంత్రి వారికి టిక్కెట్లు నిరాకరిస్తున్నారని ప్రచారం జరుగుతుంది. టిక్కెట్ల కోసం ఇప్పటికే ప్రగతిభవన్ చుట్టూ నేతల ప్రదక్షిణలు కొనసాగుతున్నాయి.

ఈ తాకిడి తట్టుకోలేకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అమెరికా వెళ్లిపోయారు. ఇక్కడి పరిస్థితులు కాస్తో కూస్తో సద్దుమణిగాక, ఓ వారం తర్వాత ఆయన తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు. ఈలోపు స్థానికంగా బుజ్జగింపులు, సర్దుబాట్లు చేసుకోవాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. టిక్కెట్లు రాని సిట్టింగులకు పార్టీ అధిష్టానం ఇప్పటికే సమాచారం ఇచ్చేసినట్టు ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో అసంతృప్త నేతలకు ప్రగతిభవన్ గేట్లు తెరుచుకుంటాయో లేదో అనే చర్చ ఇప్పుడు కొనసాగుతుంది.

# పెరుగుతున్న మూఢనమ్మకాలు, మత విశ్వాసాలు

- సమాజానికి సైంటిఫిక్ టెంపర్ అవసరం
- ప్రొఫెసర్ పద్మజా షా



**నవతెలంగాణ-బంజారాహిల్స్**

ప్రసార మాధ్యమాలు మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలను పెంచి పోషిస్తున్నారని, రాజకీయ నాయకులే వాటిని పెంచిపోషిస్తున్నారని ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం ప్రొఫెసర్ పద్మజా షా అన్నారు. ఆదివారం జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మూఢనమ్మకాల నిర్మూలన-మీడియా పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పద్మజా షా మాట్లాడుతూ.. సీరియల్స్, సినిమాలు, సోషల్ మీడియా వేదికగా ప్రజలను భక్తి భావంలో ముంచెత్తుతున్నారని తెలిపారు. దాంతో ప్రజల్లో భయం, అభద్రతా భావం పెంచుతూ రాజకీయ లబ్ది పొందుతున్నారని విమర్శించారు. ప్రజలు రాజకీయ నాయకులను ప్రశ్నించకుండా భక్తి, ఆధ్యాత్మికత, మూఢనమ్మకాలు.. రక్షణ కవచాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. సమాజానికి సైంటిఫిక్ టెంపర్ అవసరం అన్నారు. సమాజంలో ప్రముఖపాత్ర పోషించాల్సిన మీడియా.. పెట్టుబడిదారులు, వ్యాపారస్తుల చేతుల్లో బందీగా మారిందని, ఇలాంటి మీడియా నుంచి వాస్తవాలు, నిజాలను ఆశించడం అతిశయోక్తి అన్నారు. 1980వ దశకంలో టీవీల్లో సాంస్కృతిక, పురాణ ధారావాహికలు ప్రసారమయ్యేవని, అవి సంస్కృతికి అద్దం పట్టేలా ఉండేవన్నారు. 90వ దశకం వచ్చే సరికి సంస్కృతి మతం వైపు మళ్లిందని, అది రథయాత్రలు, బాబ్రీ మసీదు కూల్చివేతల వరకు వెళ్లిందని తెలిపారు. గతంలో ఎన్నో చైతన్యవంతమైన సీరియళ్లు, కార్యక్రమాలు, చర్చా గోష్టిలు జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య దాదాపు తగ్గిపోయిందన్నారు. సమాజానికి సైంటిఫిక్ టెంపర్ అవసరం అన్నారు. మంచి, చెడు అనే విచక్షణను కోల్పోయినప్పుడే నేరాలు జరుగుతాయన్నారు. ఇప్పటికైనా మీడియా ధోరణి మార్చుకొని ప్రజలకు ఉపయోగకర, శాస్త్రీయమైన కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేయాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సోమ మరల మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి సమస్యకూ పరిష్కారం ప్రశ్నతోనే మొదలవుతుందని, ఈ ప్రశ్నతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యమని తెలిపారు. కానీ నేటి పాలకులు ప్రశ్నను చంపడానికి ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే డార్విన్ పరిణామ సిద్ధాంతం, పిరియాడికల్ టేబుల్ తొలగింపును చేపట్టారని విమర్శించారు. శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి సాధించినప్పుడే ఏ దేశమైనా వృద్ధి చెందుతుందని స్పష్టంచేశారు. అందుకు ప్రతి విద్యార్థి, ప్రజల్లోనూ ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తూ మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రతి సైన్స్ కార్యకర్త కృషి చేయడమే దభోల్కర్‌కు మనమిచ్చే గొప్ప నివాళి అని చెప్పారు. బ్రేక్ త్రూ సైన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం పూర్తిగా అసంబద్ధంగా ఉందన్నారు. విద్యకు బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే విద్యావ్యవస్థ మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల వ్యతిరేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కార్యదర్శి రాజా, కోశాధికారి వరప్రసాద్, నాయకులు వెంకటరమణ, లింగస్వామి, జగన్మోహన్‌రావు, కురుమయ్య, రవీందర్ పాల్గొన్నారు.

# పింఛన్లు పెంచుతాం

(మొదటిపేజీ తరువాయి)

టన్నుల వడ్లు పండించబోతున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో వలస పోయినవాళ్లంతా వాపస్ వచ్చారని గుర్తుచేశారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచిందని తెలిపారు. తలసరి విద్యుత్ వినియోగంలోనూ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు తగ్గిపోయాయని తెలిపారు. ఒకప్పుడు ఫ్లోరైడ్‌తో ఇబ్బంది పడిన రాష్ట్రం ఇప్పుడు జీరో ఫ్లోరోసిస్ స్టేట్‌గా మారిందన్నారు. వీఆర్‌వో వ్యవస్థతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అందుకే తొలగించామన్నారు. కాళేశ్వరం నీళ్లు.. 480 కి.మీ ప్రయాణించి సూర్యాపేట జిల్లాకు వస్తున్నాయన్నారు. అందరి కృషితోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున నిధుల మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 4 మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. సూర్యాపేట మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ.50 కోట్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు గెలిచినట్టేనని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని సీఎం కేసీఆర్ కోరారు. సభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజని కుమార్, మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్ర నాయక్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, భాస్కర్ రావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కలెక్టర్ యస్.వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

# మిత్రుడికి మోడీ..కుటుంబానికి కేసీఆర్ దోచి పెడుతున్నారు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**




ప్రధాని మోడీ తన మిత్రులకు దోచి పెడుతుంటే... సీఎం కేసీఆర్ రాష్ట్ర సంపదను తన కుటుంబ సభ్యులకు దోచి పెడుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. బీజేపీది విభజించు, పాలించు విధానమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి.. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడలోఉన్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఆయన 79వ జయంతి సందర్భంగా పార్టీ నేతలతో కలిసి రేవంత్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారని గుర్తు చేశారు. 'రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వ హక్కులు, అధికారాలు కల్పించారని తెలిపారు. స్థానిక సంస్థలను బలోపేతం చేశారని, దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారని వివరించారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారని తెలిపారు. సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఆయన..'ఐటీ రంగంలోనే కాదు, టెలికాం రంగంలోనూ సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబమని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఆయన స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. మణిపూర్ మండుతున్నా.. ప్రధాని అక్కడి ప్రజలకు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాణానికి బొమ్మా బొరుసులాంటివన్నారు. వారిద్దరిది ఫెవికాల్ బంధమని ఎద్దేవా చేశారు.

**రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డికి రేవంత్ శుభాకాంక్షలు**

కాంగ్రెస్ అత్యున్నత స్థాయి కమిటీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి ఎంపికైన నాయకులకు రేవంత్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుంచి మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజానర్సింహ, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డికి అవకాశం ఇచ్చినందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీలకు ధన్యవాదాలు తెలిపారు.

# గాలివాటమేనా?

## ఎంఐఎం 50సీట్లలో పోటీ చేస్తుందా?

- పాత బస్తీకే పరిమితమవుతుందా?
- అక్బరుద్దీన్ మాటల వెనుక అంతర్యమేంటి?
- బీఆర్ఎస్‌తో ఒప్పందం కుదిరినట్టేనా?
- ముస్లిం ఓటర్లు ఎటువైపు...
- చర్చనీయాంశంగా తాజా రాజకీయాలు





**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో మైనార్టీలు బలంగా ఉన్న 50 నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ఆ పార్టీ నేత అక్బరుద్దీన్ గంభీరంగా ప్రకటించారు. కానీ ఎంత ధీమాగా ప్రకటించారో అంతే వేగంగా వెనక్కి వెళ్లిపోయినట్టు కనిపిస్తున్నది. ఆ పార్టీ తిరిగి ఒక ఎంపీ, 8 అసెంబ్లీ స్థానాలకే పరిమితమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నా యి. 50 సీట్లల్లో పోటీ చేస్తామన్న ఎంఐఎం అకస్మాత్తుగా ఎందుకు మౌనంగా ఉంటుందనేది వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది. బీఆర్ఎస్ బలంగా ఉండి మైనార్టీ ఓట్లు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎంఐఎం పోటీ చేయకూడదనే అభిప్రాయానికొచ్చినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ బలంగా ఉండి మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉన్న చోట ఆ పార్టీని ఓడించేందుకు ఎంఐఎంను రంగంలో దించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఎన్నికల్లో పాత బస్తీకి పరిమితమై...బీఆర్ఎస్‌లో కలిసి పోవాలనే ఒప్పందం కుదిరింది కాబట్టే ఎంఐఎం వెనక్కి తగ్గిందనే ప్రచారం జరుగుతున్నది.

**అధికార పార్టీకి ఎంఐఎం జై...జై**

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి జై కొట్టే ఎంఐఎం...తాజాగా శాసనసభలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను ఆకాశానికెత్తింది. ఈ పరిణామాల నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీతో కలిసి ప్రయాణం చేయడం లాంఛనమేననే అభిప్రాయం నెలకొంది. రాష్ట్రంలో ఎంఐఎం అక్కడక్కడ పోటీ చేయడం మూలంగా ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే దిశగా చర్చలు జరుగుతున్నాయి. నాడు కాంగ్రెస్‌తో కలిసి ప్రయాణించినా, నేడు బీఆర్ఎస్‌తో ప్రయాణిస్తున్నా...పాతబస్తీలో అభివృద్ధి ఏం జరిగిందనేది బేరిజు వేస్తున్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా దూసుకుపోతుందంటూ అధికార పార్టీ చెబుతున్నా...వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొత్త నగరం అభివృద్ధి అవుతున్నంతగా పాతబస్తీ అభివృద్ధి కావడం లేదనే విమర్శలున్నాయి. అందుకు ఎంఐఎం, అధికార పార్టీ అనుసరిస్తున్న వైఖరే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఇటీవల శాసనసభ సమావేశాల్లో కారు, గాలిపటం రానున్న ఎన్నికల్లో పరస్పర సహకారం ముందుకు పోతున్నాయనే సంకేతాలే ఇచ్చాయి. ఎంఐఎం శాసనసభ్యులు ఉన్నచోట బీఆర్ఎస్ బలహీనంగా ఉన్నది. అక్కడే ఎంఐఎం, అధికార పార్టీ కలిసి మెలిసి బాగానే ఉంటున్నాయి.

**హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో ఘర్షణే**

జిల్లాల్లో మాత్రం ఈ రెండు పార్టీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతున్నది. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా బోధన్, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, కామారెడ్డి, రాజేంద్రనగర్ తదితర నియోజకవర్గాల్లో ఆ రెండు పార్టీలు నిత్యం విమర్శించుకుంటున్నాయి. బోధన్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యే అభివృద్ధి చేయడం లేదంటూ ఎంఐఎం కార్పొరేటర్ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. మిగతా నియోజకవర్గాల్లోనూ అవే పరిస్థితులున్నాయి. ఈ క్రమంలోనే 50 సీట్లలో పోటీ చేస్తామన్న ఎంఐఎం ప్రకటన కారును కలవరపెట్టిందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అలా పోటీ చేస్తే ఓటు చీలిపోయి కాంగ్రెస్‌కు లబ్దిచేకూరుతుందని బీఆర్ఎస్ అంచనా వేస్తున్నది.

**బీజేపీ తరహాలోనే ఎంఐఎం కూడా మతతత్వ పార్టీయే...**

బీజేపీ తరహాలోనే ఎంఐఎం కూడా మతతత్వ పార్టీగా గుర్తింపుపొందిందనేది జగమెరిగిన సత్యం. మైనార్టీలను మోజార్టీ వర్గాలకు వ్యతిరేకంగా నిలబెట్టేందుకు రాజకీయ వేదికలను వాడుకుంటున్నది. హిందూ, ముస్లిం మధ్య ఐక్యతను సాధించడం కంటే దూరం పెంచేలా ఎంఐఎం వైఖరి ఉన్నది. గతంలో కొన్ని రాష్ట్రాల్లో ఇది అంతిమంగా బీజేపీ ప్రయోజనాలకే అవకాశమిస్తోంది. బీజేపీయే ఎంఐఎం రంగంలోకి దించడం ద్వారా మైనార్టీ ఓట్లు చీలిపోయి అక్కడ బీజేపీ విజయం సాధించిందనే కథనాలు వెలువడ్డాయి. అప్పట్లో ఇది ముస్లిం ప్రజలను సైతం ఆలోచింపజేసింది. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఆ పరిస్థితులు లేవనే చెప్పొచ్చు. ఎందుకంటే బీజేపీ బలహీనంగా ఉండటమే ఇందుకు కారణం. ఇదిలా ఉండగా బీఆర్ఎస్, ఎంఐఎం మైత్రి పట్ల కూడా ముస్లిం ప్రజల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముస్లిం ప్రజలు ఎలా స్పందిస్తారో అనేది వేచిచూడాల్సిందే...

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

## దారుణంగా దిగజారిన భారత ఆర్థిక వ్యవస్థ ◆ పెరిగిన నిరుద్యోగం ◆ క్షీణిస్తున్న ప్రయివేటు పెట్టుబడులు



భారత పౌరసత్వం వదులుకుంటున్న లక్షలాదిమంది...

'ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా' పుస్తక పరిచయంలో పరకాల ప్రభాకర్

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

భారత దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదస్థితిలో ఉందని ప్రముఖ రచయిత పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల వ్యూహ రచనలో ఎక్కడో లోపం కనిపిస్తున్నదని సందేహం వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం, మంచి పుస్తకం సంస్థల సంయుక్తాధ్వర్యంలో పరకాల ప్రభాకర్ రచించిన "ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా" పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా 23 శాతం యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారనీ, నిరుద్యోగ సూచీల్లో భారతదేశం స్థానం లెబనాన్, లిబియా, ఇరాన్ వంటి దేశాల సరసన ఉన్నదని తెలిపారు. ఇదే అంశంలో పొరుగున్న ఉన్న బంగ్లాదేశ్ 12వ స్థానంలో ఉన్నదని ఉదహరించారు. దేశంలో 2014-15 నాటికి 120 మంది బిలియనీర్లు ఉంటే, గడచిన పదేండ్లలో వీరి సంఖ్య 145కి పెరిగిందనీ, అదే సమయంలో 84 శాతం మంది ప్రజల నికర ఆదాయం క్రమంగా పడిపోతున్నదని విశ్లేషించారు. జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో తయారీరంగం పూర్తిగా కుదించుకుపోతున్నదనీ, కేంద్ర ప్రభుత్వం సాధించినట్టు చెప్తున్న 7 శాతం జీడీపీలో ఈ రంగానికి ఉన్న వాటా కేవలం 1.3 శాతం మాత్రమేనని తెలిపారు. విచిత్రంగా దేశంలో నైపుణ్యం కలిగిన శ్రామికులు కేవలం ఐదు శాతం మాత్రమే ఉన్నారనీ, భారతదేశంలో బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నా, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వారెవరూ ఆసక్తి చూపట్లేదనీ, వారంతా విదేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకే ఆసక్తి చూపుతున్నారని స్పష్టంచేశారు. గడచిన ఏడేండ్లలో ఏటా సగటున 1.5 లక్షల మంది భారతదేశ పౌరసత్వం వదులుకొంటున్నారనీ, ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేముందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలు కేవలం ప్రచారం కోసం ఏర్పాటు చేసుకున్నవే తప్ప, అమలు ఎక్కడా లేదన్నారు. 'బేటీ బచావ్-బేటీ పడావ్' నినాదంతో కేంద్రం ప్రకటించిన ఈ స్కీంకు కేటాయించిన నిధుల్లో 80 శాతం కేవలం ప్రచారం కోసమే ఖర్చు చేశారని ఉదహరించారు.

పుస్తక విశ్లేషణ చేసిన బహుగ్రంథ రచయిత ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి మాట్లాడుతూ పెట్టుబడిదారులు తమ వ్యాపార సామ్రాజ్యాల విస్తరణ కోసమే హిందూత్వను తెచ్చిపెట్టుకున్నారని విమర్శించారు. దేశంలో ప్రజాసమస్యల ప్రస్తావన పక్కకు వెళ్లిపోయి, హిందూత్వం, లౌకికవాదం చుట్టూ తిరుగుతున్నాయని చెప్పారు. కానీ గ్రామీణంలో ప్రజలు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నారనీ, వారికీ, రాజకీయపార్టీలకు మధ్య భారీ అంతరం కనిపిస్తున్నదని అభిప్రాయపడ్డారు.

'మంచిపుస్తకం' సమన్వయకర్త కొండూరి వీరయ్య మాట్లాడుతూ ప్రజల భాష, ప్రతిపక్షాల భాష వేర్వేరుగా ఉంటున్నాయని అన్నారు. హిందుత్వ అంటే హిందువులను దూషించినట్టు భావిస్తున్నారనీ, దీనికి ప్రత్యామ్నాయ పదాల సృష్టి జరగాలని చెప్పారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షత వహించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు పరకాల ప్రభాకర్ సమాధానాలు చెప్పారు.

> గడచిన పదేండ్లలో పెట్టుబడిదారులు బ్యాంకుల్లో చేసిన రూ.13 లక్షల కోట్ల అప్పుల్ని రద్దు చేశారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం రూ.100 లక్షల కోట్ల అప్పులు చేసింది. దేశ ఆర్థిక వ్యవస్థ పతనానికి ఇంతకంటే ఉదాహరణలు ఇంకేం కావాలి. దేశంలో 3 కోట్ల కుటుంబాలు వ్యవసాయాన్ని వదిలేసి, ఉపాధి కోసం వలసలు వెళ్లి పోయాయి. గ్రామీణ భారతం దుస్థితికి ఇది నిదర్శనం. ఇన్ని వైఫల్యాలు ఉన్నా, ఎన్నికలు జరిగిన ప్రతిచోటా బీజేపీ తిరిగి అధికారంలోకే వస్తున్నది. తమ మతానికి వారేదో చేస్తారనే మెజారిటీ ప్రజల భ్రమలే దీనికి ప్రధాన కారణం. అందువల్లే వారు ప్రశ్నించేందుకు సిద్ధపడట్లేదు. ఈ భ్రమల్ని తొలగించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాల్సిన బాధ్యత కచ్చితంగా పౌరసమాజం, మేధావివర్గం, ప్రతిపక్ష రాజకీయపార్టీల పైనే ఉన్నది. దేశంలో దాదాపు 18 శాతంగా ఉన్న మైనారిటీ ప్రజల ఓట్లు తమకు అవసరమే లేదని బాహాటంగా ప్రచారం చేస్తున్నారంటేనే దేశం ఎంతటి ప్రమాదాల అంచున ఉందో అర్థమవుతున్నది. ఈ విద్వేష మాటలు ఎర్రకోటపై నుంచి వినిపించకముందే, సంస్కరిం చాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.



## ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి

**టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్**

**నవతెలంగాణ-అడవిదేవులపల్లి**

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. యాత్ర విజయవంతం కోసం ఆదివారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం పరిధిలోని ముదిమణిక్యం, గోన్య తండా, దుద్య తండా, జిలకర కుంట తండా, కొత్తూరు, చింత చెట్టు తండా, మొల్కచర్ల, చిట్యాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగ సమస్యలు, పోడు భూములు సాగు చేస్తున్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ముఖ్యంగా బీజేపీ విధానాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, దానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించడానికి ప్రజలను చైతన్యవంతం చేసేందుకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం అడవిదేవులపల్లి మండలానికి వస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి చైతన్య యాత్రలో పాల్గొంటున్నారని, ఈ యాత్రలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధీరావత్ రవి నాయక్, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, మండల కార్యదర్శి జిటంగి సైదులు, శివ, సర్వయ్య, రాంబాబు, కోటి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

---

### కాంట్రాక్ట్ అధ్యాపకులను

## రెగ్యులరైజ్ చేయాలి

**ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**

- కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సామూహిక సమరదీక్ష



**నవతెలంగాణ-అడిక్‌మెట్**

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎంపీ ఆర్. కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ (ధర్నాచౌక్) ఎదుట కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిర్వహించిన సామూహిక సమరదీక్షకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు బడ్జెట్ సేల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను బోధిస్తున్న అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏండ్లకు పైగా పనిచేస్తూ యూనివర్సిటీ ఉన్నతికి కృషి చేస్తున్నారని, అలాంటి వారిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్. కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోతే అది శ్రమ దోపిడీ అవుతుందని, ఒకవైపు ప్రయివేటు యూనివర్సిటీలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేయడం చూస్తుంటే.. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యను దూరం చేయడమే అవుతుందన్నారు. విశ్వవిద్యాలయాలను స్తంభింపజేసేలా ఉద్యమ కార్యచరణ రచించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ దీక్షలో కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ చైర్మెన్ వేల్పుల కుమార్, ఓయూ జేఏసీ చైర్మెన్ ఉపేందర్, నాయకులు తాళ్లపల్లి వెంకటేష్, బీర్ల రాజు, భవాని, రాధిక, శ్రీధర్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, సీహెచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌కు రూ.250 కోట్ల తక్షణ సాయం

**ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్**



**నవతెలంగాణ- హన్మకొండ**

వరంగల్ నగరంలోని వరద బాధితులకు తక్షణ సహాయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేసిందనివరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. ఆదివారం హన్మకొండ జిల్లా కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ(కుడా) కార్యాలయంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, కుడా చైర్మెన్ సుందర్ రాజ్ యాదవ్, తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020లో పెద్ద ఎత్తున వర్షం నమోదు కాగా నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, డ్రయినేజీలు, నాలాలు తెగిపోయాయన్నారు. అప్పుడు నగరాన్ని సందర్శించిన మంత్రి కేటీఆర్ తక్షణ సాయం కింద రూ.20 కోట్లు తర్వాత రూ.100 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. ఈ ఏడాది అంతకంటే రికార్డు స్థాయిలో 275 మి.మీ వర్షపాతం నమోదయిందన్నారు. దాంతో నీట మునిగి ముంపునకు గురయిన సమ్మయ్య నగర్, రామ్ నగర్, జవహార్ నగర్, తదితర కాలనీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రూ.1000 కోట్ల వరకు ఎస్టిమేషన్స్ పంపించినట్టు తెలిపారు. దాంతో తక్షణ సహాయం కింద రూ.250 కోట్లు కేటాయించారని, అందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణకు గురైన నాలాలను పూర్తిగా తొలగించే దిశగా ఆదేశాలున్నాయని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనేక ముంపు ప్రాంతాలను సందర్శించి రూపాయి కూడా ఇవ్వలేదని, ఆర్థికంగా కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందించలేని దుస్థితిలో ఉన్నారని ఆరోపించారు. కేంద్రం నుంచి ఏం నిధులు తెచ్చి నగరాభివృద్ధికి కృషి చేశారో వరంగల్ నగర ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని తెలిపారు. తక్షణ అభివృద్ధి కింద చేపట్టాల్సిన పునర్నిర్మాణ పనులపై అధికారులనూ ఆదేశించినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు అవగాహన లేని మాటలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, అశోక్ యాదవ్, రంజిత్ రావు, కుడా మాజీ డైరెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.

---

### దేశంలో తొలి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ

## మాతా, శిశు సంరక్షణ కేంద్రం

**గాంధీ ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు**




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

దేశంలో తొలి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ మాతా, శిశు సంరక్షణ కేంద్రం గాంధీ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చింది. 200 పడకలతో కూడిన ఈ ఆస్పత్రిని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో 200 పడకలు గర్భిణులు, 100 పడకలు శిశువుల కోసం ఉన్నాయని తెలిపారు. వీటికి తోడు సూపర్ స్పెషాలిటీ కింద మరో 200 పడకలతో మొత్తం 500 బెడ్లకు చేరింది. దీంతో పాటు ఆధునిక డైట్ కిచెన్‌ను, 33 నియోనాటల్ అంబులెన్సులను మంత్రి ప్రారంభించారు.

**మరింత తగ్గనున్న మాతా, శిశు మరణాలు**

కొత్తగా వచ్చిన సూపర్ స్పెషాలిటీ మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, 33 నియోనాటల్ అంబులెన్సులతో తల్లులు, పిల్లల మరణాల సంఖ్య మరింత తగ్గుతుందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్లిష్ట నవజాత కేసులను మారుమూల ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు తరలించే క్రమంలో మరణాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దీన్ని నివారించేందుకు 33 జిల్లాల్లో 33 నియోనాటల్ అంబులెన్సులను అందుబాటులో పెడుతున్నట్టు తెలిపారు. దీంట్లో ఆక్సిజన్‌తో పాటు అన్ని సదుపాయాలుంటాయని వివరించారు. గాంధీలో నూతన ఆరోగ్య కేంద్రంతో పాటు నిమ్స్, అల్వాల్ టిమ్స్‌లో ఒక్కో ఆస్పత్రిలో 200 పడకల చొప్పున సూపర్ స్పెషాలిటీ మాతా, శిశు ఆరోగ్య కేంద్రాలు రానున్నాయని వెల్లడించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఎక్కువ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న తల్లులు, పిల్లలకు చికిత్స చేసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. గర్భిణులకు డయాలసిస్ సేవలున్నాయని చెప్పారు. గుండె, కిడ్నీ, కాలేయం, న్యూరో తదితర మల్టిపుల్ వ్యాధులతో బాధపడే తల్లులకు, పిల్లలకు సూపర్ స్పెషాలిటీ సేవలందుతాయని తెలిపారు. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌తో పాటు పలు రకాల చర్యలతో ఇప్పటికే మాతా, శిశు మరణాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. దేశంలోనే అతి తక్కువగా తల్లులు, శిశువుల మరణాలున్న మూడో రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు.

### త్వరలో సంతాన సాఫల్య కేంద్రం

పెట్లబురుజు ప్రసూతి ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రాలను త్వరలో సంతాన సాఫల్య కేంద్రాలను ప్రారంభించనున్నట్టు మంత్రి హరీశ్ రావు తెలిపారు. వీటితో పాటు గాంధీ ఆస్పత్రిలో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్ ను కూడా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. క్వాలిటీ మేనేజ్మెంట్, హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్మెంట్లో తొలిసారిగా గాంధీ ఆస్పత్రికి ఐఎస్ఓ సర్టిఫికేషన్ రావడం పట్ల మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు వాణీదేవీ, బేగ్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

---

## టిక్కెట్ ఉత్కంఠ

**బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో టెన్షన్.. టెన్షన్**

- కాంగ్రెస్‌లో కాక పుట్టిస్తున్న అభ్యర్థిత్వాలు
- పొంగులేటి పోటీ చేసే స్థానంపై ఆసక్తి




**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల కోసం కసరత్తు ముమ్మరం అవుతోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే.. ఆయా పార్టీలు అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నాయి. మీడియాల్లో వస్తున్న పేర్లపై స్పష్టత కోసం ఆయా పార్టీల శ్రేణులు ఆరా తీస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నుంచి కొన్ని మీడియాల్లో ఐదుగురు సిట్టింగ్‌లకే టిక్కెట్లు ఖరారు అయినట్టు వార్తలు వస్తుండగా.. మరికొన్ని ఏడుగురు, తొమ్మిది మందని వెల్లడిస్తున్నాయి.

కమ్యూనిస్టులు, బీఆర్ఎస్ పొత్తు అంశం ఓ కొలిక్కి రాకముందే వెలువడుతున్న ఈ జాబితాలపై ఆయా పార్టీల శ్రేణుల్లో సందిగ్ధత నెలకొంది. కమ్యూనిస్టుల కేంద్రీకరణ నియోజకవర్గాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం వస్తున్న కథనాలు నమ్మశక్యం కాకపోవచ్చనే అభిప్రాయం పలువురి నుంచి వెలువడుతోంది. మరోవైపు పోటీ కోసం దరఖాస్తుల ప్రక్రియను కాంగ్రెస్ శుక్రవారం నుంచి ప్రారంభించింది.

**పుకార్లు షి'కారు'..!**

బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాపై పుకార్లు షి'కారు' చేస్తున్నాయి. వైరా మినహా మిగిలిన అభ్యర్థుల జాబితా అంతా క్లియర్.. సిట్టింగ్‌లకే టిక్కెట్లు ఖరారు అయినట్టు వస్తున్న వార్తల్లో నిజమెంత అనే దానిపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో పది స్థానాలకుగాను ఐదుగురు అభ్యర్థుల విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప ఎలాంటి మార్పులూ ఉండకపోవచ్చు. వీరిలో ఖమ్మం నుంచి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి సండ్ర వెంకటవీరయ్య, పినపాక రేగా కాంతారావు, అశ్వారావుపేట మెచ్చా నాగేశ్వరరావు, ఇల్లెందు బాణోత్ హరిప్రియల విషయంలో ఒకింత స్పష్టత ఉండగా.. మిగిలిన స్థానాలపై సందేహాలు నెలకొన్నాయి. 21వ తేదీన సీఎం కేసీఆర్ తొలి జాబితా ప్రకటించే చాన్స్ ఉందని వార్తలు వస్తున్నాయి.

**'హస్తం' ఆచితూచి..**

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాల విషయంలోనూ మీడియాల్లో రకరకాల వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే పలువురికి టిక్కెట్లు ఖరారైనట్టు వార్తలు వెలువడుతున్నాయి. దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం మొదలవ్వగానే మొదటి దరఖాస్తు జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం నుంచి మానవతారాయ్ సమర్పించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం పార్టీకి చేసిన సేవలు, సర్వేలు, గెలుపు ప్రాతిపదికన అభ్యర్థుల జాబితా తయారు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అశ్వారావుపేట ఆశావహుల్లో ఒకరైన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై విమర్శలు చేశారు. పొంగులేటిపై తాటి చేసిన కామెంట్స్‌ను మానవతారాయ్ ఖండించారు. వివిధ నియోజకవర్గాల్లో పొంగులేటి తరఫు అభ్యర్థులుగా భావిస్తున్న నేతలు మాత్రం 'చాపకింద నీరులా..' తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లా నుంచి భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్కతో పాటు పొంగులేటికి మాత్రమే ప్రస్తుతానికి టిక్కెట్లు ఖాయమని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

**పొంగులేటి పోటీ ఎక్కడ...?**

దరఖాస్తుల ప్రక్రియలో భాగంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలోని మూడు జనరల్ స్థానాలు పాలేరు, ఖమ్మం, కొత్తగూడెంల నుంచి దరఖాస్తు చేస్తారని తెలుస్తోంది. దీనిలో సర్వేలో మెజార్టీ వచ్చిన స్థానం నుంచి ఆయన పోటీ చేస్తారని అంటున్నారు. ఇప్పటికే కొత్తగూడెంలో ఇల్లు నిర్మించి, కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఆయన అక్కడి నుంచే పోటీ చేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. కానీ ఇది వ్యూహంలో భాగమని, ఖమ్మం నుంచే పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని అనుచరుల్లో అత్యధికులు చెబుతున్నారు. పొత్తులు, ఎత్తులు కొలిక్కి వస్తేగానీ పొంగులేటి ఏ స్థానం నుంచి పోటీ చేస్తారనే అంశంపై స్పష్టత వస్తుందని విశ్లేషకుల అంచనా.

---



### మోడీ సర్కార్ ఆదేశాలతోనే

## సూర్జిత్ భవనంపై దాడి

**సెప్టెంబర్ ఒకటి నుండి 7 వరకు అధిక ధరలు, నిరుద్యోగంపై దేశవ్యాప్త ఆందోళనలు**

- 10 నుండి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు : సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

**నవతెలంగాణ-సూర్యాపేట**

ప్రగతిశీల శక్తులకు భయపడిన మోడీ సర్కార్ ఢిల్లీలోని సూర్జిత్ భవన్‌పై దాడికి పాల్పడిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీ20 సమావేశాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని హరికిషన్ సుర్జిత్ భవన్‌లో కవులు, కళాకారులు, మేధావులు ఈనెల 18, 19 తేదీల్లో సమావేశాలు నిర్వహించుకుంటుంటే అడ్డుకున్న పోలీసులు.. మీటింగ్‌కు పర్మిషన్ లేదని, రద్దు చేసుకోవాలని చెప్పడం బీజేపీ కుట్రలో భాగమేనన్నారు. ఈ సంఘటన బీజేపీ నియంతృత్వ పోకడకు నిదర్శ మన్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలపై సెప్టెంబర్ ఒకటి నుండి 7 వరకు వారం రోజులపాటు దేశ వ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

దేశంలో రోజురోజుకు పేదల సంఖ్య, దరిద్రం పెరుగుతుందని, కోటీశ్వరుల సంఖ్యా పెరుగుతోందని, గతంలో దేశంలో 124 మంది కోటీశ్వరులు ఉంటే ప్రస్తుతం 145 మంది ఉన్నారన్నారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలను అన్ని పోరాట కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని, తెలంగాణలో బీజేపీ ఆటలను కట్టడి చేయడం కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంపీ రమణ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజుగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు అబ్బగాని భిక్షం, మడ్డి అంజిబాబు, మామిడి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

### కొడుకు కొట్టాడని..

## వృద్ధ దంపతుల ఆత్మహత్య

**ఆస్తి తగాదాలే కారణం**



**నవతెలంగాణ - చందుర్తి**

కొడుకు, కోడలు ఆస్తి కోసం గొడవ చేయడంతో పాటు, కొడుకు తల్లిదండ్రులను కొట్టడంతో వారు మనస్తాపానికి గురై పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనికరపు దేవయ్య(70), లక్ష్మి నర్సవ్వ(65) దంపతులకు ఇద్దరు కొడుకులు రవీందర్, మల్లేశం ఉన్నారు. వీరిద్దరూ ఆస్తి పంపకాలు చేసుకొని ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. కాగా, పెద్ద కొడుకు రవీందర్ తన ఇంటికి దారి లేదని, తల్లిదండ్రుల ఉన్న పాత ఇంటిని కూల్చి వేయాలని వారిపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తల్లిదండ్రులపై దాడి చేసి, ఇంట్లో ఉన్న కుల దేవాన్ని ఇంటినుంచి బయటకు తీసుకెళ్తామని గొడవకు దిగారు.

దాంతో తీవ్ర మనస్తానికి గురైన దంపతులు ఇంట్లోనే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం 6 గంటల సమయంలో ఇంట్లో దైవాన్ని బయటకు తీసుకురావడానికి కుటుంబసభ్యులతో వెళ్లిన ఒగ్గు వాళ్లు ఇంటి తలుపులు తట్టగా.. వారు తీయలేదు. దాంతో అనుమానం వచ్చి చిన్న కొడుకు మల్లేశం ఇంటి పైకి ఎక్కి చూడగా.. తల్లిదండ్రులిద్దరూ విగత జీవులుగా పడిఉన్నారు. వెంటనే వారిని వేములవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చిన్న కొడుకు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

## పాటొక్కటే...

ఏమనుకున్నా అనుకోకపోయినా
దేహం మట్టిలోకి ఇంకిపోయింది

దుఃఖం మాత్రం ఒంటరిగా మిగిలిపోయింది
పాట అజరామరమయింది

తనొక్కడే జనం మధ్యలోంచి
కదలి వెదలి పోయాడు

అలుపెరుగని గజ్జెలు
గోడకు చేరువయ్యాయి

నేల నుండి వింగికెగిరే ఎరుపు రుమాలు
తన గుండెలపై వాలిపోయింది

వేల గొంతులలో పాట మారుమోగుతోంది
అరణ్యం మౌనంగా సెల్యూట్ చేసింది!!

**- కెక్యూబ్ వర్మ, 9493436277**



## రాలిపోయిన ఎర్ర మందారం


అతడో అంతులేని పాటల పుట్ట
సమస్యల కొమ్మలపై వాలిపోయే పిట్ట
అన్యాయపు సంకెళ్ళ పై అదును చూసి
మాటల బంతులను విసరడంలో దిట్ట
అతడొక ధిక్కార స్వరం
పీడిత ప్రజల పక్షాన మండిన అగ్నిగోళం

కాలికి గజ్జె ను కట్టుకొని, భుజాన గొంగడేసుకొని
రాగమై మొలకెత్తి
పాటని ఫలహారం లెక్క పంచినాడు
ప్రశ్నల కొడవళ్ళను ఎక్కుపెడుతూ
సర్కారుపై మాటల ఫిరంగులను పేల్చినాడు
కాళ్ళకు చక్రాలను కట్టుకొని
అడవి మల్లెల చెంతకు చేరిపోయి
తిరుగుబాటు దారాలను పేని
ఎరుపెక్కిన ఎర్రమందారమై వికసించాడు

పెయ్యిలో తూటాను పెట్టుకొని
కాలం వంతెన పై కదిలిన ధీరుడతడు
అతుకుల బతుకుల పై అక్షర సేద్యం చేస్తూ
పాటల పంటను పండించే కర్షకుడతడు
అణచబడ్డ, చరచబడ్డ, గుడిసెలో జీవితాలు
గొల్లుమన్నప్పుడు మేఘమై ఉరిమాడు
నిప్పుల కొలిమి లా రగిలాడు

తెలంగాణ ఉద్యమంలో పొడుస్తున పొద్దై
సమరానికి జంగ్ సైరన్‌లా ఊపిర్లు ఊదాడు
తన కలం, గళం తోటి కోట్ల హృదయాలను
కొల్లగొట్టి జనం గుండెల్లో గూడు కట్టుకున్నాడు
గద్దరన్న అంటే ఒక పాటల నిఘంటువు
గద్దరన్న అంటే విప్లవాలకు వేగుచుక్క
గద్దరన్న అంటే అన్ని వర్గాలకు లైట్ హౌస్
పాట ఉన్నంత కాలం ప్రజల నాలుకలపై
నానుతూనే ఉంటాడు గద్దరన్న

**- తాటిపాముల రమేశ్ (తార), 7981566031**



# మహలఖా బాయ్ చందా
# శౌర్యం సౌందర్యం కవితా సౌరభం

"పురుషుడు యుద్ధాన్ని సృష్టిస్తాడు! స్త్రీ అద్భుతాలను సృష్టిస్తుంది".!! ఆమె అపురూప సౌందర్యరాశి. ఇంకా చెప్పాలంటే ఒక్కసారి కనినంతనే అచిరకాలం కనులలో నిలిచిపోయే రూపం ఆమెది. ఆమె హైదరాబాదు సంస్థానంలో 18వ శతాబ్దపు ఉత్తరార్ధంలో ఒక వెలుగు వెలిగిన వనితా శిరోమణి.

గజల్ గానం, రచన, నృత్యం ఇవి మాత్రమే ఆమె అందానికి మెరుగు లద్దలేదు. నవాబు వెంట కత్తి పట్టి యుద్ధభూమిలో వీరవిహారం చేసిన ధీశాలి ఆమె. ఆమె "మహలఖాబాయ్ చందా".

అసఫ్ జాహీల కాలంలో మొత్తం హైదరాబాద్ స్టేట్ ను ప్రభావితం చేసిన మహలఖా బాయ్ చందా 18వ శతాబ్దం ఉత్తరార్ధంలో ఇక్కడి సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసింది. కవులూ కళాకారుల చూపు హైదరాబాద్‌ను ఆకర్షించడం వందల ఏళ్ల కిందనే జరిగిందనడానికి ఇక్కడికి మహలఖా బాయ్ పూర్వీకుల రాకనే తార్కాణం. నిజానికి మహలఖాబాయి పూర్వీకులది గుజరాత్. ఆమె అమ్మమ్మ అహ్మదాబాదులో మొఘల్ ప్రభుత్వంలోని ఒక అధికారిని పెళ్లాడింది. ఆ తర్వాత భర్త దూరం కావడంతో తన ముగ్గురు కుమార్తెలతో కలిసి అహ్మదాబాదు నుండి బయలుదేరి సంప్రదాయ, జానపద, భక్తి గీతాలు పాడుతూ, నాట్యం చేస్తూ పలు ప్రాంతాలు తిరిగారు. ఆ సంచారంలో భాగంగా ఒకానొక రాజపుత్ర రాజును ఆశ్రయించి శాస్త్రీయ సంగీత నృత్యాలు నేర్చుకున్నారు. అక్కడి నుండి ఆమె తన కూతుళ్లతో బిర్హంపూరుకు తరలింది. కాలక్రమంలో వీరంతా మొఘల్ దర్బారులో నాట్యకత్తెలుగా మారారు. వీరినే ఆ కాలంలో 'తవాయిఫ్' లని పిలిచేవారు.

ఈ కాలంలో మహలఖాబాయ్ తల్లి తన పేరును "మహతబ్ రాజ్ కన్వర్ బాయి"గా మార్చుకుంది. "కన్వర్ బాయి" అంటే రాజులకు సేవ చేసే నాట్యగత్తె అనే అర్థం వస్తుంది. ఈ కాలంలోనే దక్కన్ రాజధాని ఔరంగాబాద్ నుండి హైదరాబాదుకు మారింది. రాజ పరివారంతో బాటు రాజ్ కన్వర్ బృందం కూడా హైదరాబాదుకు చేరుకుంది. హైదరాబాదు వచ్చిన తర్వాత రాజ్ కన్వర్ జీవితం మలుపు తిరిగిందనే చెప్పవచ్చు.

నిజాం సర్కారులోని ఖజానా విభాగంలో పనిచేసే ఒక ఉన్నతాధికారిని పెళ్లి చేసుకున్న రాజ్ కన్వర్ 1768 ఏప్రిల్ 7న చంద్రబింబం వంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. హైదరాబాదులో తను అత్యంత భక్తితో విశ్వసించే హజరత్ అలీ (దర్గా) ఆశీస్సులతో ఈ బిడ్డ పుట్టిందని ఆమె గట్టిగా నమ్మేవారు . ఇంకా చెప్పాలంటే మాహ్‌లఖా బాయి జననమే ఒక వింత కథ. ఆమె తల్లి ఆర్నెల్ల గర్భవతిగా ఉన్నప్పుడు మౌలాలీ గుట్ట మీద ఉన్న ఒక సూఫీ సాధువు దర్గా సందర్శనకు పోయింది. మెట్లు ఎక్కుతున్నప్పుడు ఆ కష్టం భరించలేక గర్భవిచ్ఛిత్తి జరిగే సూచనలు కనిపించినై. భర్త తాజ్ అలీషా ఒక్కడే పరిగెత్తి పైకి పోయి అక్కడి ప్రసాదాన్ని తెచ్చి ఆమెకు తినిపించగానే ప్రమాదం తప్పిపోయింది. తొమ్మిది నెలలు నిండిన తర్వాత పండంటి బిడ్డ 'మాహ్‌లఖా బాయి'ని కన్నది. ఆమె అసలు పేరు 'చాందా బీబీ'.

మహతబ్ కన్వర్‌బాయి పెంపకంలో, నిజాం అధికారి రుక్నుద్దౌలా అంతఃపురం కల్పించిన అవకాశాలతో విదుషీమణిగా ఎదిగిందామె. మహలఖా ఉర్దూ, పర్షియన్, అరబిక్ భాషలలో లోతైన అధ్యయనం చేసి, అపారమైన భాషా పాండిత్యాన్ని సంపాదించుకున్నది. "చందా" అనే కలం పేరుతో దక్కని ఉర్దూలో ఆమె అనేక పద్యాలు, గజల్లు రాశారు. తను రాసిన గజల్లను స్వయంగా పాడేవారు కూడా. చందా అన్న తకల్లూస్‌తో (కలం పేరు) ఆనాటి దక్కన్‌లోనే పేరు ప్రఖ్యాతులు గడిచిన కళావంతురాలు ఆమె. ఇక చిన్ననాటి నుంచే నాట్యం, సంగీతాలను అలవోకగా నేర్చుకున్నది మహలఖా. షియా సంగీతకారుడు, ధృపద్, ఖయాల్ రాగాలను అవపోసన పట్టిన ఖుషాల్‌ఖాన్ ఆమెకు తనదైన సంగీత సంప్రదాయాన్ని అందించాడు. ప్రముఖ కవి, చిత్రకారుడూ

నిజాం మహాలఖా బాయ్‌కి కానుకగా ఇచ్చిన భూము లలో నేడు నగరంలో ఉన్న పురానా హవేలీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంతం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ కార్యాలయ ప్రదేశాలు, ఆంధ్ర మహిళా కళాశాల, నేటి భాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఒకప్పటి మహాలఖా బాయి ఎస్టేట్‌లే. ఆమె తన జీవితకాలంలో మౌలాలీ గుట్టపై 'ఉర్సులను' ప్రతి యేటా ఘనంగా జరిపించేది.

అయిన తాజ్ అలీ స్నేహం ఆమెకు సాహిత్య కళారంగపు దారులు పరిచింది. మరో పార్శ్వంలో నాటి రెండో నిజాం ప్రభువు నిజాం అలీఖాన్ అసఫ్ ఝా దగ్గర ప్రధానిగా పనిచేస్తున్న అరిస్తుజా మహలఖాలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభా వ్యుత్పత్తులను గుర్తించి ఆమెను ప్రోత్సహించాడు. రెండో నిజాంకు పరిచయం చేశాడు. నిజాం ఆమెకు తమ ఆ స్థానంలో రాజనర్తకి హోదా కల్పించారు. క్రమంగా ఆమె నిజాంకు నమ్మకమైన సలహాదారుగా మారింది. ఇంతలో జాన్ మాల్కమ్ అనే హైదరాబాదు రెసిడెన్సీలో పనిచేస్తున్న అధికారితో ఆమె ప్రేమలో పడింది. మరో వైపు సాక్షాత్తు నిజాం ప్రభువే ఆమెపై మనసుపడ్డాడు. కానీ ఆమె తను జీవితాన్ని స్వేచ్ఛగా గడిపడానికే ఇష్టపడింది.

"పువ్వుగా వికసించాలని ప్రతిమొగ్గ
తన ఆత్మను పిడికిలిలో దాచుకుంటుంది!"

"ప్రేమబాణం కత్తి కంటే హంతకమైనది!!
ఇది ఎందరో ప్రేమికుల రక్తాన్ని చిందించింది!!"

"కొవ్వొత్తిని నీచెంపతో
ఎలా పోల్చగలను?
కళ్ళలోని కొవ్వుతో
కొవ్వొత్తి గుడ్డిది!"

"చందా పెదవి పాడిగా ఎలా ఉంటుంది!
స్వర్గపు ప్రేమగీతమా!
ఆమె నీ మధు పాత్రను హరించింది."

మహలఖా బాయి సంగీత వేదికపై ఘజల్, ఖయాల్ ఏది గానం చేసినా అది సంగీత సరస్వతి ప్రత్యక్ష ప్రదర్శనమే అయ్యేది. రాజాస్థానంలో ఆమె నాట్యం దర్బారుకే అదనపు సొబగు అయ్యేది. 1801లో రాజదర్బారులో జరిగిన వసంతోత్సవంలో ఆమె చేసిన నాట్య విన్యాసం సభకుల "వహ్వా"లతో మారుమ్రోగింది. అందరూ మంత్ర ముగ్ధులయ్యారు. అదే సభలో ఆమె "మహలఖాబాయి' అనే బిరుదును సగర్వంగా అందుకుంది. ఆ తరువాత అదే పేరుతో కవయిత్రిగా, గాయనిగా విఖ్యాతి గాంచింది. నిజాం ఆంతరంగికురాలిగా రాజాస్థాన ఉద్యోగినిగా, వేట వినోదాల్లో మాత్రమేగాక యుద్ధవిద్యలలోనూ ఆరితేరింది. నిజాంతో కలిసి యుద్ధాలు చేసి విజయాలకు మూల కారణమైంది. ఫలితంగా నిజాం ఆమెకు అనేక సౌకర్యాలు కల్పించారు. అపారమైన భూ సంపదను ఆమెకు స్వంతం చేశారు. అంతా ఆమెను "మేడమ్ మూన్‌చీక్" అని అత్యంత గౌరవంగా పిలుచుకునేవారు. ఆనాడు ఒక్క నిజాం సంస్థానంలోనే కాదు మరో ఆరు సంస్థానాలతో ఆమెకు సాంస్కృతిక సంబంధాలుండేవి.



చందా రాజనీతిజ్ఞురాలిగా రాటుదేలి రాజకీయ, తత్త్వశాస్త్రాల్లో పట్టు సాధించింది. నాటి నిజాం ప్రధాని అరస్తు ఝా ఆ కాలపు అరిస్టాటిల్‌గా పేరుగాంచారు. ఆయన శిష్యరికంలో పాలనా సంబంధమైన అన్ని లోతుపాతులను తెలుసుకుని నిజాంకి ఆంతరంగిక సలహాదారు అయింది. యుద్ధాలు చేసి నవాబు గెలుపుకు కారణమైంది. తనదైన రాయబారాలు, యుక్తులతో ఎన్నో యుద్ధాలను చేయకుండానే గెలిపించిన ధీశాలి మహలఖా చందా. మీర్ అలీ



విజయాలన్నీ ఆమె సాధించిపెట్టినవే. నవాబు తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ మహలఖా ప్రమేయం ఉండేది. ఆమె సేవలకు నిజాం నవాబు నాంపల్లిలోని నిజాం రాజప్రాసాదం, పురానీహవేలీ దగ్గరలోని జాగీరు ను బహుమానంగా ఇచ్చారు. ఇప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం, అడిక్‌మెట్ భూములన్నీ ఒకనాటి మహలఖా ఎస్టేట్‌వే.

ఒక తవాయిఫ్ కడుపున పుట్టి, నిజాం రాచరికపు వ్యవస్థలో అత్యంత కీలక భూమిక పోషించి, తనదంటూ ఒక భిన్నమైన జీవన శైలిని అవలంభించిన మహలఖా బాయి తెలంగాణ సమాజపు తొలి స్త్రీ చైతన్య కెరటం. తన 24 ఏటనే తల్లి రాజ్ కన్వర్ మరణించగా మౌలాలీ లోని తన ఎస్టేట్లోనే ఆమె సమాధిని నిర్మింపజేసింది.

నిజాం మహాలఖా బాయ్‌కి కానుకగా ఇచ్చిన భూము లలో నేడు నగరంలో ఉన్న పురానా హవేలీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంతం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ కార్యాలయ ప్రదేశాలు, ఆంధ్ర మహిళా కళాశాల, నేటి భాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఒకప్పటి మహాలఖా బాయి ఎస్టేట్‌లే. ఆమె తన జీవిత కాలంలో మౌలాలీ గుట్టపై 'ఉర్సులను' ప్రతి యేటా ఘనంగా జరిపించేది. గుట్ట కింద ఒక పెద్ద పూలతోటను నిర్మించింది. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇఫ్లూ వద్ద మహలకా చంద మెట్లబావి ఉంది. చుట్టూ ఉండే భవనం మధ్యలో బావి ఆకారంలో ఉండటం దీని ప్రత్యేకత.

సుమారు రెండు దశాబ్దాలకు పైగా రెండవ నిజాం పాలనలో కీలకపాత్ర వహించిన మహలఖా చుట్టూ వంద మందికి పైగా అప్పట్లో అంగరక్షకు ఉండేవారంటే ఆమె స్థాయి ఎంతగొప్పదో అర్థమవుతుంది. ఆ మహావిదుషీమణి 1824 ఆగస్టులో హైదరాబాదులో 56వ ఏట తన జీవన యాత్రను ముగించింది. మౌలాలీలో తల్లి పక్కనే ఆమె సమాధిని నిర్మించారు. తెలంగాణలో తొలి మహిళా సాధికారతకు సంకేతంగా చెప్పుకునబడే మహలఖా బాయ్ చందా కీర్తి అజరామరం. ఆచంద్రతారార్కం.



**- హెచ్.రమేష్ బాబు, 7780736386**

## సునామీ

ఎప్పుడు ఎలా ప్రవేశించిందో తెలియదు
వాడి సర్వ వ్యవస్థలూ దానికి జోహుకుం
అయినాయి కరోనా కంటే వేగంగా
వాడి నరనరాన వ్యాపించింది చూడటానికి
ఇంకా మనిషిలా కనిపించే నరపిశాచిగా
మార్చేసింది మనిషితనాన్ని మింగి ద్వేషపు
విషాన్ని కక్కుతోంది ఆ
విద్వేషపు రక్కసిని దునుమాడేందుకు
జనసంద్రపు అల(ల)జడి సరిపోదు ఏకంగా
ఆ తల్లి కడుపు కల్లోలం ఊపిరులూదిన
సునామీ నెత్తుటిగుడ్డుకు పురుడు
పోయాలిప్పుడు...

**- కట్టా సత్య ప్రసాద్**

సాహితీ వార్తలు

### గద్దర్ స్ఫూర్తి సంచికకు రచనలు ఆహ్వానం

'ప్రజా యుయుద్ధ నౌక 'గద్దర్ యాదిలో బహుజన కెరటాలు మాసపత్రిక వెలువరించే స్ఫూర్తి సంచికకు రచనలను ఆహ్వానిస్తుంది. గద్దర్ జీవితం, ఉద్యమ ప్రస్థానాన్ని, పాటలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలను, కవితలను ఆగస్టు 31 తేదిలోపు bahujanakeratalu2001@gmail.com కు మెయిల్ చేయవలెను. లేదా 7989880088 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా పంపించవచ్చు.

### 25న తెలంగాణ సాహితి ఉర్దూ లిటరరీ ఫెస్ట్

ప్రసిద్ధ కవి, నాయకుడు మఖ్దూం మొహియుద్దీన్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ సాహితి ఉర్దూ లిటరరీ ఫెస్ట్ పేరిట కవి సమ్మేళనం నిర్వహించ నుంది. ప్రముఖ ఉర్దూ కవుల, రచయిత్రుల సందేశాలుంటాయి. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 25 శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది, వివరాలకు 9848516163, 9652432981, 9490099083 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

### యువ సాహిత్య ప్రతిభా పురస్కారం


కుసుమ ధర్మన్న కళా పీఠం ఆధ్వర్యంలో యువ సాహిత్య ప్రతిభా పురస్కారం కోసం యువకవుల/ కవయిత్రులు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కనీసం నాలుగు కవితలు ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడి నాలుగు పోటీలలో విజేతలుగా నిలిచిన వారు, 18 నుండి 35 ఏండ్లలోపు వారై ఉండాలి. విజేతలుగా నిలిచిన వారికి రూ.5,116/- బహుమతి అందజేస్తారు. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 31లోగా 9490841284 వాట్సాప్ నంబరుకు పంపవచ్చు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే సభలో పురస్కారం అందిస్తామని కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాధా కుసుమ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# మట్టిగూటిలో మగ్గే చెమట గింజల పంట!

ఇప్పుడు వస్తున్న కవిత్వంలో కలగాపులగముంది. అటుదిటు తిరగళ్ళమరగళ్ళేసి చెప్పడముంది. వస్తువు-శిల్పం మధ్య బంధమేదో, భేదమేదో తెలియదు. పదఢాంబికతతో భాషాశైలి పరితులకు మింగుడుపడదు. దాంతో కవిత్వాన్ని చదివేవారు కరువయ్యారు. కవిత్వం తెలిసిన కొంతమందే సంపుటాలను కొంటున్నారు. కథలకు, నవలలకైతే కొంత వరకు గిరాకీ ఉండనే ఉంది. అసలు కవిత్వంపై మోజు తగ్గడానికి గల కారణాలేమిటి? అని ప్రశ్నిస్తే, ప్రమాణ రహిత కవిత్వం కుప్పలు తెప్పలుగా వస్తున్నది. సామాజిక మాధ్యమాల్లోనైతే మరీను. కొంతమంది కవులు ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా ఉత్తమ సాహిత్య సృజన చేస్తున్నారు. కాకపోతే వారికి ఆదరణ దొరకటం లేదు. శ్రీశ్రీ, తిలక్, శేషేంద్రశర్మ, కాళోజి లాంటివారి కవిత్వంలా భావితరాల వారు ఉటంకించుకునే పరిస్థితి నేటి కవుల కవిత్వంలో మృగ్యం.

ఇలాంటి విపత్కర స్థితిలో ప్రామాణికమైన కవిత్వాన్ని అందిస్తూ, తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న వారు లేకపోలేదు. వారిలో సిక్కోలుకు చెందిన 'కంచరాన భుజంగ రావు' ఒకరు. ఇటీవల 'నీటి గింజల పంట' అనే ఉత్తమ కవిత్వాన్ని సాహిత్య లోకానికి పరిచయం చేశారు. కవిత్వానికి రుచి ఉంటుంది. అది రెండు మూడు నిమిషాల్లో పొయ్యి మీద నుంచి దించేయాలనుకున్న ఇగురు కూరలా వేడిగా, రుచిగా ఉండాలి. ఫ్రిజ్‌లో పెట్టి చల్లబడిన కూరలా అరుచిగా ఉండకూడదు. కవిత్వం తన రుచిలో స్వాభావికతను ఎప్పుడూ కోల్పోకూడదు. ప్రియంగా ఆస్వాదించేలా ఉండాలి. అలాంటి రుచిని తన కవిత్వంలో పుష్కలంగా నింపినవారు భుజంగరావు.

స్త్రీల రక్షణకు చట్టాలు ఉన్నా, వివక్షత యథేచ్ఛగా సాగుతున్నది. కడుపులోనున్న బిడ్డ ఆడపిల్లని తెలుసుకొని మరుక్షణమే భ్రూణహత్యలకు వెనుకాడని లోకమిది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కవి ఆడబిడ్డ కలిగి ఉండడాన్ని అపురూపంగా భావిస్తూ, ఆమెపై తనకు గల అవ్యాజ ప్రేమను ప్రకటించడం ఈ 'మా మిఠాయి పంట' లో చూడొచ్చిలా. **'మా జీవితాలను శోభాయమానం చేసిన/ పండోరా కాంతిధార/ ఏడు మల్లెలెత్తు సౌకుమార్యం/ పదహారణాల లావణ్యం/ అసలు తూకానికే పెడితే/ మా మనసెత్తు తులాభారం తను/ ఆ పూలబొమ్మ తోటిదే లోకం వర్ణార్ణవం/ తనే మా బతుకు పొలంలో/ మిఠాయి పంటయి జనించి ఉండకపోయుంటే/ ఏమైపోయేవాళ్ళమో'**




'నీటిగింజల పంట' కైత సిక్కోలు రైతును ఆవిష్కరి స్తున్నది. అతివృష్టి, అనావృష్టితో విలవిలలాడుతున్న జనం బతుకుతెరువు నిమిత్తం నగరాలకు వలసపోతున్నారు. వారు పల్లెలో ఉన్నప్పుడు అనేక కష్టాలు పడితే, పట్నం వెళ్ళాక కూడా సుఖపడడంలేదు. అంటే ఏదో తెలియని దుఃఖంలో మగ్గిపోతున్నారు. ఇలాంటి దయనీయ స్థితిలో కూడా ఉత్త రాంధ్ర ప్రజలు మొక్కవోని ధైర్యంతో తమ విధులను అక్కడ నిర్వర్తిస్తూ, శ్రామికఫలాలు అందరికీ అందించే త్యాగ మూర్తులుగా నిలుస్తున్నారు.

**'సూర్యుడు నిదురలేవాలన్నా/ పరగడుపున మా చెమట చుక్కలు కొన్ని/ అతడి గొంతులో పడాల్సిందే/ మా రెక్కల్ని మేం నమ్ముకోవాలేగానీ/ నింగినీదడం పెద్ద కష్టమేంగాదు మాకు'**

మట్టి గొప్పతనాన్ని ఎంతో అర్థవంతంగా కవి వివరిస్తున్నారు 'మౌనమే మట్టి రహస్యం'లో. పువ్వులు, ఆకులు, బండరాళ్లు, నీళ్ల గొప్పవిగా బడాయి పలుకుతున్నాయి. కానీ తమ ఉదాత్తతకు హేతువైన మట్టిని మాత్రం అహం భావంతో అవి గౌరవించలేకపోతున్నాయి. కానీ సమస్త జీవులకు జవ సత్వాలు ఇచ్చే రవిబింబం మాత్రం మట్టి విలువ తెలిసి నిరాడంబర జీవిగా కనబడుతున్నది. అంటే అన్ని పదార్థాలకు మూలం మట్టేనన్న ఎరుకతో ప్రేమగా మట్టిని స్పర్శిస్తున్న



ఉత్తరాంధ్ర వెనుకబాటు, వనరుల వినియోగంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రపంచీకరణ ప్రభావం, భూమి పరాయీ కరణ కావడం, ప్రత్యేక ప్యాకేజీలు లేకపోవడం, వలసలు, ప్రజారోగ్యం కోసం చాలామంది రాస్తున్నారు. అవన్నీ అవస రమే. అయితే, సమస్యల్ని సాహిత్యం ద్వారా తెలియజేస్తే సరి పోతుందా? ఈ సమస్యల్ని నిర్దిష్ట రాజకీయాలకి ముడిపెట నవసరం లేదా? అన్నవి ప్రశ్నలు

దిలా. 'మట్టి మౌనంగా ఒదిగిపోయింది/ సృష్టికి జీవం పోస్తూ'

'వర్చువల్ వాగులో ఒంటరి పక్షి'లో కవి అర్ధరాత్రి అపరాత్రి అనక స్మార్ట్‌ఫోన్ వీక్షణం చేస్తున్న యువతను ఎండగడతాడు. ఈ అల వాటు వారి ఆరోగ్యాన్ని అంతకంతకూ క్షీణింప జేస్తున్నది. లక్ష్యాల సాధనలో తడబాటుకు గురిచేస్తూ, జీవితాల్ని చిందరవందర చేస్తు న్నది. మానవ వికాసానికి జ్ఞానం మూలం. ఆ జ్ఞానాన్ని పొందటంలో పుస్తకమే ప్రధానం కావాలి. అంతర్జాలం ఎంతమాత్రమూ దానికి ప్రత్యామ్నాయం కాదనే సత్యాన్ని కవి ఎరుకు పరుస్తున్నాడు. **'కుటుంబమనుకొని కలిసున్న వాళ్లంతా/ సర్వేంద్రియానం స్మార్ట్ ఫోన్ ప్రధానం అనుకొని/ తలో దిక్కు తపనల్లో మునిగి పోయాక/ మెలిసుండలేని గాచ్చారం నేను'**

రాజకీయాలలో హుందాతనం నశించడాన్ని 'మార్చుకోండి ప్లీజ్'లో నిరసిస్తాడు. పవిత్ర వేదికలపై నిర్మాణాత్మక చర్చ చేపట్టాల్సిన స్థానంలో అశ్లీల పదాలు దొర్లడం పట్ల ఏవగించుకుంటాడు. ఏ ఒక్కరి నోటా సంప్రదాయం, సామ్యవాదం ఒలకదు. దొందూదొందే అన్న చందంగా ఉన్నదంటాడు. ధనమదంతో కరడుగట్టిన కుల వాదం, మనువాదం ఎగజిమ్ముతూ, మానవవాదాన్ని మంట గలపడాన్ని గుర్తుచేస్తాడు కవి. **'కొత్త తరహా అశ్లీల ఇతిహాసం/ ఖద్దరు గొంతులో/ జబ్బులు చరుచుకుంటూనే ఉంది/ నేలబారుగా ఢీకొట్టి/ మైకులు నోరు జారుతున్న కొద్దీ/ భాష నిలువెల్లా/ మ్యాన్ హోల్‌లో కూరుకుపోతోంది'**

'నాగలి వెంట నడిచే కవి'లో చాలామంది కవులకు, కర్షకుల బాధలు కనబడవని ఆక్షేపిస్తాడు. సైరికుల సమస్యలే ప్రధానమై కవిత్వాన్ని రాస్తున్న కవులకు కవి జేజేలు పలుకుతున్నాడు. **'ఈ కవి గారికి ఒకసారి/ తను తినే అన్నం మెతుకు మీద/ నాగలి కనిపెట్టిన వాడి/ అస్తిపంజరం కనిపించిందట/ అప్పటి నుండి అతడు/ నాగలి వెంటే నడుస్తున్నాడు'**

'అమృతమెవరికి' కైతలో అమృతోత్సవ భారతావనిలో ఎవరికి అమృతం దక్కింది? ఎవరికి హాలాహలం? అందిందనే ప్రశ్న వేస్తున్నాడు కవి. లక్షల కోట్ల రుణమాఫీలు కార్పొరేట్లకే దక్కుతున్నవి. కర్షకులు, కూలీలకు మాత్రం నయాపైసా నజరానా దక్కటం లేదు. అప్పులు ఎగ్గొట్టిన కార్పొరేట్లు యథేచ్ఛగా విదేశాలకు పోతుంటే, పరువు కోసం పాకులాడే రైతులు ఉరికొయ్యల పాలౌతున్నారు. ఇది ఎంత మాత్రమూ సమ్మతం కాదంటాడు కవి. **'చిన్న గొట్టంతో బస్తా పొట్టలోకి పొడిచి/ కొన్ని కేజీల బియ్యం కాజేసినంత లాఘవంగా/ బడ్జెట్ దేహం నుండే నేరుగా కొన్ని జలగలు/ చెమట నెత్తురు పీల్చుకుంటాయి'**

ఉత్తరాంధ్ర వెనుకబాటు, వనరుల వినియోగంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రపంచీకరణ ప్రభావం, భూమి పరాయీ కరణ కావడం, ప్రత్యేక ప్యాకేజీలు లేకపోవడం, వలసలు, ప్రజారోగ్యం కోసం చాలామంది రాస్తున్నారు. అవన్నీ అవసరమే. అయితే, సమస్యల్ని సాహిత్యం ద్వారా తెలియజేస్తే సరిపోతుందా? ఈ సమస్యల్ని నిర్దిష్ట రాజకీయాలకి ముడిపెటనవసరం లేదా? అన్నవి ప్రశ్నలు. ఈ వెనకబాటుకు ఆర్థిక విధానాలు ఎంత కారణమైనప్పటికీ, ఆ విధానాలు అమలు చేస్తున్న రూలింగ్ క్లాస్ స్వప్రయోజనాలు కూడా ఉన్నాయి. సమస్యని చెప్పడం ఎంత అవసరమో, ఆ సమస్యపై రాజకీయంగా ఆలోచించేలా చేయడం కూడా అంతే అవసరం.

ప్రాంతీయ అసమానతలకి రాజకీయ-ఆర్థిక దృక్పథంతో కూడిన సమకాలీన రాజకీయ అస్తిత్వం పరిభాష ఉండవలసిన అవసరం లేదా! ఆ పరిభాషను సాహిత్యం ఇవ్వగలదు. కానీ, ఆ విషయంలో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలతో పోల్చుకుంటే ఉత్తరాంధ్ర వెనకే ఉన్నట్లుగా కనిపిస్తుంది.

**- పిల్లా తిరుపతిరావు, 7095184846**

# ఆధునీకరణ పనులు ఇంకెప్పుడు..?

- కరోనా రాకతో ఆగిన అప్‌గ్రేడేషన్ వర్క్
- తిష్ట వేసిన పలు సమస్యలు

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

హైదరాబాద్‌లోని చారిత్రక సరోజినిదేవి కంటి హాస్పిటల్ ఇప్పట్లో మహర్దశకు నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఉస్మానియా మెడికల్ కాలేజీ, గాంధీ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఏకైక కంటి హాస్పిటల్ ఇది. ఏండ్లుగా హాస్పిటల్ ఆధునీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ఇప్పుడు తెలంగాణలో ఉచిత సూపర్-స్పెషాలిటీ కంటి సంరక్షణ సౌకర్యాలకు విస్తృతంగా ప్రసిద్ధి చెందిన ఈ హాస్పిటల్.. దశాబ్దాలుగా నిధుల కొరతతో కళా విహీనంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉన్నప్పటికీ చాలీచాలని సౌకర్యాలు, వసతుల లేమితో హాస్పిటల్‌కు వెళ్లాలంటే భయపడే రోజులు ఉన్నాయి. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఓపీ విభాగం, ఎమర్జెన్సీ వింగ్‌ల్లో గోడలు, పైకప్పులపై తేమతో దర్శనమిస్తుండగా.. హాస్పిటల్ గోడలు భయపెట్టేలా పగుళ్లతో కనిపిస్తుంటాయి. సిరామిక్ టైల్స్ ఫ్లోరింగ్, సీలింగ్, టాయిలెట్లు, చెక్క తలుపులు, కిటికీలు, కుళాయిలు దయనీయ స్థితికి చేరాయి.




**రూ.400 కోట్లతో ఆధునీకరణ పనులు..**

తృతీయ సంరక్షణ రెఫరల్ కంటి హాస్పిటల్‌గా పేరొందిన సరోజినిదేవి కంటి హాస్పటల్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాల నుంచీ కంటి చికిత్స కోసం ఈ హాస్పిటల్‌ను వస్తూ ఉంటారు. మెహిదీపట్నం దగ్గరలోని 10.79 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ హాస్పిటల్ క్యాంపస్‌లో 50 పడకల సామర్థ్యంతో పాటు ఔట్ పేషెంట్ భవనం, ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ విభాగం, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ వార్డులు ఉన్నాయి. కాగా, హాస్పిటల్ దుస్థితిపై అనేక మంది ఫిర్యాదు చేయడం, మీడియాలో కథనాలు రావటంతో కొన్నేండ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ), హాస్పిటల్ సముదాయంలో ఉన్న భవనాలపై సర్వే నిర్వహించింది. క్యాంపస్‌లోని దాదాపు అన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొత్త క్యాంపస్ నిర్మాణానికి దాదాపు రూ.400 కోట్లు ఖర్చవుతుందని నివేదికను అందించారు. అందుకు అనుగుణంగా అప్‌గ్రేడేషన్ పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. అంతలోనే కరోనా రావడంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిలిచిపోయింది. కాగా, గత నెలలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సరోజినీదేవి హాస్పిటల్‌లో నేత్ర సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. దాంతో హాస్పిటల్‌లో కాంప్లెక్స్ నిర్మాణ ప్రాజెక్ట్ మళ్లీ ప్రారంభమవుతుందని, హాస్పటల్‌లో సౌకర్యాలు మెరుగవుతాయని అందరూ భావించారు. కానీ మంత్రి పర్యటించి నెల అవుతున్నా.. ఇప్పటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

**హాస్పిటల్‌లో కొన్ని సమస్యలు ఇలా..**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో పేరున్న ఈ హాస్పిటల్ ఇప్పుడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాత భవనంలోనే వైద్యం అందిస్తుండటంతో సమస్యలు ఎదరవుతున్నాయి. వైద్యులు, సిబ్బంది కొరతతోపాటు రోగుల రద్దీకి తగ్గట్టుగా భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 50 పడకల సామర్థ్యం గల ఈ హాస్పిటల్‌కు ప్రతి రోజూ 900 నుంచి 1100 వరకు ఓపీ విభాగంలో రోగులు వస్తూ ఉంటారు. ఇక్కడ పదుల సంఖ్యలో రెటీనా, కార్నియా, గ్లకోమా, ఓకులోప్లాస్టీ వంటి రోగాలకు శస్త్రచికిత్సలు చేస్తూ ఉంటారు. అంతేకాదు, సుమారు 50 మంది వరకు పని చేయాల్సిన చోట సరిపడా వైద్యులు లేకపోవడంతో మెరుగైన సేవలు అందించడం గగనంగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్సలు సైతం వాయిదా పడుతుండటంతో జిల్లాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంత మందికి కంటి ఆపరేషన్ తర్వాత అద్దాలను కూడా ఇవ్వలేని దయనీయస్థితిలో ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## టీఎన్జీవోస్ అధ్వర్యంలో ముజీబ్‌కి ఘన సన్మానం

- ముజీబ్‌కు 'భారత్ కే అన్మోల్' బిరుదు ప్రదానం




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

'ది న్యూస్ యూ లైక్' ఆంగ్ల మ్యాగజైన్ తరఫున మహమ్మద్ నిజాముద్దీన్, గ్లోబల్ పీస్ అంబాసిడర్ ఆధ్వర్యంలో టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని(ముజీబ్)కి భారత్ కే అన్మోల్ బిరుదు గత నెలలో అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ న్యూఢిల్లీ ప్రదానం చేశారు. అనివార్య కారణాల వల్ల డాక్టర్ ముజీబ్ న్యూఢిల్లీకి వ్యక్తిగతంగా వెళ్లలేకపోయారు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రత్యేక సలహాదారులు ఏ.కె.ఖాన్ చేతుల మీదుగా ఆ బిరుదును అందుకున్నారు. ఈ శుభ సందర్భంలో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గృహకల్ప కార్యాలయంలో తెలంగాణ కేంద్ర సంఘ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, సహ అధ్యక్షులు మొహమ్మద్ నజీర్, ప్రచార కార్యదర్శి శైలజ సమక్షంలో డాక్టర్ ముజీబ్‌ని వివిధ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి తనకు ప్రతిష్టాత్మకమైన బిరుదు ఇవ్వడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. దానంలో కల్లా గొప్పది అన్నదానం అని.. దానికి ప్రతిఫలంగా తనకు అవార్డులు రావడం తన తల్లిదండ్రుల ఆశీర్వాదం, తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ఉద్యోగుల సహకారమేనని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి జె.బాలరాజ్, అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, సభ్యులు ఉమర్ ఖాన్, కె.శ్రీనివాస్, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, నరేష్ కుమార్, వైదిక్ శాస్త్ర, ఖాలీద్ అహ్మద్, బొల్లిగిద్ద శంకర్, సుజాత, గీతాసింగ్, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషి, జహంగీర్ అలీ, మహమ్మద్ అబ్దుల్ వహీద్, మహమ్మద్ ముస్తఫా, ఉస్మాన్ అలీ ఉస్మాని, రామకృష్ణారెడ్డి, రోహిత్ కుమార్, మాజీ సభ్యులు ప్రభాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

## వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల పరిష్కారంపై మంత్రి హామీ

- ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఐకేపీ వీఓఏల వేతనాల పెంపు, ఇతర డిమాండ్లు పరిష్కరించేలా చూస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీనిచ్చారని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లిని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్, ఎస్వీ రమ కలిశారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలనీ, కనీస వేతనం రూ.26వేలు, రూ.10 లక్షల బీమా సౌకర్యం, తదితర డిమాండ్లను నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు.

44 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీని ప్రస్తావించారు. సమ్మె విరమణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. గ్రామ మహిళా సమాఖ్యల ద్వారా పొదుపు సేకరణ, అనేక సంక్షేమ కార్యక్రమాల్లో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న వీఓఏల పట్ల ఇలా వ్యవహరించడం తగదన్నారు. ఈ సందర్భంగానే వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల పరిష్కారంపై సెర్ప్ ఉన్నతాధికారులను ఆదేశిస్తానని మంత్రి హామీ నిచ్చారు.

## మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి

- వైజ్ఞానిక సభలో వక్తలు
- స్వేచ్ఛ జేఏసీ, మూఢ నమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి ఆధ్వర్యంలో ప్రదర్శనలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తేవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. డాక్టర్ నరేంద్ర దభోల్కర్ పదో వర్ధంతి సందర్భంగా స్వేచ్ఛ జేఏసీ, మూఢ నమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి సంయుక్తాధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ప్రదర్శనలు, వైజ్ఞానిక సభ నిర్వహించారు. మతోన్మాదుల చేతుల్లో హత్యలకు గురైన డాక్టర్ నరేంద్ర దభోల్కర్, డాక్టర్ గోవింద్ పన్సారి, ప్రొఫెసర్ కల్బుర్గి, జర్నలిస్ట్ గౌరీ లంకేష్‌లకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజల మూఢ నమ్మకాలను ఆసరా చేసుకుని కొంత మంది చేస్తున్న మోసాలను బట్టబయలు చేసే విధంగా ప్రదర్శనలు నిర్వహించారు. ముందుగా సుందరయ్య పార్కు చుట్టూ విజ్ఞాన దర్శిని రమేశ్ వీపునకు కొక్కాలతో కారును లాగారు. అనంతరం విజ్ఞాన దర్శినీ నాయకులు బాల నారాయణ, విష్ణువర్ధన్‌లు తొలిసారిగా అదే విధంగా కారును విజయవంతంగా లాగుతూ ప్రదర్శించారు. మంటలపై నడిచి మూఢ నమ్మకాల నుంచి బయటపడాలని పిలుపునిచ్చారు. తర్వాత సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక సభలో పలు అంశాలను ప్రదర్శించి దాని వెనుక దాగి ఉన్న వైజ్ఞానిక సూత్రాలను వివరించారు. నీరు పెట్రోల్‌గా మారడం, ఒంటికి మంటలంటుకోకపోవడం, నోట్లో మంటలు పెట్టుకోవడం, మట్టిపై నీళ్లు పోస్తే మంటలు రావడం, నీరు ఎర్రగా మారడం, గాజు పెంకులపై నడవడం వంటివి



ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు, చిన్నారులు ప్రదర్శనల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని రమేశ్ మాట్లాడుతూ పలు రాష్ట్రాల్లో చట్టాలను అధ్యయనం చేసి రూపొందించిన మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం ముసాయిదాను చూసేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద సమయం లేదని విమర్శించారు. ఒకే కులంలో వివాహాల ద్వారా జన్యుపరమైన రోగాలు వస్తున్నాయని సీసీఎంబీ పరిశోధనల్లో తేలిందని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి రోగాల బారిన పడకుండా కులాంతర వివాహాలు పెరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ శంకర్, గుత్తా జ్యోత్స్న, రాచకొండ రమేశ్, జ్యోతి తదితరులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలనీ, సమాజం ఇంకా నష్టపోకముందే చట్టం తీసుకురావాలని కోరారు.

## ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి-ఎమ్మెల్సీ నర్సిరెడ్డి




**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి పాఠశాల విద్యలో ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నడుస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. టీచర్ల సర్దుబాటు పేరుతో క్రమబద్ధీకరణ చేస్తూ కేవలం 5,600 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ దస్త్రం పంపడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రీప్రైమరి తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానించే ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు-మనబడి పథకంలో అభివృద్ధి చేస్తున్న సందర్భంలో వాటి రక్షణకు సర్వీసు పర్సన్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య మాట్లాడుతూ ఎన్ఈపీ-2020 విధానం అమల్లో ప్రి ప్రైమరీ తరగతులను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగిస్తే దేశ వ్యాప్తంగా విద్యారంగం ప్రయివేటీకరణకు, కార్పొరేటీకరణకు దోహపడుతుందనీ, పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కోర్టుకేసు పరిధిలో ఉన్నందున వెంటనే స్టే వేకెట్‌కు చొరవచూపి పదోన్నతులు, బదిలీలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018 పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలనీ,పీఆర్‌సీ గడువు ముగిసినందున 2023 జులై1 నుంచి రాష్ట్రంలో ఉద్యోగులకు రెండోపీఆర్‌సీ కమిటీని వెంటనే నియామకం చేసి ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. ఇప్పటివరకు పెండింగ్‌లో వున్న మూడు డీఏలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావరవి మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు చేపట్టిన బదిలీ ఉత్తర్వులను వెంటనే అమలయ్యే విధంగా చూడాలన్నారు. అన్ని గురుకులాల్లో ఒకే సమయపాలన ఉండాలనీ, అన్ని సొసైటీలను ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తేవాలన్నారు. అన్ని రకాల మేనేజ్‌మెంట్ల ఉపాధ్యాయులకు మెరుగైన వైద్య చికిత్సకు ఈహెచ్‌యస్ అమలు చేయాలని కోరారు.కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ఉపాధ్యాయులకు బేసిక్ పే అమలుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తించేవిధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. రాములు, సిహెచ్. దుర్గాభవాని కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, ప్రధాన సంపాదకులు పి. మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ. వెంకట్, యం. రాజశేఖర్‌రెడ్డి, కె. సోమశేఖర్, వి. శాంతికుమారి, డి. సత్యానంద్, కె.రంజిత్‌కుమార్, బి. నాగమణి, బి. రాజు, ఈ. గాలయ్య, కె. రవిప్రసాద్‌గౌడ్, కె. రవికుమార్, జి. శ్రీధర్, వై. జ్ఞానమంజరి, ఎ. సింహాచలం, ఆడిట్ కమిటీ కన్వీనర్ యస్‌కె. మహబూబ్‌అలి,యస్‌వై. కొండల్‌రావులు పాల్గొన్నారు.

## యువత నిర్ణయాలు భావితరానికి మార్గ దర్శకం

- మంత్రి కొప్పుల ఈశ్వర్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

యువత నిర్ణయాలు భావితరానికి మార్గమంటూ ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో యువ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా మంత్రి మాట్లాడారు. యువత అండదండలతోనే రాష్ట్రం పురోగతి సాధించిందని చెప్పారు. యువత తీసుకుంటున్న నిర్ణయాలతోనే ప్రజల్లో మార్పు వస్తుందని చెప్పారు. నాయకులు ఎక్కడ గొప్పగా ఆలోచన చేస్తారో అక్కడ అభివృద్ధి ఉంటుందన్నారు. ఇందుకు యువత ప్రోత్సాహం కూడా ఉపయోగ పడుతుందని మంత్రి చెప్పారు. ఉన్నత చదువులు, ఉద్యోగ ఉపాధి కల్పనకోసం యువత హైదరాబాద్ నగరంలో స్థిరపడటం సంతోష కరమైన విషయం అన్నారు.

## కారులో టికెట్ల లొల్లి

- ఉప్పల్, అంబర్‌పేట్ నియోజకవర్గాల నేతలు బాహాబాహీ
- ఎమ్మెల్సీ కవిత వద్దకు పంచాయతీ

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కారులో టికెట్ల లొల్లి కొనసాగుతూనే ఉన్నది. తాజాగా హైదరాబాద్ నగరంలోని ఉప్పల్, అంబర్‌పేట్ ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నాయకులు తిరుగుబాటు గళం వినిపిస్తున్నారు. టికెట్ మాకివ్వాలంటే, మాకివ్వాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యేలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత వద్దకు పంచాయతీ చేరింది.రెండు రోజులుగా ఉప్పల్ ఎమ్మెల్యే టికెట్ తనకే కేటాయించాలంటూ బీఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ సీటుపై గంపెడు ఆశలు పెట్టుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రస్తుత ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి కొద్దిసేపటి క్రితం ఎమ్మెల్సీ కవితను కలిశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కవిత ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకుకెళతానని వారికి హామీ ఇచ్చారు. అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ అసమ్మతి గ్రూప్ నిరసన తెలిపింది. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు అంతా ఒకతాటిపైకి వచ్చారు. ఇంచార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డికి లేదా మాజీ కార్పొరేటర్ ఎక్కాల కన్నా యాదవ్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమలోని బీసీ నేతకు ఇవ్వాలంటూ కోరారు. తమపై కేసులు పెడుతూ వేధింపులకు గురి చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎక్కాల చైతన్య కన్నా, గరిగంటి శ్రీదేవి రమేష్, డిపి పద్మ, పులి జగన్, నాయకులు నాగేష్‌గౌడ్, మురళీకష్ణ, అశోక్ రెడ్డి, అంజమ్మ, సునీత లక్ష్మి ప్రియతోపాటు పలువురు పాల్గొన్నారు.

## బ్రహ్మణ సదనంలో అద్దెకుకళ్యాణ మండపం

- పేద బ్రాహ్మణులకు ఉచితం
- సంక్షేమ పరిషత్ చైర్మెన్ రమణాచారి వెల్లడి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలో నిర్మించిన బ్రాహ్మణ సదనంలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మెన్ డాక్టర్ కేవీ రమణాచారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 9 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.12 కోట్ల వ్యయంతో కళ్యాణమండపం, ఆడిటోరియం, సమాచార కేంద్రం, ధర్మాచార్యుల విడిది సదనం నిర్మించామన్నారు. ఇక్కడి కళ్యాణమండపాన్ని మత, ఆచార, సంప్రదాయ, లౌకికపరమైన కార్యక్రమాల నిర్వహణకు కేటాయించినట్టు తెలిపారు. ఇక్కడి కళ్యాణమండపాన్ని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద బ్రాహ్మణులకు ఉచితంగా, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న బ్రాహ్మణులకు రూ.10వేలు, బ్రాహ్మణేతర హిందూ కుటుంబాలకు రూ.50వేలకు అద్దెకు ఇస్తామని వివరించారు. అశుభ కార్యాలకు బ్రాహ్మణ సదనం కేటాయింపబడదని స్పష్టం చేశారు. ఈవెంట్స్, ఇతర కార్యక్రమాల నిర్వహణకు నెలరోజుల ముందే బుక్ చేసుకోవాలని సూచించారు. పేద బ్రాహ్మణులు తహసీల్దారు కార్యాలయం నుంచి జారీ చేసిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. శుభకార్యాలు జరిపేందుకు పురోహితులు అందుబాటులో ఉంటారనీ, క్యాటరింగ్ సౌకర్యం కూడా ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలనీ, ఇతర వివరాలు brahmin-parishad.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

## పాక్‌లో తీవ్రవాదుల దాడి

- 11 మంది కార్మికులు మృతి

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లో ఆదివారం తీవ్రవాదులు చేసినట్టు అనుమానిస్తున్న దాడిలో 11 మంది కార్మికులు మృతి చెందారు. ప్రధానమంత్రి అన్వర్-ఉల్-హక్ కకర్ ఈ విషయాన్ని తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్‌కు సరిహద్దుల్లో ఉన్న ఖైబర్ పఖ్తునంఖ రాష్ట్రంలో ఈ దారుణం జరిగింది. నిర్మాణ ప్రదేశానికి కార్మికులను తరలిస్తున్న ట్రక్కు కింద పేలుడు పదార్థాలు అమర్చి దానిని పేల్చివేశారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని ఇంత ఎవరకూ తీవ్రవాద సంస్థ ప్రకటించలేదు.

## చంద్రునిపై కూలిన 'లూనా-25'

- చివరి మజిలీలో విఫలమైనట్టు ప్రకటించిన రష్యా

**మాస్కో :** సుమారు 47 ఏండ్ల తర్వాత రష్యా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలి మూన్ మిషన్ లూనా-25 అంతరిక్ష నౌక చంద్రుడిపై కూలిపోయింది. ల్యాండింగ్‌కు ముందు విన్యాసాల సమయంలో చంద్రునిపై అంతరిక్ష నౌక కూలిపోయిందని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ ఆదివారం తెలిపింది. శనివారం మధ్యాహ్నం 2.57 గంటలకు లూనా-25 కమ్యూనికేషన్ కోల్పోయిందని ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రాథమిక పరిశోధనల ప్రకారం.. ల్యాండర్ చంద్రుని ఉపరితలాన్ని ఢీకొన్న తర్వాత ఉనికిలో లేదని తెలిపింది. అంతరిక్ష నౌకను గుర్తించి, కమ్యూనికేట్ చేసేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో తీసుకున్న చర్యలు విఫలమయ్యాయని వివరించింది. రష్యాలోని వోస్తోక్నీ కాస్మోడ్రోమ్ నుంచి ఈ నెల 11న 'లూనా-25'ని ప్రయోగించింది. పదిరోజులపాటు ప్రయాణించిన ల్యాండర్ కొన్ని గంటల క్రితమే చంద్రుడి ఫొటోలను పంపించింది. ఈ నెల 21న చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్ కావాల్సి ఉంది. అందుకోసం కక్ష్య (ప్రీ ల్యాండింగ్ ఆర్బిట్)కు చేరడానికి కీలక విన్యాసం చేపట్టే ప్రయత్నంలో లూనా-25లోని ఆటోమేటిక్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితి తలెత్తినట్లు రోస్‌కాస్మోస్ గుర్తించింది. అప్పటికే ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోయినట్లు తెలిపింది.

## ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలి

- 30ఏండ్లుగా నివాసముంటున్న తమకు ఇండ్ల పట్టాలివ్వాలి

**నవతెలంగాణ-మిర్యాలగూడ**

వివిధ కూలి పనులు చేసుకుంటూ 30 ఏండ్లుగా ప్రభుత్వ భూమిలో జీవిస్తున్న తమకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని మిర్యాలగూడ మండలం జంక్ తండా గ్రామస్తులు కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు మాట్లాడారు. 30 ఏళ్లుగా జంకుతండ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకొని దాదాపు 20 కుటుంబాలు నివసిస్తున్నామన్నారు. కాగా, ఈ భూమిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలన్న నిర్ణయంతో తమను ఖాళీ చేయించే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. ఈ విషయంపై తాము గతంలో ఆర్డీఓ, కలెక్టర్‌కు సైతం వినతి పత్రాన్ని అందించామన్నారు. అయినప్పటికీ మిర్యాలగూడ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు, తమ స్థలాన్ని ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తుండటంతో హైకోర్టును సైతం ఆశ్రయించామన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం తగు విచారణ చేసి నివాసం ఉంటున్న వారికి న్యాయం చేయాలని చెప్పినప్పటికీ వినలేదని ఆరోపించారు. జంకుతండా సర్పంచ్, అధికార పార్టీ నేత మాలోత్ రవీందర్ నాయక్ పేదల అధీనంలో ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా, పట్టా భూమిగా చూపించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పేరుతో స్వాహా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## నైగర్‌లో మూడేళ్లలో పౌర పాలన

- సైనిక ప్రభుత్వ అధినేత జనరల్ చియాని వెల్లడి

**నియామె:** నైగర్ మూడేళ్లలో తిరిగి పౌర పాలన కిందికి వస్తుందని సైనిక ప్రభుత్వ అధినేత జనరల్ అబ్దోరహ్మాన్ చియాని ప్రకటించారు. అదే సమయంలో దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో తల దూర్చాలని ప్రయత్నిస్తే తగిన బుద్ధి చెబుతామని పొరుగు దేశాలను హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన జాతి నుద్దేశించి టివిలో ప్రసంగిస్తూ, ఈ పరివర్తనకు అనుసరించాల్సిన నియమావళిని తన ప్రభుత్వం నెల రోజుల్లో ఖరారు చేస్తుంని అన్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి మూడేళ్లు పడుతుందని అన్నారు. యుద్ధాన్ని తన ప్రభుత్వం కానీ, నైజీరియా ప్రజలు కానీ కోరుకోవడం లేదు, చర్చలకు తాము కట్టుబడి ఉన్నాం. దేశాన్ని ఆక్రమించాలని బయటి శక్తులు చేసే ఎలాంటి యత్నాన్ని అయినా తిప్పికొడతామని జనరల్ చియాని తెలిపారు. నైగర్‌లో జోక్యం చేసుకోవడం పార్కులో నడకలాంటిదని ఎవరైనా అనుకుంటే వారు పప్పులో కాలేసినట్టేనని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత సంక్షోభం నుంచి దేశాన్ని బయట పడేసే మార్గాన్ని కనుగొనేందుకు ఇరుపక్షాలు కలిసి కూర్చొని చర్చించుకుంటాం. అందరి ప్రయోజనాలకు ఇది అవసరమని చియాని అన్నారు. శుక్రవారం పశ్చిమ ఆఫ్రికా దేశాల కూటమి ఎకోవాస్ రాజకీయ వ్యవహారాలు, శాంతి, భద్రతల కమిషనర్ అబ్దుల్ ఫతువా మాట్లాడుతూ, నైగర్‌లో పౌర ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు సైనిక చర్యకు ముహూర్తం నిర్ణయించామని చెప్పారు. జోక్యానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కూటమిలోని 15 సభ్య దేశాలకు గాను 11 దేశాలు చెప్పాయని, అందుకు తమ బలగాలను పంపేందుకు సంసిద్ధత తెలిపాయని అన్నారు. నైగర్‌లో భ్రష్టు పట్టిన అధ్యక్షుడు బజూమ్‌ని తిరిగి ఎలాగైనా ప్రతిష్టించాలని ఫ్రాన్స్, అమెరికా, ఇయు దేశాలు అనేక విధాలుగా పాకులాడుతున్నాయి. ఎకోవాస్ కూటమి మాజీ వలస పాలకులైన ఫ్రాన్స్‌కు వత్తాసు పలుకుతోందని నైగర్, ఇతర సహేల్ ప్రాంతంలోని దేశాలు విమర్శించాయి. నైగర్‌లోని యురేనియం నిక్షేపాలను యథేచ్ఛగా కొల్లగొట్టుకుపోతున్న ఫ్రాన్స్‌కు ఇప్పుడు కొత్త ప్రభుత్వం బ్రేక్ వేసింది. దీంతో ఫ్రాన్స్‌లో అణు రియాక్టర్లకు చాలా ముఖ్యమైన ఇంధనం ఆగిపోతుంది. యురేనియం నిల్వలను తరలించుకుపోవడానికి గత ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి. యురేనియం ఒక్కటే కాదు, లిథియం, బంగారం వంటి విలువైన ఖనిజ సంపదపైన మాజీ వలసపాలకుల ఆధిపత్యం ఇప్పటివరకు కొనసాగుతూ వస్తున్నది. ఈ పని కోసమే 1500 మంది సైనికులతో ఫ్రాన్స్, వెయిఠ య మంది సైనికులతో అమెరికా అక్కడ తిష్టవేశాయి. వనరుల తరలింపునకు అడ్డంకిగా ఉన్న సైనిక ప్రభుత్వాన్ని తప్పించేందుకు ఫ్రాన్స్, అమెరికా, ఇతర యూరోపియన్ దేశాలు, ఆఫ్రికాలో వాటికి తాబేదారుగా ఉన్న ఎకోవాస్ తమ యత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. నైగర్‌పై ఆంక్షలు కూడా విధించాయి. అయితే ఈ ఆంక్షలను తాము వ్యతిరేకిస్తున్నామని చాద్, గినియా దేశాల్లోని సైనిక ప్రభుత్వాలు హెచ్చరించాయి. బుర్కినా ఫాసో, మాలి ఇంతకుముందే ఈ విధమైన ప్రకటన చేశాయి. నైగర్‌లో సైనిక ప్రభుత్వాన్ని తొలగించేందుకు బయటి నుంచి జరిగే ఎటువంటి సైనిక జోక్యాన్ని తాము అనుమతించేది లేదని ఈ నాలుగు దేశాలు స్పష్టం చేశాయి.



## మద్యం షాపులకు 1,31,490 దరఖాస్తులు

- నేడు డ్రా... ఏర్పాట్లు పూర్తి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మద్యం షాపుల కోసం 1,31,490 దరఖాస్తులొచ్చాయి. 2021లో 68,691 దరఖాస్తులు మాత్రమే వచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 1,834 షాపులు (అందరూ పోటీ పడేందుకు వీలుగా ఉన్నవి), 786 షాపులు (రిజర్వ్ చేయబడినవి) అంటే మొత్తం 2,620 షాపులకుగాను ఈ దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.నేడు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించబోయే డ్రా కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు.

# కార్మికుల ధర్నాకు దేప భాస్కర్ రెడ్డి మద్దతు



**నవతెలంగాణ - ఎల్బీనగర్**

మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ జీహెచ్ఎం సీ కార్యాలయం ఎదుట చేపట్టిన పారిశుద్ధ్య కార్మికుల ధర్నా ఆదివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఆ ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీ హెచ్ఎంసీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకోవద్దు అని హెచ్చరించారు.

# మహిళ కడుపులో 110 కిలోల కణితి తొలగింపు



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఓ మహిళ కడుపులో 110 కిలోల బరువు ఉన్న కణితిని శస్త్ర చికిత్స ద్వారా నిమ్స్ వైద్యులు తొలగించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కుసునూరు లక్ష్మి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. నాలుగు రోజుల కిందట సమస్య తీవ్రం కావడంతో కుటుంబీకులు స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులో భారీ కణితి ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శుక్రవారం పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన సర్జికల్ ఆంకాలజీ వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి రాజశేఖర్, వైద్య బందం ఆమెకి ఆప రేషన్ చేసి 110 కిలోల బరువు ఉన్న కణితిని విజయవంతంగా తొలగించారు.

# హ్యాండ్ లూమ్ మేళా..భళా..!



- హ్యాండ్ లూమ్ ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ : నేపథ్య గాయకులు సాకేత్, సోనీ కోమండూరి
- అమ్మ చల్లని ఒడిలా చేనేత : మాడ జానకి రామయ్య
- సత్యసాయి నిగమాగమంలో వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శన ఆరంభం!

**నవతెలంగాణ - సిటీబ్యూరో**

శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటైన కతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శనను సంగీత దర్శకుడు, గాయకుడు సాకెత్ కోమండూరి, సౌత్ ఇండియన్ ప్లే బ్యాక్ సింగర్లు సోని కోమండూరి, శతి రంజనితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిండెంట్ మాడ జానకి రామయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయని సోనీతో పాటు సాకెత్ జానకి రామయ్య ఇక్కడి హాలులో కొలువు దీరిన చేనేతకారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, వాటి తయారీ విధానం, ప్రత్యేకతను తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. భారతీయ సంస్కతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని గాయని సోనీలి అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. సంగీత దర్శకులు సాకెత్ మాట్లాడుతూ నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిండెంట్ మాడ జానకి రామయ్య మాట్లాడుతూ చేనేత అమ్మ చల్లని ఒడిలా వర్ణించారు. అయితే హ్యాండ్ లుమ్ ఉత్పత్తుల తయారీకి చేనేత కారులు శ్రమ వెల కట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ చేనేతను ఆదరించాలని, అప్పుడే చేనేతకారుల కష్టానికి తగిన ఫలితం పరోక్షంగా ఇవ్వగలమన్నారు. నిర్వాహకులు యలమంచిలి శ్రీలత మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతి పని బంధాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు వివరించారు.

# గడపగడపకూ చేరుతున్న బీఆర్ఎస్ పథకాలు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**నవతెలంగాణ -చైతన్యపురి**

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ఏదో ఒక రూపంలో గడపగడపకూ చేరుతు న్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఆల్కపురి కాలనీకి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తికి ముఖ్య మంత్రి సహాయనిధి నుండి రూ.60000 విలువ చెక్కు మంజూరైంది. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం లబ్దిదారుడికి మంత్రి సబితా ఇంద్రారెడి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఇలాంటి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్, నాయకులు యుగంధర్ శర్మ, ముచింతల జగన్, నవీన్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్మికి అండగా రాష్ట్ర ప్రభుత్వం



**నవతెలంగాణ- హస్తినాపురం**

ఎల్బీనగర్ పోలీసుల దాడిలో గాయపడిన మీర్‌పేట్ కు చెందిన గిరిజన మహిళ లక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం రాత్రి హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్‌తో కలిసి మంత్రి..బాధిత మహిళను పరామర్శించి మనో ధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలంతో పాటు గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు మంజూరు చేసేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తన ఆరోగ్య నిమిత్తం అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని బాధిత మహిళకు హామీ ఇచ్చారు. మంత్రితో మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్లాల్ చౌహాన్, గోపి సింగ్ పాల్గొన్నారు.

# మంత్రి సబితకు భారీ మెజార్టీ ఇవ్వాలి

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్



**నవతెలంగాణ- చైతన్యపురి**

ఆర్కేపురం డివిజన్‌లో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. ఆదివారం ఆర్కే పురం డివిజన్ విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని డివిజన్లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి పేదల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మన పథకాలను దేశం అనుసరిస్తుంది అన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కృషితో మహేశ్వరం నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. మంత్రి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్, రామ్ నరసింహ గౌడ్, రామాచారి, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, ముప్పిడి లింగస్వామి గౌడ్, వెంకటేష్ గౌడ్, కొండ్ర శ్రీనివాస్, శ్యామ్ గుప్తా, యాదవ రెడ్డి, శేఖర్, జగన్, శ్రీరాములు, జాహేద్, వాజిద్ పటేల్, బాలుశ్రీ, శ్రీకాంత్‌గౌడ్, దీపక్, శ్రీమన్నారాయణ, మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి, నియోజక వర్గ వర్కింగ్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, చామల శైలజ రెడ్డి, మాధవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గొప్పలు చేప్పుకోవడం సిగ్గుచేటు

- ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి



**నవతెలంగాణ - ఎల్బీనగర్**

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.. కాలనీలో ఉన్న అనేక సమస్యలను పట్టించుకోకుండా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాలనీలో ఉన్న అనేక సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలనీలోని సమస్యలను వీలైనంతవరకు పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు డి.శశిధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిరాం రెడ్డి, నర్సింహా, మహేష్ కృష్ణ శ్రీను నాయక్, లలిత గౌడ్ సతీష్ గౌడ్, ఎస్టీ సెల్ యువ నాయకులు రమేష్ నాయక్, కాలనీ అధ్యక్షులు గోపాల్ నాయక్, రాజు, శ్రీను, బాబురావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు

- బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్



**నవతెలంగాణ- బడంగ్ పేట్**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోనుందని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ జోస్యం చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కుర్మల్ గూడ, గుర్రంగూడ, బడంగ్‌పేట్ వివిధ పార్టీల నాయకులు ఆదివారం గుర్రంగూడ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాషాయం కండువాలు కప్పి పార్టీలోకి శ్రీరాములు యాదవ్ ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత కష్టపడి పని చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికీ మేలు చేసేలా, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఎంసీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, ఇంద్రసేన, అనితా ప్రభాకర్, పద్మా ఐలయ్య సహా బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి, స్త్రీ హస్తిన మహిళా మండలి ఫౌండర్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా పర్యవేక్షణలో అమ్మ ప్రేమ ఫౌండేషన్ చిన్నారులకు డబల్ డోర్ ఫ్రిడ్జ్ ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఫ్రిడ్జ్‌ను అందజేసిన డాక్టర్ బాలుకు కృతజ్ఞతలు తెలియజేశారు. **నవతెలంగాణ- చైతన్యపురి**

# తెలంగాణకు అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టైటిల్

- కేరళ జట్టుపై ఫైనల్స్‌లో ఘన విజయం
- మహిళల విభాగంలో రాజస్థాన్ జట్టుకు టైటిల్
- జింఖానా గ్రౌండ్స్‌లో సందడిగా అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్-2023



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్-2023 పోటీల్లో పురుషుల విభాగం టైటిల్‌ను తెలంగాణ జట్టు గెలుచుకుంది. నగరంలోని జింఖానా గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఉత్కంఠ భరిత ఫైనల్ మ్యాచ్‌లో కేరళ జట్టును ఓడించి ఈ టైటిల్ సాధించింది. తెలంగాణ జట్టు 16 పాయింట్లు సాధించగా, కేరళ 8 పాయింట్లు మాత్రమే సాధించింది. తెలంగాణ జట్టులోని వీర మణికంఠరెడ్డి, సుధీర్ యాదవ్ చెరో 6 పాయింట్లు కొల్లగొట్టారు. సంతోష్ సంద్రి 4 పాయింట్లు సాధించారు. సెమీ ఫైనల్స్‌లో రాజస్థాన్ జట్టుపై తెలంగాణ గెలిచి సగర్వంగా ఫైనల్స్‌కు చేరుకుంది. కర్నాటక జట్టుపై గెలిచిన కేరళ కూడా ఫైనల్స్ బెర్తు సాధించింది. మరోవైపు యూపీ జట్టుపై గెలిచిన రాజస్థాన్ మహిళల విభాగం టైటిల్‌ను గెలుచుకుంది. రాజస్థాన్ జట్టు 8 గోల్స్ చేయగా...యూపీ 6 గోల్స్‌తోనే సరి పెట్టుకుంది. కేరళపై రాజస్థాన్ జట్టు, కర్ణాటకపై యూపీ జట్టు గెలిచి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. ఐఓఏ మాజీ సంయుక్త కార్యదర్శి, మహారాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్, భారతదేశంలో అమెరికన్ ఫుట్‌బాల్ ఫౌండర్ అయిన నామ్‌దేవ్ శిర్గావ్‌కర్, ఏఎఫ్ఎఫ్ఐ సీఈఓ డాక్టర్ సందీప్ చౌదరి కూడా ఈ పోటీలను దగ్గరుండి చూశారు. "తెలంగాణ పురుషుల జట్టు, రాజస్థాన్ మహిళల జట్టు అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్-2023 టైటిల్ గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇది మనందరికీ తెలిసిన మామూలు ఫుట్‌బాల్ లాంటిది కాదు. ఈ గేమ్ పూర్తిగా విభిన్నమైనది. ఇలాంటి కఠినమైన పోటీలో గెలవడం మామూలు విషయం కాదు. రెండు విభాగాల్లోనూ ఫైనల్స్‌లో తలపడ్డ జట్లలో ఆటగాళ్లందరూ చాలా అత్యద్భుతంగా ఆడారు. వీళ్లలో ఎక్కువ మందికి జాతీయ జట్టులో స్థానం లభించాలని, వారు అంతర్జాతీయ స్థాయిలో మన దేశ ఖ్యాతిని మరింత పెంపొందించాలని ఆశిస్తున్నాను" అని భారతదేశంలో ఫ్లాగ్ ఫుట్‌బాల్ బ్రాండ్ అంబాసిడర్ కౌటికె విఠల్ అన్నారు.

**తెలంగాణ జట్టు ఇలా..**

వీర మణికంఠ రెడ్డి గడే, సుధీర్ యాదవ్ బోయిని, తరుణ్ కుమార్, శివ, తనయి, సుధీర్ గౌడ్, గౌస్ బాషా, కార్తీక్, గణేష్, పంకజ్, సంతోష్ సంద్రి, నిఖిల్, కేతన్ జోగా, అవనీష్, భరత్. **కోచ్ :** ప్రవీణ్ రెడ్డి చింతల.

# 'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'



**నవతెలంగాణ- బడంగ్ పేట్**

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరామ కాలనీ ప్రజల సమస్యలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో పరిష్కరించేందకు కృషి చేస్తానని మంత్రి తనయుడు పటోళ్ల కార్తిక్ రెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ వాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు బాణసంచా కాల్చి, పూలతో పటోళ్ల కార్తిక్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. తర్వాత పలు సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. శ్రీరామ కాలనీలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం నిత్య ఎంక్లేవ్ లో కాలనీ ప్రజలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు కే.లక్ష్మినారాయణ, పల్లపు శంకర్, మాజీ ఎంపీటీసీ జనార్ధన్, మాజీ ఉప సర్పంచ్ జహంగీర్, నాయకులు దూడల సుధాకర్ గౌడ్, నాగ భూషణ్, యువ నాయకులు అర్జున్, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ప్రజా పార్టీ జెండా ఎగరేస్తాం

- ప్రజా పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

కూకట్‌పల్లిలో ప్రజాపార్టీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు అంజి యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ స్థాయి సమావేశం తోకల మహేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో "ప్రజాపార్టీ" రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ సూచన మేరకు అంజి యాదవ్ మాట్లాడుతూ ప్రజా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బహుజనులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో తోకల మహేష్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీసీలకు 70 సీట్లు, యాదవులకు 30 సీట్లు వచ్చే ఎన్నికల్లో కేటాస్తామని గతంలోనే దాసరి అజయ్ కుమార్ యాదవ్ ప్రకటించినట్టు గుర్తుచేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి తోకల మహేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీ వర్గాల నాయకత్వంలో ఉన్న అన్ని పార్టీలకు ప్రత్యామ్నాయ రాజకీయ ఏకైక శక్తి బీసీల నాయత్వంలో ఉన్న "ప్రజాపార్టీ" మాత్రమే అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల సమస్యలకు పరిష్కార మార్గం బీసీలకు రాజ్యాధికారం దక్కడమే అన్నారు. ప్రజా పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వచ్చే ఎన్నికల్లో ప్రజా పార్టీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పలు చోట్ల రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



**నవతెలంగాణ - వనస్థలిపురం**

స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం వనస్థలిపురం రెడ్ ట్యాంక్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహానికి వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ గణేష్ రెడ్డి, సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ఎల్బీనగర్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడ రాజశేఖర్, ఎల్బీనగర్ యూత్ ఉప అధ్యక్షుడు శివ, నరసింహ యాదవ్, వనస్థలిపురం యూత్ సభ్యులు, మధుసూదన్ రెడ్డి, సీనియం నాయకులు పాల్గొన్నారు.

**వనస్థలిపురం :**



రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఆదివారం పాదాచారులకు, వాహనదారులకు, ప్రజలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, భీమిడి రామకృష్ణారెడ్డి, గణేష్ రెడ్డి, మెరుగు రమేష్, డివిజన్ అధ్యక్షులు, మల్లారపు శ్రీనివాస్, శశిధర్ రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, పృధ్వీరాజ్, మహేందర్, భరత్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**బడంగ్ పేట్ :**



స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డిలు అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్ గుడ గ్రామంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏనుగు జంగారెడ్డి, కొత్త మనోహర్ రెడ్డి కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, బండారు మనోహర్, బాలునాయక్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అహ్మద్ బామ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

**రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు**

**ఎల్బీనగర్ :**



స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ప్రజయ్ నివాస్ ఫేజ్-01, మోహన్ నగర్, కొత్తపేట్‌లో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి ఆదేశానుసారం తెలంగాణ యూత్ కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కార్తీక్ రెడ్డి, డాక్టర్ దివ్యారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రగ్మా హాస్పిటల్, మల్‌రెడ్డి రాంరెడ్డి కూతురు దివ్యా రెడ్డి సొంత హాస్పిటల్ బెస్ట్ విజన్ ఐ హాస్పిటల్‌లోని వైద్య నిపుణులు, సహాయ సిబ్బంది సంయుక్తంగా పాల్గొని వైద్య సేవలు అందించారు. జనరల్ ఫిజిషియన్, కార్డియాలజిస్టు, న్యూరో ఫిజిషియన్, ఆర్థో సర్జన్, గైనకాలజిస్ట్, డర్మటాలజిస్ట్, డెంటల్ సర్జన్, అప్తమాలజీ, ఈఎన్ టీ సర్జన్ తదితర నిపుణులు పరీక్షలు నిర్వహించారు. తర్వాత రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, పని ఒత్తిడి, కుటుంబ పరమైన బాధ్యతల్లో పడి అనారోగ్యాల పాలవుతున్న వారి కోసం ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరానికి మంచిస్పందన వస్తున్నట్లు వివరించారు. వేయి మందికి పైగా పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన అన్ని మందులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు.

డాక్టర్ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..కాలానికి అనుగుణంగా వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, కాబట్టి దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపైన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్ నాయక్, జైపాల్ రెడ్డి, రాజశేఖర్, దీప్లా నాయక్, ఎండి షరీఫ్, కిరణ్, హుస్సేన్, కృష్ణారెడ్డి, సాయి, శరత్, శివ, రజిని, సంగీత, భాను, నరేందర్ రెడ్డి, చింటూ, సచిన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# తవ్వి వదిలేసిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) డిమాండ్



**నవతెలంగాణ-ధూల్ పేట్**

గుడిమల్కపూర్ సమీపంలోని భోజగుట్ట శ్రీరామ్ నగర్, శివాజీ నగర్‌లకు మధ్యలో తొవ్వి వదిలేసిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ నాయకులు ఆదివారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ్ నగర్, శివాజీ నగర్ బస్తీలలో సుమారు 1500 మంది పేదలు నివసిస్తున్నారన్నారు. ఈ మార్గంలో గత ఐదు నెలలుగా రోడ్డు సరిగా లేకపోవడంతో స్కూల్ పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బస్తీలోని ప్రజలందరికీ రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో చెత్త తీసుకెళ్లడానికి స్వచ్ఛ ఆటోలు కూడా రావడం లేదని చెప్పారు. దీంతో బస్తీలో ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ప్రజలు విష జ్వరాల పాలవుతున్నారని తెలిపారు. నగరంలో అనేక కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పటికీ.. పేదల నివసిస్తున్న ఇటువంటి ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల బస్తీల పట్ల ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ నాయకులు సిహెచ్ వెంకటస్వామి, యాదయ్య, రాములు, రాజు, లత తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక తీజ్

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బంజారా తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పూర్వ కాలం నుండి గిరిజనులు తమ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరీపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు లాలునాయక్, సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మైపాల్ నాయక్, కార్యదర్శి సీతారాం నాయక్, నాదర్గుల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వస్త్రం నాయక్, ప్రధాన కార్యదర్శి జి.శ్రావణ్ కుమార్, అధ్యక్షులు ఆర్ లక్ష్మానాయక్, బడంపేట్ బంజారా యూత్ ప్రెసిడెంట్ బహుగుణ నాయక్, ఎస్ పాండు, వెంకటేశ్వరరావు, జె కిషన్, ఆంజనేయ రామ్ కుమార్, రష్యా కుమార్, హనుమంతు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బంజారా సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనగర్ కాలనీ సమస్యలపై కార్పొరేటర్ సమీక్షా సమావేశం



**నవతెలంగాణ-ఉప్పల్**

చిల్కానగర్ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్‌రెడ్డి అభ్యర్థనతో కాలనీ సమస్యలపై కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీలలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టి తీసుకొస్తే వెంటనే పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రామ్‌రెడ్డి, శ్రీకాంత్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



బండారి లక్ష్మారెడ్డిని తీజ్ పండుగకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేసిన చక్రీపురం మారుతీ కాలనీ అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా లంబాడి ఐక్య వేదిక అధ్యక్షులు హన్మంతు నాయక్, కిషన్ నాయక్, జామ్లా నాయక్, రెడ్డి నాయక్, మారుతీ కాలనీ కోశాధికారి గుగులోత్ నర్సింహా, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

-నవతెలంగాణ-కాప్రా

## నేడు 'ఎస్ఎఫ్ఐ' చలో కలెక్టరేట్ ముట్టడి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్



**నవతెలంగాణ-సిటీబ్యూరో, కాప్రా**

విద్యారంగ సమస్యలు-సంక్షేమ వసతి గహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని నేడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టను న్నట్టు ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకట విడుదల చేశారు. రాష్ట్రంలో మూడేండ్లుగా రూ.5,177 కోట్లు పెండింగ్ స్కాలర్ షిప్స్, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయలేదన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో సమస్యలు అలాగే ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయలేదని తెలి పారు. మెస్ బిల్లులు విడుదల చేయలేదని, యూనివ ర్శిటీల్లో ఫీజులు పెంచి ఉన్నత విద్యకు దూరం చేస్తుంద ని తెలిపారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో భారీగా పెంచిన ఫీజులు, విద్యారంగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, తగ్గిన నిధులు కేటాయింపు, గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం చేయాలని, యూనివర్శీ టీలకు నిధులు ఇవ్వాలని మూడు రోజులపాటు నిర్వహించిన అధ్యయన యాత్రలో అనేక సమస్య లు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఒక్క బిల్డింగ్‌లోనే మూడు నుంచి నాలుగు పాఠశాల నిర్వహించి 1200 నుంచి 2000 మంది విద్యార్థులకు ఒక్కరే ప్రిన్సిపాల్, ఆరుగురు టీచర్లు ఉన్నారని, కొంతమంది కాంట్రాక్ట్ టీచర్లు మాత్ర మే ఉండటం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన్న ట్రస్ట్ నుంచి మధ్యాహ్న భోజనం పెడుతున్నరని, ఇది నాణ్యతగా లేదని తెలిపారు. ఒక్క కర్రీలో మిల్లి మేకర్, క్యాబేజీ, పప్పు, ఆలుగడ్డ రుబ్బి కర్రీ చేసి పెట్టడంతో ఏ ఒక్క విద్యార్థి కూడా మధ్యాహ్న భోజనం తినడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మన్న ట్రస్టుని రద్దుచేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా కూరగాయలు, గుడ్లు, పండ్లు, కూడా పెట్టట్లేదన్నారు. ఖాళీగా ఉన్న టీచర్స్, లెక్చరర్స్, ఎంఈవో, వర్కర్స్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయడం లేదని, విద్యారంగంలో అనేక సమస్యలు కనబడుతున్నా ప్రభుత్వ మాత్రం దున్నపోతు మీద వర్షం కురిసినట్టుగానే వ్యవహరిస్తుందన్నారు. వెంటనే విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేటి చలో కలెక్టరేట్ ముట్టడికి రావాలని కోరారు.

## మున్సిపాల్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి మల్లారెడ్డి
- గుండ్లపోచంపల్లిలో పర్యటన
- స్వాగతం పలికిన కౌన్సిలర్ వీణా సురేందర్ గౌడ్
- రూ.4 కోట్ల 45లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**నవతెలంగాణ-మేడ్చల్**

మున్సిపాల్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు.ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 3వవార్డు కండ్లకోయలో రూ.4కోట్ల 45లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు 3వ వార్డు కౌన్సిలర్ వీణాసురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బోనాలు, ఒగ్గు కళాకారులతో మంత్రి మల్లారెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాల్టీలో గుండ్లపోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. మున్సిపల్ పరిధిలో ని 3,9,10 వార్డుల్లో సుమారు రూ.4కోట్ల 45లక్షల నిధులతో అంతర్గత డ్రయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, వైకుంఠధామం, వీధిదీపాలు ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టిన్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఒక్కోవార్డుకు దాదాపు రూ.4కోట్ల నిధులు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు. ప్రజాసేవ చేయడంలో మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు నిరంతరం కృషి చేస్తున్నారని వారిని మంత్రి అభినందిం చారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు వీణాసురేందర్ గౌడ్, సముద్రాల హంసారాణికృష్ణగౌడ్, అమరం జైపాల్‌రెడ్డి, భేరి బాలరాజు, అమరం హేమంత్‌రెడ్డి, శ్రీలతాశ్రీనివాస్‌రెడ్డి, రజిత వెంకటేష్, చింత పెంటయ్య, కో ఆప్షన్ సభ్యులు దేవేందర్, జయశ్రీ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, నాయకులు శివలింగల సురేందర్ గౌడ్, శ్రీహరి, రాజ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



### మేడ్చల్ గడ్డ..బీఆర్ఎస్ అడ్డా ..

**జవహర్‌నగర్‌లో..**

మేడ్చల్ గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా అని, దేశంలో ఎక్కడా లేని విధంగా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కార్పొరేషన్‌లోని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 100మంది యువకులు బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతున్నట్లు తెలిపారు. 2014కు ముందు తెలంగాణలో ఆకలి చావులు ఉండేవని, నేడు సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు మూడు పూటలా కడుపు నింపుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మతం పేరుతో విధ్వంసాలు సృష్టించడమే తప్ప అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్, నర్సింహాయాదవ్, శ్రీలత, కేతమ్మ, వర్షిత, బబ్లూ, బాషమోని నితిన్ ముదిరాజ్, తిరుపతి, భూషన్, శంకర్, అజయ్, కార్తీక్, రాజుకుమార్, రాఘవరెడ్డి, తరుణ్, చందు, అనిల్, సాయికుమార్, మహేష్, సూరజ్, రోహిత్, గణేష్, లక్ష్మి తదితరులలు పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి దభోల్కర్



**నవతెలంగాణ-కాప్రా**

ప్రముఖ విజ్ఞాన వేత్త నరేంద్ర దభోల్కర్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి అని ప్రముఖ రచయిత పీ.బీ చారి అన్నారు. ఆదివారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో నేషనల్ సైంటిఫిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పి.బిచారి మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని చెప్పారు. దేవుడి పేరిట మోసా లు చేసిన వారి ఆగడాలను బయ ట పెట్టారని తెలిపారు. మతం ముసుగులో చేస్తున్న దోపిడీ, అరాచకాలను వ్యతిరేఖించారని పేర్కొన్నారు. ఆర్ఎంఎస్ ఉగ్ర సంస్థల మారి అనేక మంది అభ్యుదయ వాదులను, మూఢనమ్మకాలను వ్యతిరేకించే వాళ్లను చంపింద న్నారు. ఆర్ఎస్ఎస్ గుండాలు దభోల్కర్‌ను తుపాకీతో కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. దభోల్కర్ మరణించిన రోజును వైజ్ఞానిక దినంగా నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించగా, కార్మిక నాయకులు ఉన్నీకృష్ణన్, నరేంద్ర దభోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ శ్రీనివాస్, బసవ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట్‌లో ఘనంగా పోచమ్మ బోనాల ఉత్సవాలు



**నవతెలంగాణ- మేడ్చల్**

మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట్ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఉత్సవాలు ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. గ్రామ పరిధిలోని నల్ల పోచమ్మ తల్లి ఆలయ ప్రాంగణం, ప్రధాన కూడళ్లను రంగురంగుల లైటింగ్‌లతో సుందరంగా అలంకరించారు. మాజీ సర్పంచ్ గౌరారం రేణుకాదేవి జగన్‌గౌడ్, బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లంపేట్ జగన్‌గౌడ్, భూమాగౌడ్, రోజా, నవీన, మౌనిక, సంజు ప్రియా, సారిక, వరలక్ష్మి, రేఖ, లత, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

## దొంగతనాల నివారణకు ప్రజల సహకారం కావాలి : సీఐ



**నవతెలంగాణ-కీసర**

దొంగతనాలు నివారించేందుకు ప్రజల సహకారం అవసరమని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాల్టీలోని నేతాజీ నగర్ కాలనీలో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దొంగతనాలు జరుగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి కాలనీలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులు ఎవరైనా కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలనిక సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## కాప్రా సర్కిల్‌లో 64వ వారం జ్ఞానమాల కార్యక్రమం



**నవతెలంగాణ-కాప్రా**

అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో భారతరత్న రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా చేపట్టిన అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం ఆదివారంతో 64వ వారానికి చేరింది. జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా జమ్మిగడ్డ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జ్ఞానమాల టీం సభ్యులు నరసింహ చారి, జాషువా రాములు, రవి నాయక్, దయానంద్, నరేందర్ రావు, కొండల్ నాగేష్, కాంత, శ్రీనివాస్, శేఖర్, వెంకటయ్య, మురళి నటరాజులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ కార్మికులకు కాంగ్రెస్ నేతల సంఘీభావం



**నవతెలంగాణ-కాప్రా**

జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు కాప్రా సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు రాఘవరెడ్డి, మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మెన్ పత్తి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మొసలి శ్రీనివాస్‌రెడ్డి, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి శ్రీనివాస్ గౌడ్ ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బందిని పర్మినెంట్ చేయకపోతే ఎంతవరకైనా వెళ్తామని అని అన్నారు. కార్మికుల వెంట కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. సమ్మెలో కార్మికులు, ఎస్ఎఫ్ఎ లు పాల్గొన్నారు.

## 'వడ్డెర కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'



**నవతెలంగాణ-కాప్రా**

వడ్డెర కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం వడ్డెర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వడ్డెర కులస్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీఎల్ఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, వరికుప్పల నర్సింహ, బొంత యాదయ్య, బొంత వెంకటేశ్, బోదాసు యాదగిరి, ట్రస్ట్ సభ్యుడు బోదాసు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అవును వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు

- సీటు కోసం రూట్ మార్చిన నేతలు
- అయోమయంలో ఉప్పల్ క్యాడర్
- సిట్టింగ్‌కు సీటు లేనట్లేనా?



**నవతెలంగాణ - హైదరాబాద్**

అవును వాళ్లిద్దరూ ఒక్కటయ్యారూ..నిన్న, మొన్నటి వరకు ఉప్పు నిప్పులా ఉన్న నేతలు నేడు కలిసి తిరగుతుండడంతో ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. గత కొన్ని రోజులుగా ఒకరిపై ఒకరు విమర్శల బాణం ఎక్కుపెట్టిన నేతలు ఒక్కసారిగా శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితను ఉమ్మడిగా కలవడంతో క్యాడర్‌లో కన్ఫ్యూజన్ పెరిగింది. ఉప్పల్ సిట్టింగ్ సీటు మారుతుందంటూ జోరుగా ప్రచారం జరుగుతుండటంతో పోటీలో ఉన్న నేతలు ఎవరికి వారే తమకే టికె ట్ అంటూ అధిష్టానం తనకే అనుకూలంగా ఉందంటూ ప్రచారం చేసుకున్నారు. ముఖ్యంగా తాజా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారు లక్ష్మారెడ్డి' లు ఎవరికి వారే అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయని ప్రచారం చేసుకోవడం జరిగింది. దీంతో నియోజకవర్గ క్యాడర్ ఏ నాయకుడితో ఉండాలో తెలియక తికమక పడ్డారు.



### ఉత్కంఠ రేపుతున్న ఉప్పల్ సీటు

గ్రేటర్ హైదరాబాదులోని ఉప్పల్ అసెంబ్లీ సీటు ఉత్కంఠ రేపుతోంది. దీంతో ఆశావహుల కు టెన్షన్ మొదలైంది. గ్రేటర్‌లో దాదాపు సిట్టింగ్‌లకు సీటు కేటాయిస్తుండడం తో ఉప్పల్ నియోజకవర్గంలో సిట్టింగ్ సీటు మార్పు అంటూ వస్తున్న ప్రచారంతో ఉప్పల్ గులాబీ నేతలు అయోమయానికి గురవుతున్నారు. తాజా ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డిని మార్చి బండారు లక్ష్మారెడ్డికి సీటు ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాలలో చెక్కర్లు కొట్టుండడంతో క్యాడర్‌లో అయోమయం నెలకొంది. దీనికి తోడు గత కొన్ని రోజులుగా పై ముగ్గురు నేతలు విడివిడిగా పార్టీ క్యాడర్‌ను విహార యాత్రలు, దైవ దర్శనాల పేరిటా సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగింది.

### తెరపైకి బీఎల్ఆర్ - వాళ్లిద్దరూ ఒక్కటి..

నిన్న మొన్నటి వరకు ఉప్పు నిప్పులా ఉన్న తాజా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మాజీ గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్‌లు ఇద్దరూ అనూ హ్యంగా ఆదివారం ఒక్కటయ్యారు. దీనంతటికి కారణం బండారి లక్ష్మారెడ్డికి మొదటి లిస్ట్‌లో పేరు వస్తుందనే వార్తలు సామాజిక మాధ్యమా లలో చక్కర్లు కొడుతుండడంతో అలర్ట్ అయిన తాజా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మాజీ గ్రేటర్ మేయర్ రామ్మోహన్‌లు హుటాహుటిన ఒక్కటి గా వెళ్లి సీఎం కేసీఆర్ కూతురు కవితను కలిసి తమలో ఎవరో ఒకరికి సీటు కేటాయించాలని, ఇతరుల కు సీటు ఇవద్దని కోరినట్లు సమాచా రం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విదేశాలలో ఉండడం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం మొదటి లిస్ట్ ప్రకటించే అవకాశం ఉండడంతో ఆ ఇద్దరు నేతలు అలర్ట్ అయ్యారనే ప్రచారం నియోజకవర్గంలో జోరందుకుంది.

## రాంపల్లి, చర్లపల్లి రోడ్డుకు మరమ్మతు పనులు



**నవతెలంగాణ-కీసర**

నాగారం మున్సిపాల్టీ పరిధిలోని రాంపల్లి నుంచి చర్లపల్లికి వెళ్లే రోడ్డుకు రెడ్మిక్స్ ఓనర్ అసోసియేషన్ దాతల సహకారంతో కోటి రూపాయలతో చేపట్టనున్న మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రా రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాంపల్లి నుంచి చర్లపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా మారడంతో దాతల సహకారంతో రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు.

### పనులను పరిశీలించిన మల్లారెడ్డి

రాంపల్లి, చర్లపల్లి రోడ్డు మరమ్మత్తు పనులను మంత్రి మల్లారెడ్డి ఆదివారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. పనులు ప్రారంభం కావడంతో యువజన సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు గుంతలమయంగా ఉందని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ,మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఎట్టకేలకు స్పందించి రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రి మల్లారెడ్డికి, నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలిజాల నగేష్‌గౌడ్, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ అరిగే రాములు, భాస్కర్ రెడ్డి, రెడ్మిక్స్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విచ్చల విడిగా వేస్తున్న బోర్లు.. పట్టింపులేని అధికారులు

**నవతెలంగాణ- కాప్రా**

కాప్రా రెవెన్యూ పరిధిలో విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు బోర్ల యజమానులతో కుమ్మక్కై వారిచ్చే మాముళ్లకు అలవాటు పడి నిబంధనలు విరుద్ధంగా బోర్లు వేస్తున్నారని ఆయా కాలనీవాల ప్రజలు మండిపడుతున్నారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని భావన సొసైటీలో ఆదివారం విచ్చలవిడిగా బోర్లు వేశారు. చర్లపల్లి డివిజన్ లోని శుభోదయం నగర్ కాలనీలో మరో బోర్ నిర్వాహకులు బోరు వేశారు. ఇదేంటని స్థానికు లు ప్రశ్నిస్తే కాప్రా రెవెన్యూ అధికారులతో మాట్లాడి వేస్తున్నామని చెప్పడం చర్చనీయాం శంగా మారింది. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటి పోతున్నా ఒక్కొక్కరు 500 నుంచి 1000గజాల వరకు బోర్లు వేస్తున్నారు. ఇప్పుడైనా మేడ్చల్ జిల్లా కలెక్టర్ స్పందించి బోర్‌వెల్ నిర్వాహకులు నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత బోర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులకు కోరుతున్నారు. ఈవిషయంపై అధికారులను వివరణ కోరగా ఎవరూ ఫోన్ ఎత్తడం లేదని స్థానికులు తెలిపారు.



## వైద్య విద్యార్థుల కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, వెబ్‌సైట్




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ, తాష్కెంట్ మెడికల్ అకాడమీ (టీఎంఏ) కలిసి భారతీయ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రమాణాల ప్రకారం 18001232931 అనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, www.studyinuzbek.uz అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించాయి. హైదరాబాద్‌లోని టీఎంఏ దక్షిణాసియా ప్రతినిధి కార్యాలయం దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలో సెమినార్లు కూడా నిర్వహిస్తోంది. కొంతమంది మోసపూరిత ఏజెంట్లు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు కల్పిస్తామని చెబుతూ, మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. నిజానికి ఇది ఎన్ఎంసీ 2021లో విధించిన ఎఫ్ఎంజీఎల్ (ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్సియేట్) నిబంధనలకు విరుద్ధం. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్లడంతో, ఎన్ఎంసీ తాజాగా కొత్త నిబంధనలు విధించింది. దాంతో విదేశీ యూనివర్సిటీలన్నీ తప్పనిసరిగా ఎన్ఎంసీ నిబంధనలకు కట్టుబడి ఉండాల్సి వచ్చింది. భారతదేశంలో ఇలాంటి నిబంధనలను అమలు చేయడంలో తొలిసారిగా ముందడుగు వేసిన ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, టీఎంఏ భారత ప్రతినిధి డాక్టర్ దివ్యా రాజ్ రెడ్డి విద్యార్థులకు అధికారిక సమాచారం అందించేందుకు వీలుగా టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. వీటి ద్వారా వైద్య విద్యార్థులు విదేశీ విద్య విషయంలో సమాచారాన్ని తనిఖీ చేసుకుని, తమ ప్రవేశాల విషయాన్ని ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారం ఖరారు చేసుకోవచ్చు. ఈ విషయమై టీఎంఏ వైస్ డీన్ డాక్టర్.ఖొల్మతొవ్ మాట్లాడుతూ, "మా వ్యూహాత్మక భాగస్వామి నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ భారతీయ పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలు, అధ్యాపకులు, నెక్స్ట్ మాస్టర్ క్లాసులను అందిస్తుంది. 250 మంది భారతీయ విద్యార్థులను టీఎంఏలో ఇంగ్లీషు మీడియంలో ఆరేండ్లపాటు వైద్య విద్యను చదవడానికి వీలు కల్పిస్తుంది. ఇందులో 2వేల టీచింగ్ బెడ్ క్లినిక్‌లలో ఏడాది ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇవి ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం టీఎంఏ ప్రామాణికీకరణకు సహాయపడ్డాయి" అని చెప్పారు.

## అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



**నవతెలంగాణ-మేడ్చల్**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్‌ల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన ఘనపూర్‌లో అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌ల విగ్రహాలను ఆవిష్కరించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్,జగ్జీవన్ రామ్‌లు దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బయమ్మరాములు, ఎంపీటీసీ అంకిత రవి, మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందా రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు విజయనందారెడ్డి, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనరాజ్ నాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ కళా మండల అధ్యక్షుడు ఎన్ వై అశోక్,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరశురాం, నాయకులు జగన్ రెడ్డి,బాల నర్సింహ, సత్యనారాయణ,వార్డు సభ్యులు వెంకటేష్, పుణ్యవతి, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రికి వాటర్ ప్యూరీ ఫైయర్ అందజేత



**నవతెలంగాణ-మేడ్చల్**

మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వాటర్ ప్యూరీఫైయర్ సిస్టంను బీజేపీ నాయకుడు గౌలికర్ మహేష్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్, సురేందర్‌రెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. సొంత నిధులతో వాటర్ ప్యూరిఫైయర్ సిస్టంను ఏర్పాటు చేసిన మహేష్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీటికి ఇబ్బందులు కలుగకూడదని వాటర్ ప్యూరిఫై సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రావలకోల్ మహేష్, రాజు, పానుగంటి సాయి కూమార్, శివ, నాగరాజు, నరేందర్, హాస్పిటల్ సిబ్బంది అరుణ్, చంద్ర, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ సోనియాగాంధీ నగర ఫేజ్ - 2 కాలనీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరై శుభాకాంక్షలు తెలియజే సిన స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. మౌలిక సదుపాయాల కల్పన, కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని కాలనీ వాసులకు తెలిపారు. నవతెలంగాణ-కాప్రా

నవతెలంగాణ
కూకట్‌పల్లి-మల్కాజిగిరి
సోమవారం ।21। ఆగస్టు। 2023 8

## మేరు సంఘం అధ్యక్షుడుగా అన్నం శ్రీనివాస్



నవతెలంగాణ-బాలానగర్

నూతనంగా ఏర్పడ్డ మేరు సంఘం బాలానగర్ జోన్ కమిటీ ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డికి కమిటీ సభ్యులు కలిసి నూతన కమిటీ సభ్యుల పత్రాన్ని కార్పొరేటర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మేరు కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగినా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు అన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అక్కు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, కోశాధికారి చిగురి నరేందర్, ఉపాధ్యక్షులు నాపోలు నాగరాజు, కార్యదర్శి పోలేపల్లి లక్ష్మణ్, ఆర్గనైసింగ్ సెక్రటరీ తల్లా సునీల్ తదితర నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను కలిశారు.

## ప్రమాదకరంగా మారిన చెట్టు తొలగింపు..



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో ప్రమాదకరంగా మారిన చెట్టును ఆదివారం తొలగించారు. ఇందు ట్రావెల్స్ దగ్గర ఓ భారీ చెట్టు ప్రజల ప్రయాణానికి రోజు ఇబ్బందికరంగా ఉందని, స్థానికులు ఈ సమస్యను కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డికి చెప్పారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఈ సమస్యను సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారులకు తెలిపారు. సమస్యలను పరిశీలించిన అధికారులు, తమ సిబ్బందితో వచ్చి చెట్టును తొలగించారు. ఈ పనులను బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం ఆయన యాప్రాల్‌లోని ఎస్వీ కాలనీలో జరుగుతున్న డ్రయినేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, వర్క్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్, చెన్నా రెడ్డి, శివ, రమేష్ పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 79వ జయంతి



నవతెలంగాణ-బాలానగర్

భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిలో రాజీవ్ గ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుష్పారెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తన చివరి శ్వాస ఉన్నంతవరకు దేశం కోసం ప్రాణాలర్పించిన అవిశ్రాంత ధీరుడు, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు అని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ బండారి నవీన్ గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బ్లాక్ ఉపాధ్యక్షులు మాది రెడ్డి యుగంధర్ రెడ్డి, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, ఏ బ్లాక్ ఎస్సీ అధ్యక్షులు బందిగా బాల నరసింహ, డివిజన్ ఉపాధ్యక్షులు బాలరాజు, ప్రతాప్ సింగ్, రిషి యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మల్కాజిగిరి:** భారతదేశంలో ఐటి రంగానికి బాటలు వేసింది మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మేడ్చల్



మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం గౌతమ్ నగర్ డివిజన్ సత్యనారాయణ కేఫ్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి మొట్టమొదటి సూపర్ కంప్యూటర్ ఇవ్వడమే కాకుండా ఆ రంగంలో నూతన శకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ జి.డి.శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, లింగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గుత్తి రాంచందర్, గౌస్ బాయ్, మహమ్మద్ అలీ, ఎమ్మార్ శ్రీనివాస్ యాదవ్, రెబ్బ వాసు తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట:** భారత మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం గాంధీ భవన్‌లో తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బంటు నరేష్‌తోపాటు వారి మిత్ర బృందం యూత్ కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ గౌడ్‌లు హజరయ్యారు. కుత్బుల్లాపూర్ యువజన కాంగ్రెస్ నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. రక్త దాన కార్యక్రమం అనంతరం తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రవణ్ రెడ్డి రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. రాబోయే



ఎన్నికలకు యువజన కాంగ్రెస్ నాయకులు కంకణబద్ధులై పని చేయాలని వారు తెలిపారు.

**నేరేడ్‌మెట్:** దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికి టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజీవ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అతి చిన్న వయసులోనే భారత ప్రధానిగా పదవి చేపట్టి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి భారత దేశ ప్రజల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచి పోయారన్నారు. అలాగే ఓటు హక్కును 21 సంవత్స రాల నుండి 18 సంవత్సరాలకు కుదించి యువతకు ఓటు హక్కును రాజీవ్ గాంధీ కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్లు శ్రీనివాస్, సూర్య ప్రకాష్ రెడ్డి, పవన్ కుమార్, సంతోష్ రెడ్డి, శివశంకర్, పాతాలు, సంజీవరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు , బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని తన నివాసం వద్ద కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.**



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

## మహిళా నాయకురాళ్ళతో సమావేశమైన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

డివిజన్‌లో చేపట్టబోయే పాదయాత్రలో భాగంగా, ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మహిళా నాయకురాళ్లతో సమావేశమయ్యారు. ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ తన కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన సమైక్య లీడర్లు, బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లతో, సమావేశమై రానున్న రోజుల్లో నిర్వహించబోతున్న పాదయాత్ర గురించి డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసే విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, గౌరవ మహిళా అధ్యక్షురాలు మధులత, లక్ష్మమ్మ, షేక్ బీబీ, స్వరుపా, నస్రీన్, పుట్టం దేవి, రేణుక, సురేఖ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## అల్లాపూర్ డివిజన్‌లో శాంతియుత ర్యాలీ




నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను వ్యతిరేకిస్తూ ఆదివారం అల్లాపూర్ డివిజన్ క్రిస్టియన్ మైనారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్‌లోని అన్ని చర్చిల పాస్టర్లు, క్రైస్తవ మహిళలు, చిన్నారులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, స్వామి, దేవదానం, జాషువా, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కైత్లాపూర్‌లో శ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల పండుగ



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్ శ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ప్రభాకర్ గౌడ్, కూకట్‌పల్లి సీఐ సురేందర్, ఎస్ఐ. ప్రేమ్ సాగర్, సీనియర్ నాయకులు యాదయ్య, సంతోష్, శ్రీశైలం యాదవ్, బాలయ్య, పాల్గొన్నారు.

## మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి



- పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 79వ జయంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీలోని రాజీవ్ సర్కిల్‌లో కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ టెలీ కమ్యూనికేషన్స్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు రాజీవ్ గాంధీ, ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి సమ సమాజ స్థాపన కోసం ఎంతో కృషి చేశారని, నూతన విదేశీ విధానంతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపారని తెలిపారు. ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో దూసుకుపోతున్న వేళ మన దేశంలోను సాంకేతిక విప్లవం రావాలని తపించారు. సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను సమకూర్చాలని ఎంతో తపన పడ్డారు. మన దేశం ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఆయన చేసిన ప్రయత్నాన్ని మేధావులు సైతం ప్రశంసించారు. రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు అధికారాలు ఇచ్చి స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేశారు. దేశ రాజకీయాల్లోకి యువశక్తి వచ్చిందంటే అందుకు ప్రధాన కారణం రాజీవ్ గాంధీ అని, మాజీ యువ ప్రధాని రాజీవ్ ఆశయాలకు యువత ముందడుగు వేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, అప్పారావు, ప్రకాష్, గురుమూర్తి, అజిత్ రెడ్డి, రంగస్వామి, కూకట్‌పల్లి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ గౌడ్, మహేష్ గౌడ్, నయీం, అరుణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉమన్ అండ్ చైల్డ్ కోసం ప్రత్యేకంగా, అత్యాధునిక సదుపాయాలతో హైటెక్ సిటీ మెటల్ చార్మినార్ ఎదురుగా నిర్మించిన మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్‌ని శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ చైర్మెన్ అండ్ మానిటరింగ్ కమిషన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి రామలింగేశ్వర రావు, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అనురాగ్‌శర్మ, సజ్జనార్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మెడికవర్ గ్రూప్ అఫ్ హాస్పిటల్స్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా అనిల్ కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అనతి కాలంలోనే ప్రజలకు అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన డాక్టర్స్‌తో సేవలను అందిస్తూ ప్రజల మన్నలను పొందటం హర్షించదగ్గ విషయం అన్నారు. స్థాపించిన అతి కొద్ది కాలంలోనే 25 హాస్పిటల్స్‌కి విస్తరించడం చాలా గర్వించ తగ్గ విషయం అన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల అనేక అనారోగ్య సమస్యలని వస్తుంటాయని, పుట్టబోయే శిశువులు, పుట్టిన శిశువులు, చిన్నపిల్లలు, పెద్దవారు సమస్యలను ఎదురుకుంటున్నారని తెలిపారు. హాస్పిటల్‌ను స్త్రీలు, చిన్నపిల్లలకు అత్యాధునిక సదుపాయాలతో వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రత్యేకంగా నిర్మించడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. రామలింగేశ్వర రావు మాట్లాడుతూ ఉమన్ అండ్ చైల్డ్ కోసం అత్యాధునిక సదుపాయాలతో నిర్మించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. అనిల్ కృష్ణ మాట్లాడుతూ 100 బెడ్స్‌తో, 25 బెడ్డెడ్ లెవెల్ 4 ఎన్ఐసీయూ అండ్ పీఐసీయూ యూనిట్స్, అత్యాధునిక హై ఎండ్ పరికరాలు, ఆపరేషన్ థియేటర్స్ , 24 బై 7 అనుభవజ్ఞులైన గైనకాలజీ, ఒబెస్ట్రిక్స్, పిడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజీ డాక్టర్స్ అందుబాటులో శిశువులు, గర్భిణులు, పిల్లలకు, స్త్రీలకు వైద్య సేవలని అందిచాలి అనే లక్ష్యంతో ఈ హాస్పిటల్‌ని నిర్మించినట్టు తెలిపారు. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి వల్ల చాలా మంది అనేక అనారోగ్య సమస్యలని ఎదురుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారి అయినా ఆరోగ్య పరీక్షలు చేపించుకోవడం ఎంతో మేలు అన్నారు. ఎలాంటి రోగాన్ని అయిన మొదటి దశలోనే గుర్తిస్తే దానికి సరైన సమయంలో చికిత్స తీసుకోవడం వల్ల ప్రాణనష్టం జరగకుండా ఉంటుంది అని తెలిపారు. డాక్టర్ రవీందర్ రెడ్డి పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజీ విభాగం అధిపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అత్యాధునిక సౌకర్యాలతో, హై ఎండ్ టెక్నాలజీతో వైద్యసేవలను అందిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్ రెడ్డి, డైరెక్టర్ క్లినికల్ సర్వీసెస్ అండ్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ కృష్ణ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, మహేష్ ధేగ్లూర్కర్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, డాక్టర్ రవీందర్ రెడ్డి పరిగె హెచ్‌ఓడీ నియోనాటాలజీ, పీడియాట్రిక్స్, డాక్టర్ లలిత- యురోగైనకాలజిస్ట్, గైనకాలజిస్ట్ అండ్ ఒబెస్ట్రిక్స్ డాక్టర్ రాధికా, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ అనూష రెడ్డి, క్లస్టర్ హెడ్ దుర్గేష్, సెంటర్ హెడ్ అనిల్, డీఎంఎస్ డాక్టర్ సంగీత, పాల్గొన్నారు.

## ఆక్రిడేషన్‌లో ఫోటో జర్నలిస్టుగా మార్పుకు ప్రయత్నం చేస్తాం



నవతెలంగాణ-కల్చరల్

గతంలో పత్రికా ఫోటోగ్రాఫర్‌లకు ఫోటో జర్నలిస్ట్‌గా ఆక్రిడిటేషన్ కార్డ్‌లో వుండేదని కానీ నేడు ఫోటో గ్రాఫర్‌గా మార్పు చేయటం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తప్పకుండా వారి సమస్య పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్య ఆర్థిక శాఖామంత్రి తన్నీరు హరీశ్‌రావు హామీ నిచ్చారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా రవీంద్ర భారతి ప్రాంగణంలో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనలో గెలు పొందిన ఛాయాగ్రహకులకు బహుమతి ప్రధానం సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరీశ్‌రావు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఫోటో జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి విలువైన ఫోటోలు అందించారని గుర్తు చేసుకొన్నారు. ఫోటో పద్యమంత చిన్నదే కావచ్చు కానీ భావం, తాత్పర్యంలో ఎంతో అర్థంఉంటుందన్నారు. ఫోటో ఏ సందర్భంలైన దానిలో ఆత్మీయత, ప్రేమ, బాధ అన్నీ అద్భుతంగా ఆవిష్కృతం అవుతాయన్నారు. దిన పత్రికలులో వార్త పూర్తిగా చదివే సమయం లేకున్నా ఫోటో చూసి సారాంశం గ్రహించ వచ్చునని తెలిపారు..అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ అత్యధికంగా అక్రెడిటేషన్‌లు తెలంగాణలోనే వున్నాయని తెలిపారు. వంద కోట్లు జర్నిస్టుల సంక్షేమ నిధికి ప్రభుత్వం కేటాయించిదన్నారు. త్వరలో జర్నలిస్ట్ భవన్ ప్రారంభించుతున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు భాస్కర్ కార్యక్రమాన్ని నిర్వహించారు శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలోని బౌరంపేట్‌లో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో ఆదివారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవచింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడం పట్ల సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మురళి యాదవ్, విష్ణు, ధర్మ రెడ్డి,ఎస్.వీ. సురేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్, ఆలయ కమిటి సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్‌లో శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద ఆదివారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవానికి ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో రాజీవ్ గృహకల్ప వాసులు చేరికలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప కాల నీ వాసులు కేంద్ర రాష్ట్ర వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై విశాల్, అరవింద్, వాసు రెడ్డి, కరీమ్, రాజు, వారి మిత్రబృందం ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ నా యకులు టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి గారి అధ్వర్య ంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ కాం గ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతి ఏడాది జూన్ 2నాటికీ అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17 లోపు నియామకాల పూర్తి విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేసి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలల్లో కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండ ఎగర వేయడం కాయమని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయం : కార్పొరేటర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివా స్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని లేక్ వ్యూ కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారా నికై తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లేక్ వ్యూ కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకోని వారి విజ్ఞప్తి మేరకు కాలనీలలో పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. సంతు లిత, సమగ్ర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నా రు. కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కాలనీ వాసులందరి సమిష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అదేవిధంగా డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్, కాలనీ వాసులు మోహన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సురేష్, వెంకటేశ్వర్ రావు, శరత్, యుగేష్ రెడ్డి, పురేంద్ర కుమార్, జయంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన కార్యక్రమంలో అమిత్ భాస్కర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా, వాల్ పెంటింగ్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర అందేరి శాసనసభ్యులు అమిత్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో చేపట్టే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మరోసారి మోదీ సర్కార్, తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం అని వాల్ పెయింట్ వేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హర్షనపల్లి సూర్య రావు, నాయినెని సూర్యప్రకాష్ రావు, కూకట్ పల్లి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, సోషల్ మీడియా కన్వీనర్లు, వివిధ మోర్చల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశ్యమని



మహారాష్ట్ర రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, ప్రస్తుత ఎమ్మెల్యే అశోక్ రామ జీ అన్నారు. ఆదివారం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని జైన్ మందిర హాల్‌లో నిర్వహించిన అసెంబ్లీ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ముఖ్య అజెండాగా కార్యకర్తలు బూత్ స్థాయి నుండి పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ పార్టీని మరీంత బలోపేతం చేసే దిశగా 8 రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామ చంద్ర రావు, బీజేవైఎం నేషనల్ ట్రెజరర్ సాయి ప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు కన్వీనర్ ఆర్ కె శ్రీనివాస్, రాజ్యలక్ష్మి ,అసెంబ్లీ కన్వీనర్ సదానంద్ , డివిజన్ అధ్యక్షు డు ఓం ప్రకాష్, సాయి,రాష్ట్ర , జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## జీనియస్ గ్లోబల్ రికార్డ్ కెక్కిన తెలుగు వాగ్గేయకార వైభవం

నవతెలంగాణ-కల్చరల్

వైవిధ్యం వైభవం కలగలిసి తెలుగు వాగ్గేయకార వైభవం పేరిట రవీంద్రభారతి ప్రధాన వేదిక పై భారత్ ఆర్ట్స్ అకాడెమీ ఏబీ. సీ ఫౌండేషన్ నిర్వహణలో సంగీత గాన గోష్ఠి నిర్వహించారు. 18 మంది గురువులు, రామదాసు అన్నమయ్య ఇద్దరు వాగ్గేయకారుల కీర్తనలు 303 మంది శిష్య బృందం ఎనిమిది గంటల పాటు నిర్విరామంగా గానం చేశారు. జీనియస్ గ్లోబల్ రికార్డ్ ప్రతినిధి రమణారావు వీరి విన్యాసం రికార్డ్ కెక్కినట్లు ప్రకటించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు మా కార్యవర్గ సభ్యుడు మాణిక్ అవార్డ్స్‌ను అందజేసి మాట్లాడారు కోట్ల ధనం సంపాదించినావెంట రాదని పిల్లలకు మనం నేర్పే సంస్కారం, విద్య కళలు మాత్రమే సమాజంలో గుర్తింపు తెస్తాయన్నారు. తల్లితండ్రులు వారు నేర్చుకోలేక పోయినా పిల్లలకు కళలను నేర్పించి ఆనందపడటం సహజమన్నారు సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ హజరుఇన సభకు లలితా రావు స్వాగతం పలికారు. 303 గాయకులకు వాయిద్య సహకారం అందించిన ఫణిబాల శర్మను ప్రత్యేకంగా అభినందిచారు.

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో కృష్ణా నగర్‌లో స్థానిక కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరిన బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సంపత్, మూర్తి, సుధాకర్, వీరంశెట్టి, హనుమంతు, నందు గౌడ్, శివ, ప్రభాకర్, మహేష్, మాధురి, భాగ్యలక్ష్మి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.**



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

## శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించాలి : శరత్‌నాయక్



నవతెలంగాణ-ఓయూ

గిరిజన ప్రజాప్రతినిధి భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ రాజేష్ పై భౌతిక దాడికి పాల్పడిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మంత్రివర్గం నుండి తొలగించి, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్, గిరిజన నాయకుడు, ప్రజాప్రతినిధి జాదవ్ రాజేష్ బాబుని శుక్రవారం కేటీఆర్ ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా తన ముందు నడుస్తున్నాడని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెనుకనుండి కొట్టి, మళ్ళీ ముందుకు వచ్చి చెంప మీద కొట్టి అవమానించారని, దీనికి నిరసనగా ఆదివారం సాయంత్రం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట గిరిజన శక్తి ఆధ్వర్యంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్ 24 గంటల్లో జాదవ్ రాజేష్ బాబుకు క్షమాపణ చెప్పకపోతే తగిన మూల్యం చేల్లించుకోవాల్సిందే గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు నవీన్ నాయక్, ఓయూ అధ్యక్షులు హనుమంతు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సుధాకర్ నాయక్, ఓయూ ప్రధాన కార్యదర్శి సతీష్ నాయక్ పాల్గొన్నారు.

## జిల్లా మాల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వర్కింగ్ చైర్మెన్‌గా పరుగుల ప్రశాంత్



నవతెలంగాణ-ఓయూ

డాక్టర్ బాబాసాహెబ్ అం బేద్కర్ ఆలోచన విధానంతో పని చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మాల సంఘ జాయింట్ యాక్షన్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ పరుగుల ప్రశాంతను హైదరాబాద్ జిల్లా కమిటీలో వర్కింగ్ చైర్మెన్‌గా నియమిస్తూ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చైర్మెన్‌గా నియమితులైనందుకు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మహర్షిస్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల

## భారత ప్రభుత్వ కమిటీ సభ్యునిగా డాక్టర్ డి.ధర్మతేజ



నవతెలంగాణ-ఓయూ

ఆర్య సమాజ్ వ్యవస్థాప కు లు,ప్రముఖ స్వతంత్ర సమరయోధులు మహర్షి స్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్స వాల భారత ప్రభుత్వ కమిటీ సభ్యునిగా డాక్టర్ డి.ధర్మతేజ ఎంపిక ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆర్య సమాజ్ ప్రాంతీయ ప్రతినిధిగా,ఓయూ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ అధ్యాపకుడిగా ఉన్న డాక్టర్ డి ధర్మతేజను, 97 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో సీరియల్ నెంబర్ 75నెంబర్‌గా డాక్టర్ ధర్మతేజను భారత ప్రభుత్వం కమిటీలో నియమించింది. భారత ప్రభుత్వ ఉత్సవాల కమిటీలు సభ్యులుగా నియమించిన ధర్మతేజను పలువురు ప్రముఖులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందించారు.

# దళితబంధు-2 కసరత్తు

- ప్రతి నియోజకవర్గానికి 1100 మంది చొప్పున ఎంపిక
- 15 నియోజకవర్గాలకు కలిపి 16,500 యూనిట్లు మంజూరు
- జిల్లాలో దళిత బంధు కోసం ఇప్పటి వరకు 9వేల మంది దరఖాస్తు
- నియోజకవర్గానికి 6గురి చొప్పున రెండు కమిటీల ఏర్పాటు
- త్వరలో ఇంటింటికి సర్వే చేపట్టనున్న అధికారులు
- దరఖాస్తుల పరిశీలన..ఆన్‌లైన్‌లో వివరాల నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దళితబంధు-2 మంజూరు కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులను జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ సిబ్బంది ఒకటి రెండు రోజుల్లో సమగ్ర విచారణ చేపట్టనున్నారు. ఇందుకోసం ఒక్కో నియోజకవర్గానికి రెండు కమిటీల చొప్పున ఏర్పాటు చేశారు. ఇందులో జీహెచ్‌ఎంసీ నుంచి ముగ్గురు, రెవెన్యూ నుంచి మరో ముగ్గురు మొత్తం ఆరుగురు సిబ్బందితో కమిటీలు చేయగా.. వారంతా ఇంటింటికి సర్వే చేపట్టి దరఖాస్తుదారుల వివరాలు అడిగి తెలుసుకుంటారు. వాటిని దళితబంధు పోర్టల్‌లో నమోదు చేస్తారు. దళిత బంధు తొలివిడుత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి లబ్దిదారుల ఎం పికలో తగిన జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, ప్రత్యేక కమిటీల్లోని సిబ్బందితో కలెక్టర్ సమావేశం కానున్నారు. సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారితో చర్చించనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం దళితులను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం హైదరాబాద్ జిల్లాలోనూ అమలవుతున్న విషయం తెలిసిందే. మొదటి విడుతలో నియోజకవర్గానికి 100 మంది చొప్పున ఎంపిక చేయగా.. జిల్లాలో 15 నియోజకవర్గాలకుగాను 1484 మంది లబ్దిదారులను ఎంపిక చేసింది. ఒక్కొక్కరికి 10 లక్షల చొప్పున 148.40కోట్లను ఖాతాల్లో జమచేసింది. 16 మంది ఇతర నియోజకవర్గాలకు చెందినవారు. ఇదిలావుంటే రెండు విడుత దళితబంధు కింద నియోజకవర్గానికి 1100 చొప్పున యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాకు రెండు విడుతలో 16500 యూనిట్లు మంజూరు కాగా.. ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున 1650 కోట్ల బడ్జెట్ అవసరం. కాగా ఇప్పటికే మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్సీ కార్యాలయాలకు 9వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. మరో రెండు రోజుల్లో వచ్చిన దరఖాస్తుల విచారణ చేపట్టి నిజమైన అర్హులు ఉన్నారా? లేదా అనే విషయాన్ని తెల్చుతారు. ఇందుకోసం ఆయా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్తారు. ఆధార్, రేషన్ కార్డు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లతో పాటు ఇతర పత్రాలను పరిశీలిస్తారు. సొంత ఇండ్లు, వాహనాలు ఉన్నయో లేదా నోట్ చేసుకుంటారు. అదేవిధంగా ఇప్పటికే లబ్దిపొందారు చూస్తారు. దాదాపు 20కి పైగా అంశాల్లో లబ్దిదారుల వడబోత పరిశీలిస్తారు. ముఖ్యంగా లబ్దిదారుడి నియోజకవర్గం, కులం, వయసుతో పాటు ఒంటరి మహిళలు, పురుషులా? అనే విషయాన్ని పక్కాగా చూస్తారు. వారం రోజుల్లో సర్వే పూర్తిచేసి.. మరో వారం రోజుల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కంప్లీట్ చేస్తారు. అనంతరం అర్హుల జాబితాను రూపొందించి..ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తారు. సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యేలతో కలిసి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపడుతారు. తుది జాబితా అనంతరం లబ్దిదారులకు రూ.10లక్షల చొప్పున ఖాతాల్లో జమ చేయనున్నారు.

ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గానికి 1100 యూనిట్ల మంజూరు అంటే పెద్దమొత్తంలో నిధులు అవసరం. అసలే ఎన్నికల సీజన్.. అందుకని క్షేత్రస్థాయిలో ఇబ్బందులు లేకుండా ఒక్కో నియోజకవర్గానికి ప్రస్తుత విడుతలో 350-400 వరకు లబ్దిదారులను ఎంపిక చేసి.. దీనిని నిరంతర ప్రక్రియగా కొనసాగించే యోచనలో సర్కారు ఉన్నట్టుగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

### వంద రకాల ఉపాధులున్నా..వాటికే మొగ్గు..!

ప్రభుత్వం దళిత బంధు పథకం ద్వారా వంద రకాల ఉపాధులను పొందవచ్చని చెప్పినా.. అవేవి వద్దంటూ.. మొదటివిడుత దళితబంధులో 1484 లబ్దిదారుల్లో సగానికిపైగా వాహనాలే తీసుకున్నారు. ఇందులో కార్లు, ఆటోలు, ఇతర వాహనాలున్నాయి. వాస్తవానికి లబ్దిదారులకు రూ.10 లక్షల్లో మంజూరు చేసే యూనిట్లకు సంబంధించి జనరల్ స్టోర్స్, మినీ సూపర్ మార్కెట్, ఆటోమొబైల్, వస్త్రా దుకాణాలు, మినీ డైరీ, కాంక్రీట్ మిశ్రమం తయారీ యంత్రం, సెంట్రింగ్, ఫర్టిలై జర్స్ షాప్, ఫొటో స్టూడియో, డయాగ్నోస్టిక్ ల్యాబ్, మెడికల్ షాప్, టెంట్‌హౌస్, సౌండ్ సిస్టం ఆటోట్రాలీ వంటి ఎన్నో యూ నిట్లు ఉన్నా.. చాలా మంది లబ్దిదారులు అవగాహన లేక మరే ఇతర కారణాలతో వాహనాలకే సై అంటున్నారు. ఈసారి అలా జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారు. ప్రజాప్రతి నిధులు కూడా వాహనాల కంటే ఇతర వ్యాపారాల్లో స్థిరపడే యూనిట్లకే లబ్దిదారులను ప్రోత్సహించనున్నారు.

### అర్హులైన నిరుపేదల ఎంపికకే ప్రాధాన్యత

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

దళితబంధు-2లో అర్హులైన నిరుపేదలను మాత్రమే ఎంపిక చేస్తాం. ఒంటరి మహిళలు, 60ఏండ్ల పైబడిన, నియోజకవర్గ పరిధికాని, దళితులు కాని వారిని ఎంపిక చేయవద్దని ప్రత్యేక అధికారులకు ఆదేశించాం. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి సరియైన లబ్దిదారులను ఎంపిక చేయాలని చెప్పాం. దళారుల ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

## సీతాఫల్మన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్మండిలో కాంగ్రెస్ పార్టీ కార్యా లయం సీనియర్ కాంగ్రెస్ నాయకులు నోముల ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో అనిల్ కుమార్ చేతులమీదుగా ఆదివారం సీతా ఫల్ మండిలో కాంగ్రెస్ పార్టీ కార్యాల యాన్ని ప్రారంభించారు. అనంతరం సీతా ఫల్మండి చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలవేసి రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు నిర్వహిం చారు. శ్రీదేవి నర్సింగ్ హోమ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ (జెండా) పథకాన్ని ఆవిష్కరిం చారు. గౌరీ శంకర్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమా ర్, హాజరై శాంతి కపోతాన్ని (పావురం) ఎగరవేశారు.ఈ సందర్భంగా నోముల ప్రకాష్ మాట్లాడుతూ. సికిం ద్రాబాద్ నియో జకవర్గం ఎప్పుడో అభివృద్ధి చెందిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నూ స్థానికులకే సీటు కేటాయించే విధంగా అధిష్టానం దృష్టి సారించిందని, తనకు టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని, సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ సత్తా చాటుతామని నోముల ప్రకాష్‌రావు అన్నారు.

### రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అన్నదానం

మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. దేశానికి కాంగ్రెస్ రాజీవ్ గాంధీ సేవాలు ఎనలే నివి అన్నారు. సాయికుమార్, సురేష్ లాల్, జగదీష్, (జగ్గు)వహీద్ భాయ్, సాయి మధుకర్, అభిషేక్, కిషోర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, బండి లక్ష్మణ్, వేణు టెంట్ హౌస్, నాగులూరి అరుణ్,కిషోర్ యాదవ్, ప్రవీణ్ లాల్, రాం లాల్, నాగులూరి శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.



గంగ తెప్పోత్సవం కార్యక్రమంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గడ్డం సాయికిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

## పేదల భూముల కబ్జాలో సీఎం బంధువులే సూత్రధారులు

### సీఎం ఫోటోతో వందల ఎకరాలు స్వాహా చేస్తున్న వైనం, బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరు, -కల్వకుంట్ల రమ్యారావు ప్రతిజ్ఞ



నవతెలంగాణ-బంజారాహిల్స్

పేదల భూముల కబ్జాలలో సీఎం బం ధువులే సూత్రధారులుగా వ్యవహరిస్తు న్నారని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్న కుమార్తె కల్వకుంట్ల రమ్యారావు ఆరోపించారు.సీఎం ఫోటోతో ఎక రాలకు ఎకరాలు తమ ఆధీనంలోకి తీసుకుంటూ పేదలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హ్యాపీ హోమ్స్ సాగర్ ఇన్ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. 2001 ముందు గజం స్థలం లేని వ్యక్తులకు నేడు ఎకరాల కొద్దిభూములు, కోట్లాది రూపాయలు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, బద్వేల్ గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 310,311,312 లలో గల స్థలాలను తక్కువ ఆదాయం పొందే కార్మికులు ఉద్యోగులు దాచుకున్న సొమ్ముతో కొనుగోలు చేశారని, సదరు స్థలాన్ని లిక్కర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీనివాసరావు, ప్రవీణ్ రావు, ప్రవీణ్‌రావు భార్య అనిత,శ్రీరామ్‌లు అడ్డదా రిలో తమ ఆధీనంలోకి తీసుకొని బాధితులను ఇబ్బందులకు గరి చేశారన్నారు. సుమారు 39 ఎకరాల 11 గుం టల స్థలాన్ని స్వాధీనం చేసుకున్న కబ్జాదారులు అందులోని మసీదు, స్మశాన వాటికను సైతం నేలమట్టం చేసి బౌన్సర్లతో అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశా రు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం ప్రగతి భవన్ వద్ద లేని సెక్యూరిటీ కబ్జా చేసిన స్థలానికి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మార్వోలు కబ్జా దారులకు సహకరిస్తుండగా హుడా, మునిసిపల్, రేరా, అధికారులు అక్రమ నిర్మాణాలకు అనుమ తు లు ఎలా ఇచ్చారని నిలదీశారు. ముఖ్యమంత్రి తమ బంధువే అంటూ చెలరేగిపోతున్న వారి పట్ల సీఎం కేసీఆర్ నివేదికలు తెప్పించుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూబకాసురుల ఆగడాల నుంచి ప్రజల ను కాపాడేందుకు తక్షణమే సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులలో ఈ అంశంపై స్పందించ కపోతే బాధితులతో కలిసి కబ్జాకు గురైన స్థలంలోనే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరిం చింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ హిదైతుల్లా షఫీ, ప్రధాన కార్యదర్శి హైమద్ సరఫరాజ్ సిద్ధికి,ఉపాధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి, పావని,మీర్జా దిల్వార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



## నిరాశ్రయులు, అనాధలకు దుస్తుల పంపిణీ

### స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్

నవతెలంగాణ-అడిక్ మెట్

హైదరాబాద్ నగరంలో ఫుట్పాత్ల మీద జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక మంలో ప్రెసిడెంట్ వై.సంజీవకుమార్,వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు నేహా, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన గంగపుత్రుల గంగ తెప్పోత్సవం

### ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గం లోని అరుంధతి నగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగా తెప్పోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ తెప్పోత్సవ శోభయాత్రకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర మరియు ప్రకాష్, పూస రాజు, నవీన్, చందు, భారతీ, లలిత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం



### టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీశ్వర రావు

నవ తెలంగాణ - అడిక్ మెట్

రాజీవ్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం అని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీశ్వర రావు అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి సందర్భంగా టిఆర్టి అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీశ్వర్ రావు హాజరై మాట్లాడుతూ.దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో, అంజిరెడ్డి, శ్రీరాములు యాదగిరి, కేశవ్, అభిషేక్ రెడ్డి , నాగేంద్ర, సమీద్, అబ్దుల్, చారీ, రామక్రిష్ణ , దశరథ్, తేజ గౌడ్, దినేష్ జెల్ల, జగ్దిష్, చిన్న, నెల్సన్, సందీప్ , సునీల్ తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ కల్పన కాంగ్రెస్ పార్టీ ప్రథమ లక్ష్యం

నవతెలంగాణ-బేగంపేట్

ఉద్యోగ కల్పనే కాంగ్రెస్ పార్టీ ప్రథమ లక్ష్యంగా ఉంటుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. కెసిఆర్ సర్కార్ నిరుద్యోగ జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు.సనత్ నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట డివిజన్లో రాజీవ్ గాంధీ జయంతి సంద ర్భంగా రాజీవ్ గాంధీ సనత్‌నగర్ జాబ్ భరోసా కార్యక్రమంలో ఆదివారం నిర్వహి ంచారు. యువత లైవ్‌మ్యూజిక్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కోట నీలిమా మాట్లాడుతూ తెలంగాణ సాధనలో యువకులు, విద్యార్థులు,నిరుద్యోగులుకీలకపాత్ర పోషించారన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్ గాంధీ సనత్ నగర్ జాబ్ భరోసా కార్యక్రమంలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వారికి కాంగ్రెస్ తరఫున ఉద్యోగ కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన మ్యూజిక్ యువతను ఆకట్టుకుంది.

## పద్మారావునగర్ పార్క్‌లో బోనాల ఉత్సవాలు



నవతెలంగాణ-బేగంపేట

భవిష్యత్ తరాలకు మన సంస్కృతిని చాటిచేప్పేవి పండుగలు అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మం త్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం సనత్‌నగర్ నియో జక వర్గ పరిధిలోని పద్మారావు నగర్ పార్క్ లో నిర్వహించిన బోనాల ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పార్క్‌లోని శ్రీ వ దేవత మాత అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మారావు నగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రణధీర్, అడ్వైజర్ చంద్రశేఖర్, బీఆర్ ఎస్ పార్టీ బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

## కాలేరు వెంకటేశ్‌కు అంబర్‌పేట ఎమ్మెల్యే టికెట్ ఇవ్వద్దు

### మాజీ కార్పొరేటర్లు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వొద్దని మాజీ కార్పొరేటర్లు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం శివం రోడ్డు ధ్రువ ఎలైట్‌లో అం బర్‌పేట నియోజకవర్గం మాజీ కార్పొరేటర్‌లు పద్మావతి డీపీ రెడ్డి, ఎక్కల చైతన్య కన్నా, పులి జగన్,గరిగంటి శ్రీదేవి రమేష్, బీఆర్‌ఎస్ సీనియర్ అసమ్మతి నేతలు అత్యవసర మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వొద్దని, ఈ ఎమ్మెల్యే మాకొద్దు అని ఎమ్మె ల్యే ను మార్చాలంటూ ఫ్లకార్డులతో మీడియా సమావేశం నిర్వహించారు.టిక్కెట్ కాలేరు వెంకటేశ్‌కు కాకుండా ఎవ్వరికీ ఇచ్చిన సంపూర్ణ మద్దతుతో గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి కృష్ణ, నాగేష్ గౌడ్, విజిత రెడ్డి, పంజాల గిరిధర్ గౌడ్, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.




**IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD**
**O.S.NO. 1737 OF 2023**

Between:
Bank of Baroda
Gandhi Nagar Branch, ...Plaintiff
And
Sri. M. Praveen Kumar and others ...Defendants

TO
1. Sri. M. Praveen Kumar,
S/o Sri. M. Mukunda Reddy,
Aged about Major, Occ: Business,
R/o Plot No. 1-1-652/K/1/A/13,
Arundathi Nagar, Gandhi Nagar,
Hyderabad - 500080.
2. Smt. M. Yadamma,
W/o Sri. M. Mukunda Reddy,
Aged about Major, Occ: Business,
R/o Plot No. 1-1-652/K/1/A/13,
Arundathi Nagar, Gandhi Nagar,
Hyderabad - 500080.
3. Sri. P. Raj Kumar,
Aged about Major, Occ: Business,
R/o Plot No. 1-1-652/K/208,
Arundathi Nagar, Gandhi Nagar,
Hyderabad - 500080.
....DEFENDANTS

Whereas, the Plaintiff Bank has instituted the suit for recovery of money against the above defendants for a sum of Rs. 1,64,866/- (Rupees One Lakhs Sixty Four Thousand Eight Hundred and Sixty Six Only) together with current and future interest, costs and for other reliefs. The above mentioned Defendants are therefore hereby directed to appear before the Hon'ble Court on 20.09.2023 at 10.30 AM in person or by a Pleader/Advocate duly instructed as to why the relief prayed for should not be granted. Take notice that in case of default the suit will be heard and determined ex-parte in your absence

**///BY ORDER OF THE COURT//**
**M.SRINIVAS**
**COUNSEL FOR PLAINTIFF**
Flat No. 501, 5 th Floor, Maturi Bhavan, H.No. 3-4-764 & 499/4, Barkatpura – 500 027

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : పద్మా వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట



ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బాగ్‌అంబర్ పేట కార్పొరేటర్ బీ. పద్మవెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలు స్ట్రీట్ లైట్స్, డ్రయినేజ్, పలు పారిశుద్ధ్య తదితర సమస్యల సాధన కోసం స్థానిక వాసులతో కలిసి పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పెండింగ్ పనుల విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నయకులు బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






తెలంగాణ గంగ తెప్పోత్సవం ఆదివారం ట్యాంక్ బం డపై ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి తెలంగాణ గంగ తెప్పోత్సవ అధ్యక్షులు ఎం మహేందర్ బాబు ఖైరతాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఎం బాబురావు, సర్వి మిత్ర మం డలి సభ్యులు నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

## ఓయూ భూముల జోలికి వస్తే ఊరుకోం

- తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం

నవతెలంగాణ-ఓయూ





ఉస్మానియా యూనివర్సిటీ భూములు కొళ్లగొట్ట డానికి కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఆరో పించారు.రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఓయూకు చెందిన 200 కోట్ల విలువైన భూములను కేసీఆర్ కనుసన్నల్లో స్థానిక ఎంఎల్‌ఏ పద్మరావుగౌడ్, ఓయూ వీసీ ప్రొ.రవీం దర్ సహకారంతో వంద పడకల ఆసుపత్రి పేరు మీద యూనివర్శిటీకి చెందిన విలువైన భూములను అప్పన ంగా ధారాధత్తం చేయడానికి యూనివర్శిటీ విసి ప్రయత్ని స్తున్నదని,తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి హ్యాండ్ ఓవర్ చేయడానికి విసి ప్రయత్నం చేస్తే విద్యా ర్థులతో ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం నేడు మరోసారి యూనివర్శిటీ భూములను వంద పడకల ఆసుపత్రి పేరుతో ప్రభుత్వం, స్థానిక ఎంఎల్‌ఏ ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు.ఓయూ భూముల పరి రక్షణకు టీజేఎస్ విద్యార్థి విభాగం పోరాడుతుంద న్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే యూని వర్శిటీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే యూనివర్శిటీ యాజమాన్యం గతంలో చౌక ధరలకు లీజులకు ఇచ్చిన భూములను లీజులు విత్ డ్రా చేసుకుని యూనివర్శిటీ భూముల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు.

**ఓయూభూములు ప్రభుత్వ పరం తగదు : ఔట**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో 200 కోట్ల విలువైన భూములను ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ తన వ్యక్తిగత ప్రయో జనాల కోసం ప్రభుత్వ పరం చెయ్యటాన్ని ఔట తీవ్రంగా ఖండి స్తుంది. ఇటీవల డిప్యూటీ స్పీకర్ పద్మరావు మనికేశ్వరి నగర్‌లోని ఓయూ భూమిలో 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఇటీవలే ఓయూలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకుగాను 140 కోట్లు కేటాయించింది ఓయూ సిండికేట్ 1986నిర్ణయం ప్రకారం ఓ.యూ భూములు ఎవరికి కేటాయించకూ డ దని, కానీ ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ రవీందర్ తన స్వ ప్ర యోజ నాల కోసం ప్రభుత్వం ఓయూ అభివృద్ధి కోసం ఇచ్చిన 140 కోట్లకు కృతజ్ఞతగా రూ.200 కోట్ల రూపా యల స్థలాన్ని ఆసుపత్రి పేరుతో అప్పన్నంగా ఇచ్చి తన స్వామి భక్తిని చాటుకునేందుకు సిద్ధమయ్యారన్నారు. ఓయూలో ఇప్పటికే ఉన్న హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆసుపత్రి చేసి డాక్టర్ల నియామకాలు చేపట్టి విద్యార్థులకు అధ్యాప కులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని, తెలంగాణ పోరాటాల చైతన్య వేదిక అయిన ఓయూ భూములను కాపాడుకునేందుకు సమిష్టిగా పోరాడాలని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఔటా డిమాండ్ చేసింది.

**బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయిన ఓయూ వీసి ఏబీవీపీ**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మక మైన ఉస్మానియా యూనివర్సిటీలో 200 కోట్ల విలువైన భూములను వీసీ ప్రొ.రవీందర్ ప్రభుత్వ పెద్దల మెప్పుకోసం ఓయూ భూములను దారాదత్తం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెకరేటరి పృథ్వి ఒక హెచ్చరించారు. జస్టిస్ చిన్నప రెడ్డి కమిషన్ రిపోర్టును తుంగలో తొక్కుతూ తన స్వాప్రయోజనాల కోసం ఓయూ భూములను ప్రభుత్వానికి తాకట్టు పెట్టాలని చూస్తున్న ఓయూ విసి నిర్ణయా న్ని వెంటనే వెనక్కి తీసుకోవాన్నారు. ఉస్మానియా విద్యార్థులందరూ ఈ కబ్జా కారుల నుండి యూనివర్సిటీ భూమిని కాపాడు కునే బాధ్యత విద్యార్థులపై ఉందని, ఏబీవీపీ చేపట్టే ఉద్య మంలో భాగస్వాములమై ఒక్క అంగుళం భూమి కూడా అ న్యాక్రాంతం కాకుండా కాపాడుదామని పిలుపునిచ్చారు.

## అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య
- మద్దత ఇవ్వని పార్టీల కార్యాలయాలు ముట్టడిస్తాం

నవతెలంగాణ-అంబర్‌పేట



వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని లేనియెడల అన్ని రాజకీయ పార్టీల కార్యాలయాలు ముట్టడిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం కాచిగూడలో అభినందన హోటల్లో బీసీ సంఘాల సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై ఆయన మా ట్లా డుతూ త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని ప్రస్తుతం వివిధ నియో జక వర్గంలో పార్టీలు చేస్తున్న పేర్లలలో బీసీల పేర్లు చాలా తక్కువగా వస్తున్నాయన్నారు. డబ్బు నాయకత్వం పేర్లతో, సర్వేల పేర్లతో, బీసీ నాయకుల పేర్లను పక్కకు పెడుతున్నారని, ప్రధాన పార్టీలు బీసీలకు టికెట్లు ఇస్తే గెలిపించుకునే బాధ్యత బీసీలదేనన్నారు. రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని, ప్రతి పార్టీ 70 అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించాలని, లేనిపక్షంలో బీసీలు తిరగబడతారని, 50శాతం టికెట్లు ఇవ్వకపోతే ఆ పార్టీలను ఓడ స్తామని హెచ్చరిం చారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు. తప్ప బీసీలకు అన్ని రంగాలలో ప్రజాస్వామిక వాటా ఇవ్వడం లేదు. బీసీలు అంటే కేవలం జెండాలు మోయడానికి, జిందాబాద్‌లు కొట్టించుకోవడానికి ఉపయోగించుకుం టున్నారు. తప్ప వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు అని దేశంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, రాజ్ కుమార్, శ్రీనివాస్, భూమన్న, ప్రసాదు, బాలరాజ్, లడ్డు, వెంకన్న పాల్గొన్నారు.

## విలీనమైతేనే అన్ని సమస్యలకు పరిష్కారం



- బస్తీనిద్ర కార్యక్రమంలో కిశాంక్ వెల్లడి

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ జీహెచ్ఎంసీలో విలీనమయితేనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కంటోన్మెంట్‌లోని వార్డు-2 ఇందిరమ్మ నగర్‌లో చివరి బస్తీ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్ర మంలో స్థానికులు పాల్గొని వారి సమస్యలను తెలియ జేశారు. కంటోన్మెంట్ బోర్డు తొలగించిన ఓట్లను తిరిగి వారికి కల్పించాలని, ఓటు హక్కు కోసం కలిసి పోరాడు దామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. క్రిశాంక్ మాట్లాడుతూ ఈ విషయం మంత్రి కేటీఆర్‌కు తెలుసునని ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తారని తెలియ జేసినట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ కంటోన్మెంట్‌లోని పౌర భూములను రాష్ట్రానికి అప్పగి ంచాలని భారత ప్రభుత్వాన్ని కోరినట్లు, స్థానికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని కంటోన్మెంట్‌బోర్డు మున్సిపల్ కార్పొరేషన్‌లోకి విలీనం అయితే తమ ఇంటి పట్టాల కేటాయింపు ప్రక్రియ సునాయాసంగా జరుగుతుం దని ప్రజలకు క్రిశాంక్ వివరించారు.సోమవారం నుండి ప్రజాభిప్రాయ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు, ఇప్పటి వరకు బస్తీ నిద్ర కార్యక్రమంలోనూ షిట్‌టాక్ పాలిటిక్స్ కార్యక్రమాల ద్వారా అనేక సమస్యలు తెలు సుకుని పరిష్కరించామని, అనేక విషయాలు అనేక సమస్యలు కేటీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, యాదగిరి, రవి, మల్లేష్, రఘు, రమేష్, వినోద్, దినేష్, శ్రీకాంత్, ఎల్లేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు కోసం తవ్వేశారు..వదిలేసారు..

- బోజగుట్ట శ్రీరామ్‌నగర్‌లో రోడ్డు దుస్థితి
- రోడ్డును వెంటనే పూర్తి చేయాలి
- సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్

నవతెలంగాణ-మెహదీపట్నం



బోజగుట్ట శ్రీరామ్‌నగర్ బస్తీలో ఐదునెలల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు సీసీరోడ్డు పనుల నిమిత్తం రోడ్డు ను తవ్వారని అనంతరం ఆరోడ్డు అలాగే వదిలేసి దాన్ని ఊసే మర్చిపోయారని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ విమర్శించారు. స్త్రీ ప్రజలు పడుతున్న బాధల గు రించి ఆయన మాట్లాడారు. రోడ్డును తవ్వి వదిలేయడం వలన విద్యార్థులు, పిల్లలు, వృద్ధులు ఇక్కట్లకు లోనవుతున్నారని, రోడ్డు సరిగా లేకపోవడంతో బస్తీలోనికి వచ్చే స్వ చ్ఛ ఆటోబంద్ అయిందని దీనితో బస్తీలో చెత్త పేరుకు పోయిందని ఆయన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో వర్షపు నీరు చెత్త కలిసి దోమలకు ఆవాసంగా మారిందని, దీంతో ఆ ప్రాంతాలలో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు విష జ్వరాలకు లోనవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో ఎన్నో సీసీరోడ్లు నిర్మించిన జీహెచ్ఎంసీ అధికారులు పేదల నివసించే బోజగుట్ట ప్రాంతంలో మాత్రం ఐదు నెలలుగా రోడ్డు నిర్మా ణాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇది పేద ప్రజల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటకైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో సీపీ ఐ(ఎం) నాయకులు సీహెచ్ వెంకట స్వామి, యాదయ్య, రాములు, రాజు, పాల్గొన్నారు.

## చేనేత కళాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం : శ్రీలత శోభన్‌రెడ్డి

నవతెలంగాణ-ఓయూ-బంజారాహిల్స్



ప్రతి సోమవారం ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా చేనేత వస్త్రాలను ధరిస్తున్నట్లు నగర డిప్యూటీ మేయర్ ఎం.శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం-12లోని కలింగ కల్చరల్ హాల్లో జగ్దీశ్వర్ హస్తకళా ఎక్స్పో ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన వస్త్రప్రదర్శ నను ఆమె ప్రారంభించారు. ఇక్కడ తెలంగాణా సాంప్రదాయ వస్త్రాలతో పాటు పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులను ప్రదర్శించడం అభినందనీయమని, ప్రతిఒక్కరూ చేనేతకారుల వస్త్రాలను ధరించి వారి చేయూతను అందించాలని కోరారు.సీఎం కేసీఆర్, మంత్రి కేటీ ఆర్ చేనేత కళాకారులకు ప్రోత్స హకాలు, సహాయ సహకారాలు అందించి వారి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిని తీసుకెళుతున్నారని పేర్కొ న్నారు చేనేత కళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీవస్తువులను సుమారు 60 స్టాల్స్ ప్రదర్శిస్తున్నారని నిర్వహ కులు జయేష్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన 28 వరకు కొనసాగుతుందని తెలిపారు.

## ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు చెందాలి - మర్రి ఆదిత్యారెడ్డి

నవతెలంగాణ-బేగంపేట



ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు చెందాలని టీపీసీసీ ప్రతినిధి మర్రి చెన్నారెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ మర్రి ఆదిత్యరెడ్డి అన్నారు. రాంగోపాల్‌పే డివిజన్ పరిధిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకుడు త్రికాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మర్రి ఆదిత్య రెడ్డి డివిజన్ పరిధిలోని ఓల్డ్ గాస్మండి, విక్టోరియా గంజ్, చుట్టాల బస్తీ, అంబేద్కర్ నగర్లలో ప్రెషర్ కుక్కర్లు, నిత్యవసర సరుకులు, చీరలు, చిన్నారులకు లంచ్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ 90వ దశకంలో చెన్నారెడ్డి తో సమీపంగా పనిచేశారని, ఆరు నెలల్లో ఎన్నికలు సమీపిస్తాయనగా 1989లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న చెన్నారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 08 స్థానాల్లో గెలుచుకున్నారని గుర్తు చేశారు. ఆ సమ యంలో రాజీవ్ గాంధీ మర్రి చెన్నారెడ్డితో తెలంగాణ ఆంధ్ర ప్రాం తాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఎక్కువగా మాట్లాడే వారని ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు.బస్తీలలో అభివృద్ధి జరగడం లేదని హైటెక్ సిటీ వంటి ప్రాంతాలలో వేగంగా అభివృద్ధి జరుగుతుంటే సనత్ నగర్‌లో ఆ అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని స్లమ్స్‌పై బసీలపై చిన్న చూపు ఎందుకన్నారు. మంత్రి తలసాని కేటీఆర్ ఈ విషయంపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో గణేష్ టెంపుల్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విట్టల్, చక్రం, చందు, కిరణ్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టేబుల్ టెన్నిస్ టోర్నీలో రన్నర్ అప్‌గా కె.యజ్ఞశ్రీ టీమ్

- అత్యుత్తమ షాట్‌లతో ఆకట్టకున్న యజ్ఞశ్రీ

నవతెలంగాణ-అంబర్‌పేట



రుక్మిణీ బాయి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఇంటర్ స్కూల్ టోర్నీలో టేబుల్ టెన్నిస్ విభాగంలో డాన్ బాస్కో హైస్కూల్ విద్యార్థినులు కె.యజ్ఞశ్రీ, రహమతున్నీసా రన్నర ప్‌గా నిలిచారు. డాన్ బాస్కో ,లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ మధ్య జరిగిన ఉత్కంఠ భరితమైన ఫైనల్ మ్యాచ్‌లో, లిటిల్ ఫ్లవర్ విజేతగా నిలిచింది. డాన్ బాస్కో విద్యార్థిని యజ్ఞశ్రీ తన అసాధారణమైన సర్వీస్‌లు, స్మాషింగ్ షాట్‌లతో టోర్న మెంట్‌లో ప్రత్యేకంగా నిలిచింది. ఆమె అత్యుత్తమ ప్రదర్శన డాన్ బాస్కోను ఫైనల్స్‌లోకి నడిపించింది. ఫైనల్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో బలయమైన లిటిల్ ఫ్లవర్ జట్టును ఎదుర్కోవడం కఠినమైన సవాలుగా మారింది. ఫలితంగా లిటిల్ ఫ్లవర్ విజయం సాధించగా, డాన్ బాస్కోకు చెందిన కె.యజ్ఞశ్రీ, రహమతున్నీసా రన్నరప్‌గా నిలిచారు. లిటిల్ ఫ్లవర్ మొదటి సెట్‌ను 11-7తో చేజిక్కించుకుంది, డాన్ బాస్కో రెండో సెట్‌లో 13-11తో గట్టిపోటీతో సెట్‌ను గెలుచు కుంది. అనంతరం వరుసగా మూడు, నాలుగవ సెట్‌లలో లిటిల్ ఫ్లవర్ జోరును తిరిగి కొనసాగించి 11-9 స్కోర్‌లతో రెండు సెట్‌లను కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. రన్నర్ అప్‌గాఅవార్డు అందుకున్నారు.యగ్నశ్రీ మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్‌లో మరింత రాణించడానికి ఈ టోర్నమెంట్ ఒక మైలురాయిగా నిలిచిందని తెలిపారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి

- కమ్యూనిటీ హాల్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



నిరంతరం అభివృద్ధి సం క్షేమం ప్రజాసమస్యల పరిష్క రించే వారికి మరోసారి పటం కట్టాలని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆది వారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని తురబ్ నగర్‌లో కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణంలో భాగంగా నూతన షెడ్డుపవర్ బోరు పెయింటింగు మౌలిక వసతులు కల్పించిన కమ్యూనిటీ హాల్‌ను స్థానిక బస్తివాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల నుంచి అభివృద్ధి పనులు నియోజకవర్గంలో ఎవరికైనా అభివృద్ధి పనులు చేసి ప్రజలకు మెరుగైన పాలన అందించానని మరోసారి అంబర్ పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజు డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, రమేష్ నాయక్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల యూనియన్ (ఏఐటీయూసీ)

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రాష్ట్రంలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న సమ్మె చేస్తున్న సంఘాలతో కాకుండా సమ్మె చేయని సంఘాలతో సమ్మె విరమింపచేస్తున్నామని ప్రకటించడం సరి కాదని తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల యూనియన్ (ఏఐయుసీ) విమర్శించింది. ఆదివారం హిమాయత్ నగంలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, యూనియన్ అడ్వైజర్ ఎం.నరసింహ, యూనియన్ గౌరవ అధ్య క్షులు తోట రామాంజనేయులు, అధ్యక్షురాలు బడేటి వనజ, ప్రధాన కార్యదర్శి గాంఢ్ల మధురిమ, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ కుమారి కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముం దు ఏఐటీయూసీ అనుబంధ రెండవ ఏఎస్ఎంల యూని యన్ ప్రతిపాదించిన డిమాండ్లను ఒప్పుకునేంత వరకు సమ్మెను కొనసాగిం చాలని నిర్ణయించినట్లుగా వారు తెలిపారు. అధికారులు మీడియా సమావేశంలో తప్పుడు సమాచారాన్ని ప్రజలకు, మీడియాకు అందిస్తున్నారని అనేక రాష్ట్రాలలో ఎస్.హెచ్.ఎంస్కీంలో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయడం చేసినట్లు దానికి సంబంధించిన సమాచారం డీహెచ్ గడల శ్రీనివా సరావుకు అందించారని వివరించారు. 20 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న రెండవ ఏఎన్ఎంలకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని, హెల్త్ ఇన్సూరెన్స్, క్యాజువల్ లీవులు అమలు కాలేదన్నారు. నోటిఫికేషన్ పేరుతో కొద్దిమంది బీఆర్ఎస్ అనుబంధ యూనియన్ నాయకులు నిరుద్యోగులతో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వం నుండి రెండవ ఏఎస్ఎంల సమస్యలపై స్పష్టమైన హామీ వచ్చే దాకా సమ్మెను విరమించేది లేదని, రేపటి నుండి జిల్లాలలో వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు హెచ్చరించారు. 33 జిల్లాలనుండి ప్రతినిధులు హాజరై సమ్మెకు మద్దతు తెలిపారు.

## యువత మేలుకో దేశాన్ని కాపాడుకో



- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో యువత మేలుకొని తమ భవిష్యత్తు కాపాడుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం సోమా జిగూడలోని రాజీవ్ విగ్రహం వద్ద పార్టీ జాతీయ ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రేతో కలిసి ఆయన చిత్ర పటాలకు పూలమల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవాన్ని నవశకానికి బాటలు వేసిన గొప్ప దర్శనీకుడు రాజీవ్ గాంధేనని, ఆయన స్ఫూర్తితో దేశన్ని కాపాడు కోవడానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. మోదీ తన మిత్రులకూ,కేసీఆర్ తన కుటుంబానికి ప్రజల సొమ్మును దోచి పెడుతున్నరని ధ్వజమెత్తారు. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని ఆయన అన్నారు. దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవ లు చిరస్మరణయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్‌గాంధీ నిజం చేశారని, "రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వ హక్కులు, అధికారాలు కల్పించారని, స్థానిక సంస్థలను బలోపేతం ఆయన ఎంతో కృషి చేశారని, దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, వి.హనమంతరావు, ఏఐసీసీ పరిశీలకు రాలు దీపదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీ ఖాన్, జగ్గారెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పర్యటనను అడ్డుకున్న మంత్రి అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు

- ఎస్సార్‌నగర్‌లో కాంగ్రెస్-బీఆర్ఎస్ నాయకుల బాహాబాహి
- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట



ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వెళుతున్న తమను అడ్డుకోవడం దారుణమని, ప్రజల సమస్యలు తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని తెలంగాణ ప్రతి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు.సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఎస్ఆర్‌నగర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి డాక్టర్.కోట నీలిమ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ప్రజలు తమ సమస్యలను వివరించే క్రమంలో అక్కడి బీఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారన్నారు.ఇది తమ ప్రాంతమని తమ ప్రాం తంలో వేరే పార్టీల నాయకులు ఎవరూ పర్యటించే హక్కు లేదని కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్నారన్నారు. అక్కడ తీవ్ర ఉద్రిక్తల మధ్య డాక్టర్ కోట నీలిమ బస్తీ పర్యటనను కొనసాగించారు.అనంతరం స్థానిక ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుం దని, తమను కనీసం బస్తీలలో పర్యటించే హక్కు లేకుం డా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల పై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకో వా లని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.ఓటమి భయంతోనే స్థానిక మంత్రి అనుచ రులు ఈ దాడులకు పాల్పడుతున్నా రని ఆరోపిం చారు. తమను అడ్డుకున్న వారిని అరెస్టు చేయాలని ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌ముందు ఆందోళన నిర్వహించారు.

## మాలలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలి



- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోపోజు రమేష్ బాబు

నవతెలంగాణ-అడిక్‌మెట్

మాలలకు అన్ని రాజకీయ పార్టీలు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోపోజు రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చర్చ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు రమేష్ బాబు హాజరై మాట్లాడుతూ మాలలకు ఏ రాజకీయ పార్టీ ప్రాధాన్యత ఇవ్వడం లేదని అందువలన మాలలకు ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఒక మాల ఎంపీ కూడా లేకపోవడం బాధా కరమన్నారు. రాష్ట్రం ఉద్యమాల ముఖ్య భూమిక పోషించిన దళిత ఉద్యమాలలో కీలక పాత్ర పోషించిన మాలలకు ఈరోజు రాజకీయ ప్రాధాన్యత లేకపోవడం విచారకరమని అన్ని రాజకీయ పార్టీలు మాలలకు అత్యధికంగా ఎమ్మెల్యే ఎంపీ స్థానాలు కేటాయించండి లేనిపక్షంలో మాలల కోసం ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్‌లలో 50శాతం మాలకే కేటాయించాలని పార్టీ పదవుల్లో ప్రభుత్వ పదవుల్లో మాలలకు స్థానం ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఎస్సీల జనాభా 22 శాతం ఉన్నందువలన ప్రస్తుతం రిజర్వుడ్ అయిన 19 ఎమ్మెల్యే స్థానాల కంటే ఎక్కువ స్థానాలు ఎస్సీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ సలహాదారులు కొంద్ర రాజలింగం, మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు, జాతీయ కార్యదర్శి శ్రవణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి మన్నే శ్రీధర్ రావు, రాష్ట్ర నాయకులు రాందాస్ కోటేశ్వరరావు, అశోక్ ,నగేష్ తదితరులు పాల్గొన్నారు

## సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన బాట

- తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం

నవతెలంగాణ-బంజారాహిల్స్



స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన బాట తప్పదని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాఘవాచారి వెంకటస్వామిలు మాట్లాడారు. రాష్ట్రంలో స్వర్ణకార వృత్తి చేసే వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన సామాజిక వర్గం సమస్యల పరిష్కారం కోసం జోలె పట్టుకొని తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 272 సవరణ చెయ్యాలని, వివాహ సమయంలో పుస్తె, మట్టెలు, ప్రధాన ఉంగరము స్వర్ణకారులే చేసే విధంగా ప్రత్యేక జీవో తీసుకురావాలని, 50 సంవత్సరాలు పై పడ్డ స్వర్ణకారు లకు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను సెప్టెంబర్ 15 లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గుబ్బముఖుల చరిశేఖర్,ఉపాధ్యక్షులు రామదాసు లక్ష్మణ,ముత్తోజు శ్రీనివాసాం,పాలకొండ శ్రీనివాస్,శ్రీరామోజు బిక్షపతి,రాజ పణి,పోతులూరి,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరికేటి నాగరాజు, రాజశేఖర్ చారిలు తదితరులు పాల్గొన్నారు.



## పళ్ళు పుచ్చిపోకుండా ఉండాలంటే...

**పళ్ళు పుచ్చిపోతున్నాయా.. ఇందుకు కారణం పళ్ళ మీద బాక్టీరియా ఏర్పడడం... ఈ బాక్టీరియా ప్లేక్ అనే పొరని తయారు చేస్తుంది. ఈ పొర పంటి మీద ఎనామిల్ లోంచి మినరల్స్‌ని తీసేస్తుంది. దంతాలు బలంగా ఉండడానికి కావాల్సిన కాల్షియం, ఫాస్ఫేట్ ఈ ఎనామిల్‌లోనే ఉంటాయి. దీని వల్ల ఎనామిల్‌లో రంధ్రాలు ఏర్పడతాయి. అది నెమ్మదిగా దంత క్షయానికి దారి తీస్తుంది.**

**కారణాలు :**

- నోరు ఎండి పోయినట్లుండడం
- పళ్ళకి అంటుకు పోయే చాక్లెట్స్ లాంటి ఫుడ్స్ తినడం
- షుగర్ ఎక్కువగా ఉన్న ఐస్ క్రీంమ్, కూల్ డ్రింక్స్ తినడం
- తగినంత విటమిన్ డీ లేకపోవడం
- అరుగుదల సరిగ్గా లేకపోవడం వల్ల వచ్చే గుండెల్లో మంట
- రోజుకి రెండుసార్లు సరిగ్గా పళ్ళు తోముకోకపోడం

**పరిష్కారాలు :**

**షుగర్ ఫ్రీ గమ్ :** భోజనం తర్వాత షుగర్ ఫ్రీ గమ్ నమలడం వల్ల ఈ సమస్య రాకుండా కొంత వరకు నివారించవచ్చు. దీని వల్ల నోట్లో లాలాజలం ఎక్కువగా ఊరి, ప్లేక్ పీహెచ్‌ని పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ గమ్ ఎనామిల్లో పోయిన మినరల్స్‌ని మళ్ళీ తీసుకొస్తుందంటున్నారు. ఒక సారి పన్ను పుచ్చిపోతే మాత్రం చేసేదేమీ లేదు. అక్కడ వరకు సమస్య వెళ్ళకుండా జాగ్రత్త వహించాలి.

**విటమిన్ డి ఫుడ్ :** విటమిన్ డి వల్ల ఆహారంలో ఉన్న కాల్షియం, ఫాస్ఫేట్ శరీరంలో అబ్జార్బ్ చేసుకుంటుంది. విటమిన్ డి పాలూ, పాల పదార్థాల నుంచి లభిస్తుంది. రోజుకి పదిహేను నిమిషాలు సూర్య కాంతిలో గడపడం వల్ల కూడా శరీరానికి డి విటమిన్ లభిస్తుంది.

**సమస్య రాకుండా :** ఒక వేళ పన్ను పుచ్చిపోయి సమస్య తీవ్రంగా ఉందనుకుంటే ఆ పన్నుని తీసేసి పక్క పంటికి సమస్య పాకకుండా చేస్తారు. రోజంతా షుగర్ ఉన్న ఫుడ్స్ తీసుకోకుండా ఉండడం, రోజుకి రెండు సార్లు సరిగ్గా బ్రష్ చేసుకోవడం వల్ల ఈ సమస్య రాకుండా ఎనభై శాతం వరకూ నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**ఫ్లోరైడ్ టూత్ పేస్ట్ :** కావిటీస్ ఏర్పడకుండా, ఎనామిల్‌లోని మినరల్స్ పోకుండా ఫ్లోరైడ్ కాపాడుతుంది. అందుకే ఫ్లోరైడ్ ఉన్న టూత్ పేస్ట్‌తో బ్రష్ చేసుకోవడం మంచిది.

**షుగర్ తగ్గించటం :** షుగర్ ఎక్కువగా ఉన్న ఆహారం తగ్గించాలి. ఒక సారి నోట్లోంచి షుగర్ లోపలికి వెళ్ళిపోయాక కొంత సేపటికి ఎనామిల్ మళ్ళీ మినరల్స్‌ని తయారు చేసుకుంటుంది. కానీ, ఎనామిల్‌కి చాన్స్ ఇవ్వకుండా మళ్ళీ షుగర్ ఉన్న ఫుడ్ తినడం వల్ల ఈ సమస్య ఎక్కువగా వస్తుంది.

**ఆయిల్ పుల్లింగ్ :** కొబ్బరి నూనె కానీ, నువ్వుల నూనె కానీ ఇరవై నిమిషాల పాటు నోరంతా తిప్పుతూ ఆయిల్ పుల్లింగ్ చేయాలి. నువ్వుల నూనెతో ఇలా చేస్తే ప్లేక్, జింజవైటిస్, బాక్టీరియా అన్నీ తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# స్వేచ్ఛగా.. స్వతంత్రంగా ఉండాలంటే..?



**మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే స్వతంత్రంగా జీవిస్తున్నారా లేదా అనేది అసలు ప్రశ్న. స్వతంత్రం అంటే కేవలం డబ్బు, కెరీర్ వంటి వాటిలోనే కాదు జీవితానికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ స్వతంత్రంగా జీవించగలిగితేనే మనం కోరుకునే సంతృప్తి లభిస్తుంది. కాబట్టి స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించ డానికి దోహదపడే కొన్ని అంశాలేంటో తెలుసుకుందాం...**

ఏ విషయంలోనైనా ఆత్మవిశ్వాసంతో ముందుడుగు వేస్తే విజయం మన సొంతమవుతుందనే విషయం తెలిసిందే. అయితే కొన్ని విషయాల్లో లోపల ఏదో భయం, బెరుకు మనల్ని వెంటాడుతూ స్వేచ్ఛగా జీవించకుండా అడ్డుపడుతూ ఉంటాయి. మీకు పాటలంటే చాలా ఇష్టం. మీ గొంతు కూడా చాలా శ్రావ్యంగా ఉంటుంది. కానీ ఎవరిముందైనా పాడమంటే మాత్రం చాలా భయం. దీనివల్ల మీకున్న అవకాశాలను కోల్పోవడమే కాదు... మీలోని ప్రతిభను నలుగురికీ చూపే అవకాశాన్ని చేజార్చుకుంటారు. దీనికి బదులుగా కొద్దిగా ధైర్యం తెచ్చుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతే విజయం మీ వెంటే ఉంటుంది. అయితే దారిలో అపజయాలు ఎదురైనా సరే మనోధైర్యంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. దీని వల్ల స్వేచ్ఛగా మన జీవితంలో ఏం చేయాలనుకుంటున్నామో అవన్నీ చేసే అవకాశం మనకు లభిస్తుంది.

### ఆర్థిక స్వేచ్ఛ

మీరు నిజంగా ఎవరిమీదా ఆధారపడకుండా, స్వతంత్రంగా జీవించాలంటే మీ సంపాదన మీకే ఉండాలి. అయితే సంపాదించే డబ్బును విచ్చలవిడిగా కాకుండా అవసరమున్న సందర్భాల్లో జాగ్రత్తగా ఖర్చు పెట్టడం నేర్చుకోవాలి. అంతేగానీ మా డబ్బు.. మా ఇష్టం... దేనికైనా ఖర్చు పెట్టుకుంటామంటే భవిష్యత్ అవసరాలకు డబ్బు మిగలదు. దీనివల్ల ఇతరులపై ఆధారపడే పరిస్థితులు ఎదురుకావొచ్చు. ఇలా ఇతరుల మీద ఆధారపడటం వల్ల స్వతంత్రం లేకుండా పోయే సందర్భాలు కూడా ఎదురవుతాయి. అందుకే ఎవరి మీదా ఆధారపడకుండా మన భవిష్యత్తుకు తగ్గట్టుగా మనమే ప్లాన్ చేసుకొని పొదుపు చేస్తే ఆర్థికంగానూ ఎవరిమీదా ఆధారపడకుండా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవించగలుగుతాం.

### స్వేచ్ఛగా మాట్లాడండి


ఎవరితో అయినా సరే భయపడకుండా మనసులోని భావాలను స్వేచ్ఛగా వెల్లడించే గుణం అలవాటు చేసుకోవడం మంచిది. ఇతరులతో మాట్లాడటానికి భయపడితే మనలోని భావాలన్నీ లోపలే మిగిలిపోతాయి. అలా భావాలన్నీ గూడుకట్టుకొని మిగిలిపోయినప్పుడు జీవితంలో అసంతృప్తి మాత్రమే మిగులుతుంది. ఒక్కోసారి కెరీర్లో కొన్ని చక్కటి అవకాశాలను కూడా కోల్పోవాల్సి రావచ్చు. మీ జీవితం అలా కాకుండా ఉండాలంటే ఎంతమంది ముందైనా మీ మనసులోని మాట చెప్పడానికి వెనకడుగు వేయొద్దు. ఎదుటివారు మీకంటే వయసులోనో, హోదాలోనో పెద్దవారని భయపడాల్సిన అవసరం లేదు. మీ అభిప్రాయాలు తప్పు కానంత వరకు మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. అలాగే ఇతరులు మీ మీద అభాండాలు వేస్తున్నప్పుడు మిమ్మల్ని మీరు కాపాడుకోవడం కూడా మర్చిపోవద్దు.

### మీకు నచ్చిందే...

స్వతంత్రంగా బతకడానికి మంచి నడవడిక, విద్యాబుద్ధులు కూడా చాలా అవసరం. వీటివల్ల భవిష్యత్తుకు ఉపయోగపడే నైపుణ్యాలు అలవడతాయి. అలాగే ప్రపంచంలో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవడమూ ముఖ్యమే. ఇవన్నీ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడతాయి. అయితే చదువు, ఉద్యోగం విషయంలో వేరొకరి మీద ఆధారపడి నిర్ణయాలు తీసుకోవద్దు. మీ మనసు చెప్పిన రంగాన్ని ఎంచుకోవడం వల్ల ఆ వృత్తిలో మీరు ఉన్నత స్థానాలకు ఎదగగలుగుతారు. అలా కాకుండా ఎవరో చెప్పారని మీ కెరీర్‌ని ఎంచుకుంటే మీకు నచ్చని వృత్తిలో మిగిలిపోవాల్సి రావచ్చు.

### మీకు మీరే...

మీ మనసు స్వతంత్రంగా ఆలోచించాలంటే మిమ్మల్ని మీరు ఇంకొకరితో పోల్చుకోవడం మానేయాలి. ఒకరితో పోల్చుకుంటూ ఉండటం వల్ల వాళ్ల దగ్గర ఉన్నదాన్నే మనసు కోరుకుంటూ ఉంటుంది. జీవితంలో మీకు ఎందులో అసలైన ఆనందం లభిస్తుందో మీ మనసు మీకు సూచించలేకపోతుంది. అందుకే ప్రతి విషయంలోనూ మీరే బెస్ట్ అనుకోండి. ఇతరులతో పోల్చుకోవద్దు. నెగెటివ్ ఆలోచనలను మీ దరిదాపుల్లోకి కూడా రానివ్వద్దు. ఇతరులతో పోలిక వల్ల అసూయ, ద్వేషం లాంటి నెగెటివ్ ఫీలింగ్స్‌కి మీరు దగ్గరవుతారు. అందుకే మీలో ఉన్న మంచి లక్షణాలను తెలుసుకోండి. ఏదైనా సందర్భంలో ఇతరులతో పోల్చుకున్నా దాన్ని నెగెటివ్‌గా కాకుండా పాజిటివ్‌గా తీసుకొని వారిలోని మంచి గుణాలను మీరూ అలవర్చుకోవడానికి ప్రయత్నించండి. దీనివల్ల మీ మనసు ప్రశాంతంగా, సేచ్ఛగా ఉంటుంది.



### ఆరోగ్యం పట్ల శ్రద్ధ

ఇంకొకరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అవసరం. అలా ఉన్నప్పుడే ఇంకొకరి మీద ఆధారపడకుండా జీవించగలుగుతాం. అందుకే ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. మంచి ఆహారం తినడం, వేళకు పడుకోవడం... ఇవన్నీ అలవాటు చేసుకోవాలి.

### మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి

అన్నింటికంటే ముఖ్యమైనది జీవితంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించాలనుకుంటే మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీకు ఏం అవసరమో గుర్తించి, దాన్ని మీకు మీరే అందించుకోండి. మీ శరీరానికి ఆరోగ్యాన్నందించే అలవాట్లు చేసుకోండి. మీ మనసును మీరే ఇబ్బంది పెట్టకుండా నడుచుకోండి. ఈ క్రమంలో ఇతరులను గౌరవించి, వారితో ప్రేమగా ఉండడమూ ముఖ్యమే. అయితే దానికంటే ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి.





# గద్దర్‌కు నిజమైన నివాళి...కమ్యూనిజాన్ని నిలబెట్టడమే

(మొదటిపేజి తరువాయి)

రాజకీయ పార్టీ గురించో, ఎన్నికల్లో సీట్ల కోసమో ఇచ్చే నినాదం కాదన్నారు. దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు కమ్యూనిస్టుల అవసరం వచ్చిందని నొక్కి చెప్పారు. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే బలహీనపడ్డ, దెబ్బతిన్న చోటల్లా కమ్యూనిజం తిరిగి బలపడ్డదన్నారు. రాజ్యాధికారం సాధించే చోదక శక్తిగా ఎదిగిన తీరును వివరించారు. సమాజం అభివృద్ధి చెందాలన్నా, ప్రపంచ దేశాల్లో అగ్రదేశంగా ఎదగాలన్నా విద్య, సైన్స్, టెక్నాలజీ కీలకమన్నారు. మంచి పరిపాలనే కాదు మెరుగైన సామాజిక వ్యవస్థ కూడా కీలకమని చెప్పారు. కానీ, మన దేశంలో ఆ పరిస్థితి లేదన్నారు. సైన్స్, టెక్నాలజీని కలిపి ముందుకు తీసుకెళ్లడంలో మన పాలకులు విఫలమయ్యారన్నారు. బాగా చదివినవాళ్లు పనిచేయట్లేదనీ, పనిచేసేవాళ్లు విద్యలేక టెక్నాలజీ అందిపుచ్చుకోలేకపోతు న్నారని చెప్పారు. మన దేశ వెనుకబాటుకు ఇదీ ఒక కారణమేనని చెప్పారు.

**గొప్ప మిత్రుడు..ప్రపంచ కళాకారుడు : బి.నర్సింగరావు**

గద్దర్ తనకు గొప్ప మిత్రుడనీ, ఆయన ప్రపంచం గుర్తించిన కళాకారుడని సినీ నిర్మాత, దర్శకులు బి.నర్సింగరావు అన్నారు. ఐదు దశాబ్దాల పాటు గద్దర్‌తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయన మొదట బుర్రకథ కళాకారుడనీ, ఆ తర్వాత ప్రజలను ఆకట్టుకునేందుకు అన్ని కళారూపాలను మిళితం చేసి తనదైన ఒరవడితో ముందుకు సాగారని చెప్పారు. ఆటపాట ద్వారా ప్రజల్ని ఎలా ఆకర్షించాలనే దానిపై తమ టీమ్ పెద్ద కసరత్తునే చేసిందనీ, అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించేవారమని గుర్తు చేశారు. ఆయన పాటల్ని చాలా కాలం పాటు ఎడిట్ చేశానన్నారు. ఆయన రాసిన పాట దేనికదే ప్రత్యేకమన్నారు. పాట కోసం తన ప్రాణాలను సైతం ఆయన లెక్కచేయలేదనీ, ఆయనపై 36 కేసులు కూడా ఉన్నాయని చెప్పారు.



**ఎర్రజెండాకు నిజమైన వారసుడు : కూనంనేని సాంబశివరావు**

గద్దర్ ఎర్రజెండాకు నిజమైన వారసుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా ఆయన మనకు పాటనిచ్చి పోయారన్నారు. పేదల బతుకులను, సమాజాన్ని లోతుగా చదివినవారే గొప్ప కవులవుతారంటూ గద్దర్ పాటలను ప్రస్తావించారు. బతికున్నప్పుడు వేధించినవారు, ఆయన ప్రశ్నను సహించలేనివారు చనిపోయాక తమ వాడిని చేసుకునేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చరిత్రలో గొప్పగొప్ప కళాకారులంతా కమ్యూనిస్టు విప్లవ భావజాలం నుంచే పుట్టారన్నారు. పాలకుల్ని ప్రశ్నించే గొంతుకలన్నీ ఒక్క తాటిపైకొచ్చి పోరాటం చేయడమే గద్దర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు.

**పాటల విశ్వవిద్యాలయం గద్దరన్న : సుద్దాల అశోక్ తేజ**

గద్దర్ పాటల విశ్వవిద్యాలయమనీ, సముద్రమంతా సిలబస్‌ను మనకు ఇచ్చిపోయారని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రకృతిలోనూ విప్లవ భావజాలాన్ని జొప్పించిన మహనీయుడన్నారు. ఆయన తనకు గురువు లాంటివారన్నారు. ప్రజల నుంచి తీసుకున్న కళను ప్రజలకే అప్పగించి పోయారన్నారు. పాటలో 'హొ' అనే శబ్దాన్ని, చరణం చివరన కొసమెరుపు వాక్యాలను, చరణానికి-చరణానికి మధ్య వారధిని సృష్టించిన ఘనత ఆయనదేనన్నారు. పాట ఆకాశమైతే దాని అంచుకెళ్లి ముద్దాడిన మహనీయుడని కొనియాడారు. ఈ యుగం గద్దరన్నదని చెప్పారు. సుద్దాల హన్మంతు, గద్దర్ పాటలు పాడి సభికుల్ని ఉత్తేజపరిచారు.

**గద్దర్‌తో పోల్చదగిన వ్యక్తి లేరు... :ప్రజాకవి జయరాజు**

గద్దర్‌తో పోల్చదగిన వ్యక్తి ఇంకెవ్వరూ లేరని ప్రజాకవి జయరాజు అన్నారు. నిఖార్సయిన విప్లవకారుడన్నారు. ప్రజల జీవితాలను ఒడిసిపట్టి పాటలల్లిన విప్లవ కవి ఆయనని చెప్పారు.

**ఉద్యమం సృష్టించిన వాగ్గేయకారుడు గద్దర్ :పి రంగారావు**

కమ్యూనిస్టు ఉద్యమం, విప్లవ పోరాటాలు గద్దర్‌ను సృష్టించాయని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు చెప్పారు. తన పాటలతో మంటలను రాజేశాడనీ, విప్లవోద్యమానికి ఊపిర్లూదాడని కొనియాడారు.

**మానవత్వమే ఆయన ఎజెండా.. :వెన్నెల**

గద్దర్ గొప్ప మానవత్వం ఉన్న మనిషి అని గద్దర్ కూతురు వెన్నెల చెప్పారు.సమానత్వం కలిగిన సమాజం కావాలని కోరుకున్నారని తెలిపారు. నూతన తరం కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు.రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని తపన పడ్డాడని గుర్తు చేశారు.

**పేదల పక్షాన పోరాడటమే నిజమైన నివాళి :ఎస్ వెంకటేశ్వరరావు**

పేదల పక్షాన పోరాడటమే గద్దర్‌కు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు.కుల, మత వైషమ్యాలను సృష్టించి ఈశాన్య భారతాన్ని మండిస్తున్న తరుణంలో గద్దర్ లేకపోవటం లోటేనన్నారు.

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ సాంస్కృతిక విప్లవ సేనాని గద్దర్ అని చెప్పారు.ఎస్‌యుసీఐ రాష్ట్ర కార్యదర్శి మురారి మాట్లాడుతూ గొప్ప ప్రజావాగ్గేయ కారుడు గద్దర్ అని చెప్పారు. ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షులు ప్రసాదన్న, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు ప్రసాదన్న, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు చలపతిరావు, సీపీఐ(ఎంఎల్)జనశక్తి నాయకులు కొమరన్న లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా ఆయన ఆశయాల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## గద్దర్ మ్యూజియం కోసం ఐదెకరాలివ్వాలి

**సంస్మరణసభలో వామపక్ష పార్టీల తీర్మానం**

హైదరాబాద్ ప్యాట్నీ సెంటర్ వద్ద ప్రజా యుద్ధనౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ విగ్రహాన్ని నెలకొల్పాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఆయన పేరిట గద్దర్ ప్రజా కళల మ్యూజియం, గద్దర్ ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాలనీ, దాని నిమిత్తం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. వాటిలో గద్దర్‌తో పాటు ప్రముఖ కళాకారుల ఆవిష్కరణలు, చరిత్రను అందుబాటులో పెట్టాలన్నారు. ఈ మేరకు "గద్దర్ సంస్మరణ సభ" తీర్మానించింది.

## ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత అవసరం

(మొదటిపేజి తరువాయి)

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వంటి అంతర్జాతీయ సంస్థలచే ప్రోత్సహించబడిన నయా ఉదారవాద అజెండాను ముందుకు తెస్తుంది. ప్రజల ఆర్థిక, సామాజిక, పర్యావరణ, అసమానత, వ్యవసాయం, ఆహారం, జీవనోపాధి, అప్పుల బాధ, వాతావరణ మార్పు, మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజాస్వామ్య తిరోగమనం వంటి సమస్యలను పరిష్కరించడంలో పదేపదే విఫలమయ్యాయి" అని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. ప్రజల ప్రాధాన్యతలను తక్షణమే గుర్తించాలని స్పష్టం చేశారు. వి20 సమ్మిట్‌కు హాజరుకాకుండా, ప్రజలు శాంతియుతంగా సమావేశమై తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే ప్రజాస్వామ్య హక్కును ఉపయోగించుకోకుండా అడ్డుకునే పోలీసుల ఏకపక్ష చర్యను వి20 సమ్మిట్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు డిక్లరేషన్‌లో పేర్కొంది. 'పెరుగుతున్న అసమానతలు, కార్మికులు, రైతులు, మత్స్యకారులు, దళితులు, ఆదివాసీల హక్కులను క్రమపద్ధతిలో కాలరాయడం, ఆకాశాన్నంటుతున్న ఆహారం, ఇంధన ధరలు, విపరీతమైన వాతావరణ పరిస్థితులు, వాతావరణ సంక్షోభం, విస్తృతమైన పర్యావరణ విధ్వంసం, అంతర్-విశ్వాసం, అంతర్-మత ఘర్షణలు, మహిళలు, లింగ విభిన్న వ్యక్తులపై హింస పెరగడం, ప్రజాస్వామ్య ప్రాంతాలు తగ్గడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో జీ20 సదస్సుకు భారతదేశం ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. దీని నిర్వహణ కోసం న్యూఢిల్లీలో వేలాది మంది పట్టణ పేదలు, అట్టడుగు వర్గాల మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తున్న అంశాలను ప్రస్తావించారు. జీ20 సదస్సు పేరుతో పేదలను బలవంతంగా ఇండ్ల నుంచి వెళ్లగొట్టారనీ, పరిహారం, సరైన పునరావాసం లేకుండా జీవనోపాధిపై దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. వారికి పునరావాసం, తగిన పరిహారం ఇవ్వాలి' అని వీ20 సదస్సు డిమాండ్ చేసింది. ప్రస్తుతం దేశంలోని ఆర్థిక, ప్రకృతి సంక్షోభ సమయంలో జీ20 భారతదేశ అధ్యక్ష పదవిని ప్రచారం చేయడానికి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలో ఖర్చు చేయడాన్ని వి20 సమ్మిట్ తీవ్రంగా తప్పుపట్టింది. వీ20 డిక్లరేషన్‌లో మొత్తం 20 అంశాలను ప్రస్తావించారు.

## 84 మందితో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

(మొదటిపేజి తరువాయి)

మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, అధిర్ రంజన్ చౌదరి, కమ్యూనికేషన్ల విభాగం ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఉన్నారు. కాంగ్రెస్ అసమ్మతి వర్గంగా పేరొందిన జీ20 నేతలు ఆనంద శర్మ, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన శశి థరూర్ వంటి నేతలకూ చోటు దక్కింది. అలాగే రాజస్థాన్ యువ నేత సచిన్ పైలట్, దీపా దాస్ మున్షి, సయ్యద్ నసీర్ హుస్సేన్‌లను సీడబ్ల్యూసీలోకి కొత్తగా తీసుకున్నారు.

**తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురికి అవకాశం**

సీడబ్ల్యూసీ సభ్యుల్లో రఘువీరా రెడ్డికి అవకాశం లభించింది. అలాగే శాశ్వత ఆహ్వానితుల్లో టి.సుబ్బిరామి రెడ్డి, కె.రాజు, దామోదర రాజనర్సింహకు స్థానం దక్కింది. ప్రత్యేక ఆహ్వానితుల్లో పల్లం రాజు, వంశీ చంద్ రెడ్డికి కూడా స్థానం లభించింది.

## అవినీతిలో హోం శాఖ

(మొదటిపేజి తరువాయి)

అధికారులపై వచ్చిన ఫిర్యాదుల్లో 9,663ను పరిష్కరించారు. మరో 917 పెండిగ్‌లో ఉన్నాయి. ఇందులో 9 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాంకు ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదుల్లో 7,762ను పరిష్కరించారు. 367 పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 78 మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే దేశ రాజ ప్రాంతం ఢిల్లీకి చెందిన ఉద్యోగులపై 7,370 అవినీతి ఫిర్యాదులు వచ్చాయి. బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన ఉద్యోగులపై 4,304 ఫిర్యాదులు వచ్చాయి. కార్మిక మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 4,236 ఫిర్యాదులు, పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 2,617 ఫిర్యాదులు వచ్చాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ఉద్యోగులపై 2,150 ఫిర్యాదులు వచ్చాయి. రక్షణ మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 1,619 ఫిర్యాదులు, ఆర్థిక మంత్రిత్వ శాఖపై 1,202 ఫిర్యాదులు, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సిబిఐసి) ఉద్యోగులపై 1,101 ఫిర్యాదులు వచ్చాయి. బీమా కంపెనీల ఉద్యోగులపై 987 ఫిర్యాదులు, కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ ఉద్యోగులపై 970 ఫిర్యాదులు, ఉక్కు మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 923 ఫిర్యాదులు వచ్చాయి.

# చర్చలే ఏకైక మార్గం

(మొదటిపేజి తరువాయి)

ఒక్కరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ప్రయత్నించండి. రెట్టింపు శక్తితో ప్రయత్నాలు చేయండి. గతంలో ఇలాగే చేశాం. గత 75 ఏండ్లలో భారతదేశం ఎదుర్కొన్న సమస్యలన్నింటికీ పరిష్కారం లభించిన ఏకైక మార్గం ఇది" అని ఆయన అన్నారు. "చర్చలకు నిరాయుధీకరణ ముందస్తు షరతుగా ఉండాలి. చర్చలు కాల్పుల విరమణతో ప్రారంభం కావాలి' అని ఏచూరి అన్నారు. రాష్ట్రానికి పార్లమెంటరీ ప్రతినిధి బృందాన్ని కూడా పంపాలని ఏచూరి కేంద్రాన్ని కోరారు.

కేంద్రం, రాష్ట్రంలోని ప్రభుత్వాలు అసమర్థంగా ఉన్నాయనీ, మే 3 నుంచి కొనసాగుతున్న హింసను ఎత్తి చూపుతూ ఆయన విమర్శించారు. 'మేం పదే పదే కేంద్రానికి చెప్పాం. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా నేతృత్వంలో పార్లమెంట్‌లోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధి బృందాన్ని మణిపూర్‌కు పంపాలని కోరాం. కానీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఇప్పటికైనా పార్లమెంటేరియన్ ప్రతినిధి బృందాన్ని మణిపూర్‌కు పంపాలి' అని ఏచూరి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. హింసాకాండలో బాధితులు ఉన్న సహాయక శిబిరాల్లో కనీస సౌకర్యాలు లేవని ఏచూరి విమర్శించారు. 'సౌకర్యాల భరోసా కోసం జోక్యం చేసుకోవాలని మేం గవర్నర్ అనుసూయా ఉయికేకి విజ్ఞప్తి చేసాము' అన్నారు.

**మణిపూర్‌కు నేడు సీపీఐ ప్రతినిధి బృందం**

సీపీఐ ప్రతినిధి బృందం మణిపూర్‌కు వెళ్లనుంది. 21 (సోమవారం) నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు బృందం మణిపూర్‌లో పర్యటిస్తుంది. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, రాజ్యసభ ఎంపీ బినయ్ విశ్వం, సీపీఐ జాతీయ కార్యదర్శులు కె. నారాయణ, రామకృష్ణ పాండా, సీపీఐ అసోం సీనియర్ మహిళా నేత అసోమి గొగోయ్‌లతో కూడిన బృందం పర్యటిస్తుంది. బాధితులుండే సహాయక శిబిరాలను సందర్శిస్తుంది. అలాగే రాష్ట్ర గవర్నర్‌ను, వివిధ వర్గాల నేతలను, రాజకీయ నేతలను కలుస్తుంది.

## పెండింగ్ ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**• ఏఐఎస్ఎఫ్**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పెండింగ్ ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేండ్లకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల నిధులు విడుదల కాలేదని తెలిపారు. మూడేండ్లలో రూ.4 వేల కోట్ల బకాయిలు పడిందని పేర్కొన్నారు. వెంటనే విడుదల చేయాలనీ, లేకపోతే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామనీ, ఛలో ప్రగతిభవన్ చేపడతామని హెచ్చరించారు.

## తుది ఘట్టానికి చేరువలో చంద్రయాన్-3

**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం తుది దశకు చేరుకున్నది. చంద్రుడిపైకి రష్యా పంపిన లునా-25 విఫలం కావటంతో ఇప్పుడు యావత్ ప్రపంచం దృష్టి భారత చంద్రయాన్-3 పైనే పడింది. ఇలాంటి తరుణంలో స్పేస్‌క్రాఫ్ట్‌లోని విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ చివరి చంద్ర కక్ష్య కదలికను పూర్తి చేసి, ఆగస్టు 23న చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నించే కక్ష్యకు చేరుకున్నదని ఇస్రో వెల్లడించింది. ల్యాండర్ చంద్రుడికి అత్యంత దగ్గరగా ఉన్న కక్ష్యలో 25 కి.మీ మరియు సుదూర 134 కి.మీ. దూరంలో పరిభ్రమిస్తున్నదని వివరించింది. చంద్రయాన్-3 జులై 14న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. గురువారం, ల్యాండర్ మాడ్యూల్ భూమి నుంచి దానిని మోసుకెళ్ళిన ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయింది. ప్రొపల్షన్ మాడ్యూల్ ఇప్పుడు నెలలు లేదా సంవత్సరాల పాటు భూమి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. ల్యాండర్ మాడ్యూల్ చంద్రుని ఉపరితలంపై తక్కువ దూరం ప్రయాణించగలదు. అలాగే, దాని పర్యావరణాన్ని అధ్యయనం చేయగల ప్రగ్యాన్ అనే రోవర్ మాడ్యూల్‌ను కలిగి ఉంది.

# వరుస మ్యాచులు వద్దు!

**అసలే ఆలస్యంగా షెడ్యూల్ విడుదల. ఆపై ఏకంగా తొమ్మిది మ్యాచుల షెడ్యూల్‌లో మార్పులు. అభిమానులకు టికెట్లు మరో నాలుగు రోజుల్లో అందుబాటులోకి రానున్న తరుణంలో.. షెడ్యూల్‌లో మార్పులు కోరుతూ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధికారులు బీసీసీఐ తలుపు తట్టారు. వరుసగా రెండు రోజుల్లో రెండు మ్యాచుల నిర్వహణ కష్టసాధ్యమని బోర్డుకు హెచ్‌సీఏ తేల్చిచెప్పింది!.**

- బీసీసీఐతో హెచ్‌సీఏ అధికారులు
- ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాలని వినతి

నవతెలంగాణ-హైదరాబాద్

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ 50 రోజుల కౌంట్‌డౌన్ సైతం మొదలైనా.. షెడ్యూల్‌పై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. అహ్మదాబాద్, కోల్‌కత పోలీసులు పండుగ రోజుల్లో క్రికెట్ మ్యాచులకు భద్రత కల్పించటంపై అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. ఇటీవల బీసీసీఐ, ఐసీసీ తొమ్మిది మ్యాచులను రీ షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. రీ షెడ్యూల్‌లో భాగంగా హైదరాబాద్‌లో వరుసగా రెండు రోజుల్లో రెండు మ్యాచులను కేటాయించారు. దీంతో ప్రతిష్టాత్మక ప్రపంచకప్ మ్యాచులకు వరుస రోజుల్లో భద్రత కల్పించటం కత్తి మీద సామేనని హైదరాబాద్ పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దీంతో షెడ్యూల్ తుది మార్పులు చేయాల్సిందిగా హెచ్‌సీఏ ఉన్నతాధికారులు బీసీసీఐకి విన్నవించారు.

**డబుల్ రిస్క్!**

సాధారణంగా ప్రపంచకప్ మ్యాచులకు కనీసం 3000 మంది పోలీసులను మొహరిస్తారు. పైగా పాకిస్థాన్ జట్టు హైదరాబాద్ వేదికగా వార్మప్, రెండు ప్రధాన మ్యాచులు ఆడనుంది. దీంతో స్టేడియంతో పాటు పాకిస్థాన్ క్రికెట్ జట్టు బస చేసే హోటల్ వద్ద భారీగా భద్రతా దళాలు మొహరించాల్సి ఉంటుంది. ఇటువంటి సవాళ్ల ఎదుర్కొంటున్న తరుణంలో.. వరుసగా రెండు రోజులు రెండు మ్యాచులకు భద్రత కల్పించటం ఇబ్బందికరమని హైదరాబాద్ పోలీసులు హెచ్‌సీఏ దృష్టికి తీసుకెళ్లారు. రీ షెడ్యూల్‌లో భాగంగా అక్టోబర్ 9, 10న హైదరాబాద్‌లో ప్రపంచకప్ మ్యాచులు ఉన్నాయి. అక్టోబర్ 9న న్యూజిలాండ్, నెదర్లాండ్స్ మ్యాచ్ ఉండగా.. అక్టోబర్ 10న పాకిస్థాన్, శ్రీలంక మ్యాచ్ జరుగుతుంది. భద్రతా పరంగా ఎటువంటి రిస్క్ తీసుకోలేమని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేయటంతో.. హెచ్‌సీఏ ఉన్నతాధికారులు బీసీసీఐకి విషయాన్ని తెలియజేశారు.

'అక్టోబర్ 9, 10న వరుస రోజుల్లో రెండు మ్యాచుల నిర్వహణపై అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాం. షెడ్యూల్ మార్పులు, హెచ్‌సీఏ ఇబ్బందులను పరిశీలిస్తామని చెప్పారు. ఇదే సమయంలో ఇంత తక్కువ టైమ్‌లో షెడ్యూల్ మార్పు కుదరకపోవచ్చనే సంకేతాలు సైతం ఇచ్చారు. బీసీసీఐ సమాధానం కోసం ఎదురు చూస్తున్నాం' అని హెచ్‌సీఏ అధికారి ఒకరు తెలిపారు.





**అభిమానుల ఆగ్రహం**

ప్రపంచకప్ షెడ్యూల్ రూపకల్పనలో బీసీసీఐ అలసత్వం పట్ల అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోర్డు కార్యదర్శి జై షాను సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నారు. కీలక ప్రపంచకప్ షెడ్యూల్ ఖరారు చేసే ముందు స్థానిక క్రికెట్ సంఘాలు, పోలీసులు, ప్రభుత్వంతో కనీసం చర్చించరా? ఇలా ప్రతిసారి అభ్యంతరాలు రాగానే ఎన్ని సార్లు షెడ్యూల్‌ను మార్చుతారు? అంటూ ఫ్యాన్ ఫైర్ అవుతున్నారు. మరో 45 రోజుల్లో ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్ జరుగుతుండగా.. ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేయాలనే ఆలోచనలు చేస్తున్నారు. ఓవరాల్‌గా ప్రపంచకప్ షెడ్యూల్‌నే ఓ జోక్ చేశారంటూ ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు.

# ఉత్కంఠ టైబ్రేకర్‌కు!

- ప్రజ్ఞానంద రెండో గేమ్ సైతం డ్రా
- చెస్ ప్రపంచకప్ ఫైనల్లో కార్ల్‌సన్




**బాకు :** ఫిడే చెస్ ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద అద్భుతంగా పావులు కదులుపుతున్నాడు. సెమీఫైనల్లో 31 ఏళ్ల అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరౌనాతో పోటాపోటీగా ఆడుతున్నాడు. వరల్డ్ నెం.3 ఫాబియానోను సెమీస్ తొలి గేమ్‌లో నల్లపావులతో 78 ఎత్తుల్లో నిలువరించిన ప్రజ్ఞానంద.. ఆదివారం రెండో గేమ్‌లోనూ అతడికి అవకాశం ఇవ్వలేదు. తెల్లపావులతో ఆడిన చెన్నై చిన్నోడు గేమ్‌లో వెనుకంజలో నిలిచినా.. 47 ఎత్తుల్లో మ్యాచ్‌ను డ్రా చేశాడు. దీంతో చెరో అర పాయింట్ పంచుకోవాల్సి వచ్చింది. ప్రజ్ఞానంద, కరౌనా చెరో పాయింట్‌తో ఉండడంతో..విజేతను టైబ్రేకర్‌తో తేల్చనున్నారు. మరోవైపు వరల్డ్ నం.1 మాగ్నస్ కార్ల్‌సన్ ఫైనల్‌కు చేరాడు.

# మిల్కాసింగ్, ఉషలు రావాలి

**అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్**



**హైదరాబాద్ :** యువత ఆకాశమే హద్దుగా ఎదిగేందుకు అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అసమాన ప్రోత్సాహం అందిస్తుంది. వనరులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని మన రాష్ట్రం నుంచే మిల్కాసింగ్, పి.టి ఉషలు తయారు కావాలని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని గోల్కోండ కోట 'ఆర్టిలరి సెంటర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్ర అథ్లెటిక్స్ మిడిల్, లాంగ్ డిస్టాన్స్ మీట్‌కు ఆంజనేయ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'తెలంగాణ రాష్ట్రం నుంచి మిల్కాసింగ్, పిటి ఉషలను వెలికి తీయటమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం. దశాబ్ది కాలంలో క్రీడా రంగంలో ఎంతో పురోగతి సాధించాం. నిఖత్ జరీన్, హుసాముద్దీన్, ఇషా సింగ్, నందని వంటి యువ అథ్లెట్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తి చాటుతున్నారని' ఆంజనేయ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా పరుగు పోటీల్లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సాయ్ కోచ్ నాగపురి రమేశ్, ఓయూ ప్రొఫెసర్ రాజేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

# ఇషాకు మరో పసిడి

**కాంస్యంతో ఒలింపిక్స్‌కు అఖిల్ అర్హత**

**బాకు (అజర్‌బైజాన్):** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్స్‌లో హైదరాబాదీ యువ షూటర్ ఇషాసింగ్ జట్టు విభాగంలో రెండో పసిడి పతకం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల, పురుషుల జట్టు ఈవెంట్స్‌లో భారత్ పసిడి పతకాలు సాధించింది. పురుషుల రైఫిల్ 3పీలో 0.1 తేడాతో సిల్వర్ చేజార్చుకున్న అఖిల్ షెరాన్.. ఒలింపిక్ బెర్త్‌ను మాత్రం వదల్లేదు.



షూటింగ్‌లో భారత్‌కు లభించిన ఐదో ఒలింపిక్స్ బెర్త్ ఇది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా (581 పాయింట్లు), మనుభాకర్ (580), రిథమ్ సంగ్వాన (583) బృందం 1744-1743 తో చైనీస్ తైపీను ఓడించింది. పురుషుల 3పీ టీమ్ ఈవెంట్‌లో అఖిల్, ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్ త్రయం 1750 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, స్వర్ణం కైవసం చేసుకుంది.

# చాంపియన్ స్పెయిన్

- ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 1-0తో గెలుపు
- మహిళల ఫిఫా ప్రపంచకప్




**సిడ్నీ (ఆస్ట్రేలియా) :** స్పెయిన్ నాయకి ఓల్గా కార్మోనా అదరగొట్టింది. ఆదివారం సిడ్నీలో జరిగిన మహిళల ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో కండ్లుచెదిరే గోల్‌తో మెరిసిన ఓల్గా.. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో స్పెయిన్‌కు తొలి టైటిల్ అందించింది. 2017లో జర్మనీ తర్వాత ఫిఫా ప్రపంచకప్ ముద్దాడిన తొలి యూరోపియన్ జట్టుగా సైతం స్పెయిన్ చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్, స్పెయిన్ మధ్య హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో 29వ నిమిషంలో ఓల్గా గోల్ కొట్టింది. ఎడమ కాలు కిక్‌తో బంతిని ఇంగ్లాండ్ గోల్ పోస్ట్ కార్నర్‌లోకి పంపించిన ఓల్గా.. స్పెయిన్‌లో సంబురాలకు తెరలేపింది. 68వ నిమిషంలో మరో గోల్ సాధించే అవకాశం సైతం స్పెయిన్‌కు లభించినా ఇంగ్లాండ్ గోల్‌కీపర్ అడ్డుకుంది. జెన్నీ హెర్మోస్ పెనాల్టీ కిక్‌ను లెఫ్ట్ సైడ్ డైవ్‌తో ఇంగ్లాండ్ గోల్‌కీపర్ నిలువరించింది. మానసిక ఆరోగ్యం, మరింత మెరుగైన ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ అంశాలపై గత ఏడాది స్పెయిన్ మహిళా అథ్లెట్లు జాతీయ జట్టు నుంచి తప్పుకుని సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. జాతీయ జట్టులో సుమారుగా ఓ ముసలం పుట్టిన ఏడాది లోపే స్పెయిన్ చారిత్రక ఫిఫా ప్రపంచకప్ విజయాన్ని సాధించటం గమనార్హం. మ్యాచ్‌లో 58 శాతం బంతిని స్పెయిన్ నియంత్రణలో ఉంచుకుంది. 13 సార్లు స్పెయిన్ గోల్ ప్రయత్నాలు చేయగా.. ఐదుసార్లు నేరుగా గోల్‌పోస్ట్ పైకి దూసుకెళ్లాయి. ఇంగ్లాండ్ ఎనిమిది సార్లు గోల్ కోసం ప్రయత్నించగా.. మూడు సార్లు టార్గెట్‌కు చేరువగా వెళ్లారు. అమెరికా (4), జర్మనీ (2), నార్వే (1), జపాన్ (1) తర్వాత ఫిఫా ప్రపంచకప్‌ను సాధించిన ఐదో జట్టుగా స్పెయిన్ నిలిచింది.



# సిరీస్ సొంతమాయె

- రెండో టీ20లో భారత్ గెలుపు
- రాణించిన రుతురాజ్, బుమ్రా

**డబ్లిన్ :** టీ20 సిరీస్ భారత్ వశం. రెండో టీ20లోనూ ఐర్లాండ్‌ను చిత్తు చేసిన టీమ్ ఇండియా 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 2-0తో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 185 పరుగులు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (58, 43 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), సంజు శాంసన్ (40, 26 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (38, 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), శివం దూబె (22 నాటౌట్, 16 బంతుల్లో 2 సిక్స్‌లు) రాణించారు. తెలుగు తేజం తిలక్ వర్మ (1) నిరాశపరిచాడు. భారీ ఛేదనలో ఐర్లాండ్ పోరాట స్ఫూర్తి చూపించింది. ఓపెనర్ ఆండీ బాల్‌బిర్నీ (72, 51 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో పోరాడాడు. మరో ఎండ్ నుంచి భారత బౌలర్లు బుమ్రా (2/15), ప్రసిద్ (2/29), బిష్ణోయ్ (2/37) వికెట్లు పడగొట్టారు. చివర్లో మార్క్ ఎడెర్ (23) ఆకట్టుకున్నా.. 20 ఓవర్లలో ఐర్లాండ్ 8 వికెట్లకు 152 పరుగులే చేసింది. సిరీస్‌లో నామమాత్రపు మూడో టీ20 బుధవారం జరుగుతుంది.



## మనకు మళ్లీ నిరాశే

**ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్**

**బుడాపెస్ట్ :** ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత అథ్లెట్లు వరుసగా రెండో రోజు నిరాశపరిచారు. ఆదివారం పురుషుల 400మీటర్ల హార్డిల్స్‌లో సంతోష్ కుమార్ హీట్స్‌లో, హైజంప్‌లో సర్వేశ్ అనిల్ అర్హత రౌండ్ నుంచి నిష్క్రమించారు. మూడో హీట్‌లో పోటీపడిన సంతోష్ కుమార్ 50.46 సెకండ్ల టైమింగ్‌తో ఏడో స్థానంలో నిలిచి సెమీస్‌కు దూరమయ్యాడు. పురుషుల హైజంప్‌లో మూడు ప్రయత్నాల్లోనూ 2.25 మీటర్ల జంప్ చేయటంలో తేలిపోయిన అనిల్ గ్రూప్-బిలో11వ, ఓవరాల్‌గా 20వ స్థానంలో నిలిచాడు.

# మన కెమెరామెన్లు అద్భుతాలు చేయగలరు

**తె**లుగు సినిమాటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో గ్రాండ్‌గా జరిగాయి. ఈ వేడుకలో ప్రముఖ సినిమాటోగ్రాఫర్స్ ఎస్ గోపాల్ రెడ్డి ( లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డ్), ఛోటా కె. నాయుడు, కె కె సెంథిల్ కుమార్, శరత్, కె రవీంద్రబాబు, సి రామ్ ప్రసాద్, హరి అనుమోలు, రసూల్ ఎల్లోర్‌లను ఘనంగా సత్కరించారు.

యువ సినిమాటోగ్రాఫర్స్ కార్తిక్ ఘట్టమనేని, ఉదయ్ గుర్రాలను సినిమాటిక్ విజనరీ అవార్డ్స్, సాయి శ్రీరామ్, దాశరథి శివేంద్ర, నగేష్ బ్యానల్, బాల్రెడ్డి, సినిమాటిక్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్‌తో సత్కరించారు. ఈ వేడుకలో దర్శకులు కోదండరామి రెడ్డి, వివి వినాయక్, ఇంద్రగంటి మోహన్ కృష్ణ, ఏ.ఎస్.రవికుమార్ చౌదరి, సాయి రాజేష్, దామోదర్ ప్రసాద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ వేడుకలో ఎస్.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, 'పరిశ్రమలో సినిమాటోగ్రాఫర్‌గా 55 ఏళ్ళు పూర్తి చేసుకున్నాను. నా మిత్రులందరి ముందు ఈ సత్కారం తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు.

'మన తెలుగులోనే ది బెస్ట్ కెమెరామెన్స్ వస్తున్నారు. సరైన అవకాశాలు ఇస్తే అద్భుతాలు చేస్తారు. ఇండియన్ సినిమాని తెలుగు కెమెరామెన్ రూల్ చేస్తారనే నమ్మకం ఉంది. దీన్ని సవాల్‌గా తీసుకొని ముందుకు వెళ్ళాలి' అని ఛోటా కె. నాయుడు అన్నారు.సెంథిల్ కుమార్ మాట్లాడుతూ, 'ఐతే' సినిమా చేస్తున్నప్పుడు నేను కూడా ఒక బెస్ట్ సినిమాటోగ్రాఫర్ అవ్వాలని కల కన్నాను. ఈ రోజు ఒకటికాదు.. రెండు కాదు.. మూడు వెయ్యి కోట్ల సినిమాలు చేశాను. బహుశా ఆస్కార్ కమిటీలో ఉన్న ఇండియన్ టెక్నీషియన్‌ని నేను అనుకుంటాను. ఇటీవలే ఇన్విటేషన్ వచ్చింది. ఇదొక అచీవ్మెంట్‌గా భావిస్తున్నా. తెలుగు సినిమా చేస్తే ఏ స్థాయికైనా వెళ్ళొచ్చు అనడానికి ఇది నిదర్శనం' అని తెలిపారు. 'కొత్తగా వచ్చే కెమెరామెన్‌కి ఒక సలహా. దర్శకులు ఏం చెప్తే అది చేయడం మంచిదే. కానీ కొందరికి లైటింగ్ మీద అంత పట్టులేకపోవచ్చు. అలాంటప్పుడు దర్శకుడిని కన్విన్స్ చేసి చేయాల్సిన బాధ్యత ఉంది. ఇలాంటి విషయంలో చోటాకె నాయుడు దిట్ట (నవ్వుతూ) ఎవరినైనా మ్యాజిక్ చేస్తారు. ఆ మ్యాజిక్ అందరూ నేర్చుకొని మంచి పేరు తెచ్చుకోవాలి' అని దర్శకుడు వి.వి.వినాయక్ చెప్పారు.



# సరికొత్త కాన్సెప్ట్

**చ**ంటి, లహరి హీరో, హీరోయిన్లుగా అన్నపూర్ణేశ్వరి సినీ క్రియేషన్స్ బ్యానర్ పై రూపొందుతున్న చిత్రం 'హ్యాష్ ట్యాగ్ ఎపి31'. 'నెంబర్ మిస్సింగ్' ట్యాగ్ లైన్. కె.వి.ఆర్ దర్శకత్వంలో నారాయణ స్వామి.ఎం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సలీమ్ మాలిక్ (మ్యాక్) అడిషనల్ స్క్రీన్ ప్లే అందించారు. ఆదివారం జరిగిన ప్రెస్ మీట్‌లో దర్శకుడు త్రినాథ రావు నక్కిన మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌ని నిర్మాత బెక్కెం వేణు గోపాల్ విడుదల చేశారు.



ఈ సందర్భంగా హీరో చంటి మాట్లాడుతూ, 'నిర్మాత నారాయణ స్వామి బాగా ఖర్చు పెట్టి సినిమా చేస్తున్నారు. డైరెక్టర్ కె.వి.ఆర్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రజ్వల్, స్క్రీన్ ప్లే రైటర్ మ్యాక్ ఇలా అందరూ బాగా కష్టపడుతున్నాం. భాష్యశ్రీ ప్రతి డైలాగ్, పాటను చక్కగా రాశారు. లహరి చాలా గొప్ప పెర్ఫామర్. తను అబ్బాయిలతో సమానంగా యాక్షన్ సన్నివేశాల్లో నటించింది' అని తెలిపారు. 'నిర్మాత నారాయణ స్వామి నాతో సినిమా చేస్తానని మాట ఇచ్చారు. అన్నట్టుగానే సినిమాను చేస్తున్నారు. అది కూడా భారీగా చేస్తున్నారు. మంచి నటీనటులు, టెక్నీషియన్స్‌ను ఇచ్చి నిర్మిస్తున్నారు. హీరో చంటిని స్క్రీన్ పైన చూస్తుంటే ఫస్ట్ టైమ్ హీరోలా అనిపించరు. అంత చక్కగా నటించారు. లహరి చాలా డేడికేషన్‌తో వర్క్ చేశారు. అద్భుతంగా నటించారు. అందరి సపోర్ట్‌తో సినిమాను కూల్‌గా పూర్తి చేస్తున్నాం' అని దర్శకుడు కె.వి.ఆర్ అన్నారు. నాయిక లహరి మాట్లాడుత, 'నాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన డైరెక్టర్ కె.వి.ఆర్‌కి, నిర్మాత నారాయణ స్వామికి థ్యాంక్స్' అని తెలిపారు. వినోద్ కుమార్, తులసి, జయసుధ, షియాజీ షిండే, బాబు మోహన్, పృథ్వీరాజ్, పాకీజా, స్వర్ణలత తదితరులు ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# నవచిత్రం

## రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



అనుష్క, నవీన్ పొలిశెట్టి

**న**వీన్ పొలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా తెరకెక్కుతున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. ఈ సినిమా సెప్టెంబర్ 7న రిలీజ్ కాబోతోంది. యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ చిత్ర ట్రైలర్‌ని నేడు (సోమవారం) రిలీజ్ చేస్తున్నట్టు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

అనౌన్స్‌మెంట్ నుంచి అందరిలో ఆసక్తి కలిగించిందీ సినిమా. ఈ ఏడాది మోస్ట్ అవేటెడ్ మూవీగా ఉన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా సెప్టెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేసేందుకు ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారు. భిన్న కాన్సెప్ట్‌తో దర్శకుడు మహేష్ ఈ చిత్రాన్ని అద్యంతం అద్భుతంగా తెరకెక్కించారు. అనుష్క తనదైన మార్క్‌తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అలాగే యువ కథానాయకుడు నవీన్ పొలిశెట్టి సైతం తన నటనా ప్రతిభతో అందర్నీ అలరించడానికి మన ముందుకు రాబోతున్నారు. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

అభినవ్ గోమటం, మురళీ శర్మ, తులసి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : రథన్, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ: నిరవ్ షా, కొరియోగ్రఫీ: రాజు సుందరం, బృందా, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, వి.ఎఫ్.ఎక్స్ సూపర్‌వైజర్: రాఘవ్ తమ్మారెడ్డి.

# నేను చేసే పాత్రలు నన్నే సర్‌ప్రైజ్ చేయాలి

**దు**ల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మాస్‌ఎంటర్‌టైనర్ 'కింగ్ ఆఫ్ కొత్త'. ఐశ్వర్య లక్ష్మీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రానికి అభిలాష్ జోషి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 24న విడుదల కానున్న నేపథ్యంలో హీరో దుల్కర్ సల్మాన్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే..



- 'కింగ్ ఆఫ్ కొత్త .. ఇందులో కొత్త అంటే మలయాళంలో టౌన్ అని అర్థం. అదొక ఫిక్షనల్ టౌన్. ఇప్పటి వరకు నేను గ్యాంగ్ స్టార్ సినిమాలు చేయలేదు. స్కేల్ పరంగా ఇది బిగ్గెస్ట్ మూవీ. పాటలు, యాక్షన్ సీక్వెన్స్, ఫుట్ బాల్ .. ఇలా అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఇందులో చాలా ఉన్నాయి.
- ఇలాంటి సినిమా చేయడం నాకు పూర్తిగా కొత్త. ఇదొక మంచి గ్యాంగ్‌స్టర్ డ్రామా. అలాగే మంచి ఫ్రెండ్‌షిప్ కూడా ఉంటుంది. నాకు హ్యూమన్ డ్రామా, సంఘర్షణ ఇష్టం. అది ఇందులో చక్కగా కుదిరింది. కథ రెండు పీరియడ్స్‌లో ఉంటుంది. అలాగే ఇందులో ఫుట్‌బాల్ సీక్వెన్స్‌లు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. ధ్రువ్ అనే యాక్షన్ కొరియోగ్రాఫర్ ఆ సన్నివేశాలని చాలా అద్భుతంగా డిజైన్ చేశారు. విజువల్‌గా చాలా కొత్తగా ఉంటాయి. ఇందులో ప్రతి పాత్ర కథని మలుపు తిప్పుతుంది.
- ఈ సినిమాకి తమిళం, తెలుగు, మలయాళం హిందీలోనూ నేనే డబ్బింగ్ చెప్పాను. ఈ సినిమా దర్శకుడు నాకు చైల్డ్ హుడ్ ఫ్రెండ్. ఎప్పటి నుంచో కలిసి సినిమా చేయాలని అనుకుంటున్నాం. ఫైనల్‌గా ఈ కథ కుదిరింది. ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని ఈ సినిమా చేశాం. ప్రేక్షకులు తప్పకుండా థియేటర్‌కి వచ్చి చూసే విధంగా ఈ సినిమాని భారీగా రూపొందించాం.
- 'సీతారామం' తర్వాత నాకు పూర్తిగా లవర్ బాయ్ ఇమేజ్ వచ్చింది ఇలాంటి గ్యాంగ్ స్టార్ సినిమా చేయడం ఎలా అనిపించిందని అందరూ అడుగుతున్నారు. నేను ఎక్కువగా లవర్ బాయ్‌గా గుర్తుంటాను ( నవ్వుతూ). నాకు నచ్చిన కథని చేస్తాను. అయితే ఒకే రకం కథలు, పాత్రలు చేయాలని మాత్రం ఉండదు. ప్రేక్షకులతో పాటు ఒక నటుడిగా నాకు నేను సర్‌ప్రైజ్ అయ్యే పాత్రలు చేయాలని ఉంటుంది. అందులో నుంచి దీనికి షిఫ్ట్ అవ్వడం ఎగ్జైటింగ్‌గా ఉంది.

'ప్రాజెక్ట్ కె' పై మీడియా వేసే ప్రశ్నలను ఎవైడ్ చేస్తున్నాను ( నవ్వుతూ). వారే చెప్పాలి. అయితే ఆ సినిమా.. ఇండియన్ సినిమా ల్యాండ్ స్కేప్‌ని మార్చేస్తుంది. ఇప్పటివరకూ చాలా సినిమాలు విన్నాను, చూశాను. కానీ అలాంటి సినిమాని ఎవరూ తీయలేదు.
- దుల్కర్ సల్మాన్

# నేనేనా..? రిలీజ్‌కి రెడీ

**2012**లో రిలీజైన ఎస్ఎంఎస్ (శివ మనసులో శృతి) సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది రెజీనా కసాండ్రా. తన అందం, అభినయంతో అతి తక్కువ కాలంలోనే వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఫ్యాన్ బేస్‌ను పెంచుకుంది. ముఖ్యంగా రొటీన్ లవ్‌స్టోరీ, కొత్తజంట, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి చిత్రాలతో మంచి పేరుని సొంతం చేసుకుంది.



వెన్నెల కిషోర్, రెజీనా


రెజీనా ప్రస్తుతం ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్‌లో 'సూర్పనగై' (తెలుగులో నేనేనా..?) అనే సినిమాను చేస్తోంది. కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అక్షర గౌడ, అలీ ఖాన్, జై ప్రకాష్ వంటి కీలక నటులు నటిస్తున్నారు. శ్యామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు. 'జాంబిరెడ్డి' సినిమాతో మంచి హిట్ అందుకున్న ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్ పై ఈ చిత్రం తెరకెక్కింది. అన్ని పనులను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 25న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. ఈ చిత్రానికి క్లీన్ యు సర్టిఫికేట్‌ను సెన్సార్ సభ్యులు ఇచ్చారు. సినిమా విభిన్నంగా ఉందని, మంచి కంటెంట్‌తో వస్తుంది అంటూ మూవీ యూనిట్‌ని సెన్సార్ సభ్యులు అభినందించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# తెలంగాణలో విద్యుత్ రంగం-తీరుతెన్నులు



తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పడిన తరువాత రాష్ట్రంలో విద్యుత్ రంగం ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలతో సహా గణనీయంగా విస్తరించింది. వినియోగదారుల సంఖ్య మొత్తం విద్యుత్ వినియోగం, తలసరి వినియోగం గణనీయంగా పెరిగాయి. విద్యుత్ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం 7778 మెగావాట్ల నుండి 2022 మార్చి చివరి నాటికి 17228 మె.వా.కు పెరిగింది. అత్యధిక డిమాండు 5661 మె.వా. నుండి 16638 మె.వా.కు పెరుగుతుందని తాజా అంచనా. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం ఏ టేటా పెరిగిపోతున్నది. దీనికితోడు. కొంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల, విద్యుత్ సంస్థల నిర్వహణలో లోటుపాట్ల వల్ల వినియోగదారులకు విద్యుత్ సరఫరా జరిగే వరకు అయ్యే వ్యయం (కాస్ట్ ఆఫ్ సర్వీస్) పెరుగుతున్నది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (టిఎస్ఈఆర్సీ) 2023-24 సంవత్సరానికి రెండు విద్యుత్ పంపిణీ కంపెనీలు ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్‌లకు కలిపి నిర్ధారించిన రెవెన్యూ లోటును, 2016-17 నుండి 2022-23 వరకు ట్రూ అప్ క్లెయిముల మొత్తాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించటంతో వినియోగదారులపై కొత్త భారాల ముప్పు తప్పింది. రెవెన్యూ లోటు రూ.9124. 82 కోట్లు, ట్రూ అప్ క్లెయిములు రూ.12514.57 కోట్ల మేరకు భరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించింది. 2022-23 సంవత్సరానికి అసాధారణంగా రూ.6078.73 కోట్ల మేరకు చార్జీల పెంపుదల భారం పడగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సర చార్జీల ఉత్తర్వులో రెవెన్యూ లోటు, పేరుకుపోయిన ట్రూ అప్ క్లెయిముల భారం కలిపి రూ.21,639.39 కోట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా సమకూర్చడం రాష్ట్ర చరిత్రలోనే అసాధారణం.



ఎం. వేణుగోపాలరావు
9441193749

### భారీగా మిగులు విద్యుత్, అయినా మార్కెట్ కొనుగోళ్ల అవసరం

అయిదవ నియంత్రణా కాలం (2024-25 నుండి 2028-29 వరకు) భారీగా విద్యుత్ మిగులు ఉంటుందని పంపిణీ కంపెనీలు తాజా అంచనాలలో చూపాయి. 2024-25లో 36758 మిలియన్ యూనిట్లు, 2025-26లో 37683 మి.యూ., 2026-27లో 32352 మి.యూ., 2027-28లో 26374 మి.యూ., 2028-29లో 16133 మి.యూ. మిగులు ఉంటుందని అంచనా చూపాయి. అయినా కూడా, పీక్ సమయాలలో డిమాండు తీర్చేందుకు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నాయి. రోజువారీగా, సీజన్ వారీగా డిమాండులో వచ్చే హెచ్చుతగ్గుల వల్ల, వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి అవకాశాలు, పరిమితుల వల్ల, వివిధ సమయాలలో మిగులు, కొరత ఉంటాయి. ఈ మిగులు సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్లు వివిధ రకాల విద్యుత్ మిశ్రమంలో సాధ్యమైనంత మేరకు సమతూకం ఉండేటట్లు చూడాలి. కాని డిస్కాంలు చూపిన అంచనాల ప్రకారం విద్యుత్ అవసరాలలో 25 నుండి 40శాతం వరకు మిగులు విద్యుత్ అయిదవ నియంత్రణా కాలంలో ఉంటుంది. డిమాండ్‌లో హెచ్చుతగ్గులకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా జరిగేందుకు రిజర్వ్ మార్జిన్ లేదా స్పిన్నింగ్ రిజర్వ్ నిమిత్తం 5శాతం మిగులు ఉంటే సరిపోతుంది. అయిదవ నియంత్రణ కాలంలో తేలుతుందని అంచనా వేసిన మిగులు విద్యుత్ ఇప్పటికే అమలైన, అమలులో ఉన్న ప్రాజెక్టులతో ప్రభుత్వ ఆదేశాల మేరకు డిస్కాంలు చేసుకున్న, చేసుకోనున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పిపిఏలు) కారణంగానే తేలుతుంది. ఆ విధంగా పరిస్థితిని సరిదిద్దలేని విధంగా భారీ మిగులు విద్యుత్ లభించటం, దాని వల్ల వినియోగదారులపై పడే అదనపు భారాల, ఇతర సాంకేతిక సమస్యలు కూడా వచ్చే ఐదేండ్లలో కొనసాగుతాయి. ఇంత భారీగా మిగులు విద్యుత్ తేలటం వల్ల దానిని కనీసం లాభనష్టాలు లేని విధంగా మార్కెట్‌లో అమ్మటం సాధ్యం కాదని అనుభవం నిర్ధారిస్తున్నది. కమిషన్ ఆదేశాల మేరకు డిస్కాంలు అనుసరించాల్సిన మెరిట్ ఆర్డర్ సూత్రం ప్రకారం అత్యధిక అస్థిర ఛార్జీలు ఉన్న విద్యుత్తే మిగులు విద్యుత్ తేలుతుంది. దీనివల్ల, మిగులు విద్యుత్ ఉత్పత్తిని తగ్గించాలని థర్మల్ ప్రాజెక్టులను, ముఖ్యంగా టీఎస్‌జెన్‌కో ప్రాజెక్టులను ఆదేశిస్తూ, అలా చేయని ఉత్పత్తికి కూడా పిపిఎలలోని షరతుల ప్రకారం భారీగా స్థిరఛార్జీలను చెల్లించాల్సి వస్తుంది. ఆ భారాలన్నీ వినియోగదారులపైనే పడతాయి. మరోపక్క పీక్ డిమాండు తీర్చేందుకు చాలా అధిక ధరకు మార్కెట్లో విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డిస్కాంలు 96553.85 మిలియన్ యూనిట్ల లభ్యత, 83113మి.యూ. అవసరం, 13441మి.యూ. మిగులు విద్యుత్ ఉంటాయని తొలుత ప్రతిపాదించాయి. అయితే, విద్యుత్ లభ్యతను 92665.57 మి.యూ.గా, అవసరాన్ని 84156.35మి.యూ. గా, మిగులును 8509.22మి.యూ.గా విద్యుత్ చార్జీల ఉత్తర్వులో కమిషన్ నిర్ధారించింది. డిస్కాములు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాన్ని రూ.54058.35 కోట్ల నుండి రూ.52006.78 కోట్లకు కమిషన్ తగ్గించింది. మిగులు విద్యుత్ భారీగా అభిస్తుందని అంచనా వేసి, 2023-24లో మార్కెట్‌లో 135.56 మీ.యూ. కొనాల్సి వస్తుందని డిస్కాములు వేసిన అంచనాను కమిషన్ 1505.42మి.యూ.కు పెంచింది. ఈ మార్కెట్ కొనుగోళ్ళకు యూనిట్ ధరను సగటున రూ.3.50 చొప్పున కమిషన్ లెక్కగట్టింది. మిగులు విద్యుత్‌లో 3724.05 మీ.యూ.లను యూనిట్‌కు సగటున రూ.5 చొప్పున అమ్మాలని కమిషన్ డిస్కాంలను ఆదేశించింది. ఆ మేరకు లభించే ఆదాయం రూ.1862.02 కోట్లను మొత్తం విద్యుత్ కొనుగోలు వ్యయం నుంచి తగ్గించింది. కమిషన్ నిర్ధారించిన వివిధ అంశాల అంచనాలలో హెచ్చుతగ్గులు ఏర్పడే అవకాశా లున్నాయి. అలా జరిగినప్పుడు వినియోగదారులపై ట్రూ అప్ భారాలు పడతాయి. భారీగా మిగులు విద్యుత్ తేలటం, అదే సమయంలో పీక్ కొరతను తీర్చేందుకు మార్కెట్లో విద్యుత్ కొనాల్సి రావటం విద్యుత్ కొనుగోళ్ళకు దీర్ఘకాలిక పిపిఎలు చేసుకొని, కమిషన్ అనుమతులను పొందటంలో విచక్షణా రాహిత్యాన్ని నిర్ధారిస్తున్నది. సాంకేతికంగా నివారించలేని మిగులు కన్నా చాలా అధికంగా మిగులు తేలి వినియోగదారులపై అనవసర భారాలు మోపడానికి ఈ అనుచిత నిర్ణయాలు దారితీస్తున్నాయి.

### ట్రూ అప్ భారాలకు కారణాలు

కమిషన్ నిర్ధారించిన దానికి మించి మిగులు విద్యుత్ తేలితే, దానిని కనీసం లాభనష్టాలు లేకుంగా మార్కెట్లో డిస్కాంలు అమ్మలేకపోతే, ఆమేరకు ఉత్పత్తి తగ్గించాలని సంబంధిత ప్రాజెక్టులను ఆదేశించి, అందుకు స్థిర చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. ఆ మేరకు వినియోగదారులపై ట్రూ అప్ భారాలు పడతాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సిఎస్‌పిడిసిఎల్ (1000 మె.వా.) నుండి డిస్కాంలు ప్రతిపాదించిన 6824.73మి.యూ. లభిస్తుందని కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఈ విద్యుత్‌కు చెల్లించాల్సిన చార్జీలపై న్యాయపరమైన వివాదం కొనసాగుతుండటం, సరఫరా చేసిన విద్యుత్ తెలంగాణ డిస్కాంలు భారీగా బకాయిలు పడటంతో సిఎస్పిడిసిఎల్ గత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుండి విద్యుత్ సరఫరా నిలిపి వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదే పరిస్థితి కొనసాగితే, మిగులు విద్యుత్‌ను దాని బదులు వాడుకొనే వీలుంటే, మిగులు విద్యుత్ లభ్యత, చేయని ఉత్పత్తికి స్థిర చార్జీల చెల్లింపు తగ్గుతాయి. మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు అవసరం తగ్గవచ్చు. అధిక అస్థిర చార్జీలతో సిఎస్ పిడిసిఎల్ విద్యుత్‌లో కొంత భాగం ఇప్పటికే మిగులు విద్యుత్‌లో చేరి ఉంటే, మార్కెట్లో విద్యుత్ కొనుగోలు అవసరం పెరగవచ్చు. సిఎస్ పిడిసిఎల్‌లో కొనసాగుతున్న వివాదంలో అంతిమ తీర్పును బట్టి వినియోగదారులపై అదనపు భారాలు పడతాయా లేదా అనేది తేలుతుంది. 2022-23లో డిస్కాంలు మార్కెట్‌లో 3616 మి.యూ. కొనాల్సి వచ్చింది. 2023-24లో 1505.42మి.యూ. విద్యుత్‌ను యూనిట్‌కు రూ.3.50 చొప్పున మార్కెట్లలో కొనాలని కమిషన్ వేసిన అంచనా అవాస్తవికమైనది. దానికి ప్రాతిపదిక ఏమిటో చార్జీల ఉత్తర్వులో వివరించలేదు. ఏప్రిల్ 2023లో 997.14మి.యూ., మార్చి 2024లో 618.28మి.యూ.ను అలా కొనాలని అంచనా వేసింది. వేసవి పీక్ సీజన్‌లో మార్కెట్‌లో అంత తక్కువ ధరకు విద్యుత్ లభించదు. గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్ళకు చాలా అధిక ఛార్జీలను చెల్లించాల్సి వచ్చింది. బొగ్గుకు కృత్రిమ కొరత, విదేశీ బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ ఎక్ఛేంజిలలో కొరత పరిస్థితుల్లో చట్టబద్ధ నల్లబజారు వ్యాపారం నడుస్తున్న రీత్యా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా మార్కెట్‌లో ముఖ్యంగా పీక్ సీజన్లలో విద్యుత్ కొనుగోలుకు అధిక ధరలను చెల్లించాల్సి రావచ్చు. ఆ విధంగా కమిషన్ నిర్ణయిం చిన ధరకు మించి, పరిమాణానికి మించి మార్కెట్‌లో విద్యుత్ కొన్న మేరకు వినియోగదారులపై ట్రూ అప్ భారాలు పడతాయి. కేంద్రం అనుసరిస్తున్న, కొత్తగా రాష్ట్రాలపై మోపుతున్న విధానల వల్ల కూడా విద్యుత్ కొనుగోలు వ్యయం కమిషన్ అంచనాలకు మించి పెరగవచ్చు.

కమిషన్ నిర్ణయించిన మేరకు, నిర్ణయించిన ధరకు డిస్కాంలు మిగులు విద్యుత్‌ను అమ్మలేకపోతున్నాయి. 2022-23లో 5059.81మి.యూ. మిగులు విద్యుత్తు అమ్మాలని కమిషన్ నిర్దేశించగా, డిస్కాంలు 1674మి.యూ. మాత్రమే అమ్మగలిగాయి. 2023-24 సంవత్సరానికి మిగులు విద్యుత్‌ను నష్టపడకుండా అమ్మలేమని, డిస్కాంలు మిగులు విద్యుత్ అమ్మే ప్రతిపాదన కూడా చేయలేదు. మిగులు విద్యుత్ అధిక అస్థిర చార్జీలతో కూడుకున్నది. పీక్ కాని సమయాలలో లభ్యమయ్యేది. అందువల్ల కమిషన్ నిర్ణయించిన విధంగా యూనిట్‌కు రూ.5చొప్పున అలాంటి మిగులు రైలు విద్యుత్‌ను అమ్మటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. కమిషన్ నిర్ణయించిన పరిమాణంలో యూనిట్ రూ.5 చొప్పున డిస్కాంలు మిగులు విద్యుత్‌ను అమ్మలేని మేరకు వచ్చే తేడా మొత్తం ట్రూ అప్ భారంగా వినియోగదారులపై పడుతుంది. మార్కెట్ కొనుగోళ్ళు, మిగులు విద్యుత్ అమ్మకానికి సంబంధించి కమిషన్ అవాస్తవిక అంచనాలు వేయటం వల్ల, డిస్కాంల రెవెన్యూ లోటు తక్కువగా చూపబడి, ఆ మేరకు ప్రభుత్వం ఇచ్చివుండాల్సిన సబ్సిడీ తగ్గింది. అలా తగ్గిన మొత్తాన్ని వినియోగదారుల ట్రూఅప్ చెల్లించాల్సి వస్తుంది.

### నిర్ణీత గడువులో అమలుకాని ఎత్తిపోతల పథకాలు - తగ్గుతున్న విద్యుత్ విక్రయాలు

2022-23లో కమిషన్ 69237.14 మి.యూ. మేరకు విక్రయాల అవసరాన్ని నిర్ధారించగా, డిస్కాంలు 64308.27 మి.యూ. మేరకే విక్రయించ గలిగాయి. 4929మి.యూ. మేరకు విక్రయాలు తగ్గడానికి ప్రధాన కారణం నీటిపారుదల, ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ ప్రతిపాదించిన విధంగా ఎత్తిపోతల పథకాలు అమలు కాక పోవటమే. హెచ్‌ఐ కేటగిరీలో ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి 2022-23లో 3312.01వి.ఎ.యూ. మాత్రమే అవసరమని డిస్కాంలు సాగునీటి పారుదల శాఖ చూపిన అవసరాలలో 50శాతం లోడ్ ఫాక్టరీనే పరిగణన లోకి తీసుకుని చూపాయి. 2023-24లో ఈ అవసరం 8084.26 మి.యూ.కు పెరుగుతుందని చూపాయి. అంటే దాదాపు 144శాతం పెరుగుదల. సాగునీటి పథకాల అమలులో దీర్ఘకాలిక జాప్యం జరగటం సర్వసాధారణం అని అనుభవం నిర్ధారిస్తున్నది. డిస్కాంల అంచనాల ప్రకారం ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ వినియోగం పెరగకపోతే, ఆ మేరకు మిగులు విద్యుత్ పెరుగుతుంది. ఆ మిగులు విద్యుత్ ఉత్పత్తిని తగ్గించాలని ఆదేశించి, ఆమేరకు స్థిర చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. ఆ భారం ట్రూ అప్ కింద వియోగదారులపై పడుతుంది. 2022-23లో పునరుత్పత్తి అయ్యే విద్యుత్ (ఆర్మ్)ను అవసరాలతో నిమిత్తం లేకుండా తప్పని సరిగా కొనాల్సినప్పటికి, దానిని కొనుగోలు చేయటం కోసం థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించ లేదని డిస్కాంలు సమాధానమిచ్చాయి. 2023-24లో 11959.28 మి.యూ. ఆ లభ్యమవుతుందని కమిషన్ నిర్ధారించింది. దీనిని కొనుగోలు చేసేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించాల్సి వస్తుంది. అందుకు చెల్లించాల్సిన స్థిర చార్జీలను కూడా కమిషన్ విద్యుత్ కొనుగోలు వ్యయంలో చేర్చింది.

కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పిజిసిఐఎలు డిస్కాంలు చెల్లించాల్సిన అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలను 2023-24కు కమిషన్ రూ.1533.17మేరకు అనుమతించింది. సిఇఆర్సి ఉత్తర్వు మేరకు పిజిసిఐఎల్ లెక్కగట్టే చార్జీలు దానికి మించి పెరిగితే, అదనపు మొత్తం ట్రూఅప్ కింద వినియోగదారులపై పడుతుంది. ఎన్టీపిసిసికి చెందిన టిఎస్టి టిపిపికి దాఖలు చేసిన ఇంధన వ్యయాన్ని 90శాతం మేరకే కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఆ ప్రాజెక్టుకు అస్థిర చార్జీలు అంతకు మించి పెరిగితే, అదనపు మొత్తం ట్రూ అప్ కింద వినియోగదారులు చెల్లించాల్సి వస్తుంది. సెంబ్కర్ప్ ప్రాజెక్టుల రెండుయూనిట్లకు 2023-24లో చెల్లించాలని డిస్కాంలు ప్రతిపాదించిన రూ.60.48 కోట్ల మొత్తాన్ని వాస్తవ వ్యయాన్ని పరిశీలించి, ట్రూ అప్ క్లెయిములను పరిగణించేటప్పుడు దానిపై నిర్ణయం తీసుకుంటామని కమిషన్ పేర్కొంది. అలా జరిగితే ఆ మొత్తం కూడా ట్రు అప్ కింద వినియోగదారులపై పడుతుంది.

## అసమగ్ర నియంత్రణ ప్రక్రియ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కమిషన్ ఇచ్చిన చార్జీల ఉత్తర్వు అసమగ్రంగా ఉంది. ప్రతి ఏటా చార్జీల ఉత్తర్వులలో ఇస్తున్న అనేక వివరాలు, విశ్లేషణ ఈసారి ఉత్తర్వులో చోటు చేసుకోలేదు. డిస్కాంలు సకాలంలో తమ పిటిషన్లను, అవసరమైన పూర్తి సమాచారంతో దాఖలు చేయకపోవటం, కమిషన్ అదనపు వివరాలు కోరాక కూడా ఆలస్యంగా సమర్పించటం, ఎఆర్ఆర్‌తో పాటు ఏడేండ్లకు సంబంధించిన ట్రూ అప్ క్లెయిముల పిటిషన్లను కూడా ఒకేసారి దాఖలు చేయటంతో కమిషన్ నియంత్రణ ప్రక్రియను సకాలంలో చేపట్టి. పూర్తి చేయటం సాధ్యం కాలేదని భావించాలి. అభ్యంతరదారులు అడిగిన అవసరమైన సమాచారాన్ని కూడా డిస్కాంలు తమ సమాధానాలలో ఇవ్వకుండా దాటవేశాయి. కమిషన్‌కు ఆలస్యంగా ఇచ్చిన అదనపు సమాచారాన్ని కూడా డిస్కాంల వెబ్‌సైట్‌లో గాని, కమిషన్ వెబ్‌సైట్లలోగాని, చార్జీల ఉత్తర్వులోగాని చూపలేదు. ప్రభుత్వ అసంబద్ధ వైఖరి వల్ల కమిషన్‌కు తగినంత సిబ్బందిలేని లోటు కూడా కొనసాగుతున్నది. ఇన్నేళ్ల అనుభవం తరువాత కూడా డిస్కాంలు ఇలా వ్యవహరించటం, అభ్యంతరదారులు, కమిషన్ కూడా వివిధ అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు, విశ్లేషించేందుకు అవకాశం, సమయం లేకుండా పోవడానికి దారితీసింది. చార్జీల పెంపుదల ప్రతిపాదనలు చేయించిన ప్రభుత్వం. ఎంత మేరకు సబ్సిడీ ఇచ్చేది కమిషన్‌కు తెలియజేయటంలో కూడా ఆలస్యం చేసింది. ఏప్రిల్ మొదటి తేదీ నుండి చార్జీల ఉత్తర్వు అమలులోకి రావాల్సిన అవసరం కూడా ఈ పరిస్థితుల్లో చార్జీల ఉత్తర్వును ఆ సమగ్రంగా తయారుచేసి, విడుదల చేయడానికి దారితీసింది. సకాలంలో, సమగ్ర వివరాలతో పిటిషన్లు దాఖలు చేయకపోవటం, అనేక పిటిషన్లను ఒకే కాలంలో దాఖలు చేయటం ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు పరిపాటి అయింది. కమిషన్ తన అధికారాన్ని వినియోగించి ప్రభుత్వ విద్యుత్ సంస్థలు నియంత్రణ ప్రక్రియకు సంబంధించి వాటి బాధ్యతలను సకాలంలో, సక్రమంగా పాటిం చేటట్లు, పారదర్శకత, జవాబుదారితనం ఉండేటట్లు, కమిషన్ ఉత్తర్వులు వివిధ అంశాలపై వాదనలతో కూడినవిగా ఉండేటట్లు చూడాల్సిన అవసరం ఉంది.

## వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై వివాదం

అమెరికాలో తానా ఏర్పాటు చేసిన సమావేశంలో ఒక ప్రశ్నకు సమాధానంగా, వ్యవసాయానికి రోజుకు మూడు, నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా సరిపోతుందని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వెలిబుచ్చిన అవాస్తవిక, తొందరపాటు అభిప్రాయంపై వివాదం చెలరేగింది. దీనిపై అధికార పక్షం బీఆర్ఎస్ నుండి తీవ్ర విమర్శలు వచ్చాక జరిగిన వాదోపవాదాల సందర్భంగా, తమ పార్టీ వ్యవసాయానికి రోజంతా విద్యుత్ సరఫరా చేసే విధానానికి వ్యతిరేకం కాదని కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. ఈ వ్యవహారం వ్యవసాయానికి రోజంతా ఉచిత విద్యుత్ సరఫరా విధానం, అమలు చర్చనీయాంశం కావటానికి దారితీసింది. వ్యవసాయానికి రోజంతా విద్యుత్ సరఫరా అవసరం, లేదా మూడు, నాలుగుగంటల పాటు సరఫరా సరిపోతుందనే అభిప్రాయాలు పరస్పర విరుద్ధమైనవే గాక, వాస్తవ పరిస్థితితో పొంతన లేనివి. ఏడాదిలో వ్యవసాయానికి సీజన్‌లో వేసిన పంటల ఆ వసరాలను బట్టి అవసరమైన మేరకే విద్యుత్ వినియోగం జరుగుతుందనేది తెలిసిన విషయమే. వ్యవసాయానికి రోజంతా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వాదన కోసం భావించినా, అది వాస్తవ వినియోగానికే పరిమితమవుతుంది. వినియోగం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తే అది తీవ్రమైన సాంకేతిక సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల, వాస్తవ వినియోగానికి మించి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా జరగదు. అలా జరగాల్సిన అవసరం కూడా లేదు. వ్యవసాయేతర విద్యుత్ వినియోగానికి కూడా ఇదే పరిస్థితి వర్తిస్తుంది. అదేవిధంగా వ్యవసాయానికి రోజుకు మూడు, నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా సరిపోతుందనే అభిప్రాయం హాస్యాస్పదమైనది. వాస్త వానికి, రైతులు వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇది సమంజసమైన కోరికే. రోజంతా విద్యుత్ సరఫరా జరుగుతుంటే, రైతులు అలా ప్రత్యేకంగా కోరాల్సిన అవసరం లేదు. సాంకేతిక కారణాల వల్లగాని, పీక్ సమయాలలో మార్కెట్‌లో విద్యుత్ లభించక గాని, కొద్దిసేపు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగవచ్చు. అలాంటి పరిస్థితుల్లో కూడా సింగిల్ ఫేజ్ సరఫరా చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. గతంలో దుర్భిక్ష పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా అవసరమైన కాలంలో అవసరమైన మేరకు జరగక పైర్లు దెబ్బతినే పరిస్థితి తిరిగి తలెత్తకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అధికార వర్గాలు వివరించాయి.

---

దీపిక

# జాతీయ పర్యావరణ విధానాన్ని భారత ప్రభుత్వం ఏ సంవత్సరంలో ఆమోదించింది ?



- డాక్టర్ కె. శశిధర్, పర్యావరణ నిపుణులు
94919 91918

భారతదేశంలోని పర్యావరణ చట్టాలు దేశం యొక్క సహజ వనరులు, పర్యావరణ వ్యవస్థలు మరియు జీవవైవిధ్యాన్ని సంరక్షించడం మరియు రక్షించడం పర్యావరణ చట్టాల యొక్క ప్రాథమిక లక్ష్యం. ఈ చట్టాలు స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించడానికి మరియు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ మరియు ఇతర మానవ కార్యకలాపాల కారణంగా ఉత్పన్నమయ్యే వివిధ పర్యావరణ సవాళ్లను పరిష్కరించడంలో విలువయిన పాత్రని పోషిస్తాయి.

**భారతదేశంలో కీలక పర్యావరణ చట్టాలు**

**నీటి (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1974:** ఈ చట్టం నీటి వనరులలోకి కాలుష్య కారకాల విడుదలను నియంత్రించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నిరోధించడం మరియు నియంత్రించడంపై దృష్టి పెడుతుంది మరియు నీటి నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించడానికి మరియు అమలు చేయడానికి కేంద్ర మరియు రాష్ట్ర స్థాయిలలో కాలుష్య నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుంది.




**వాయు (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1981:** నీటి చట్టం మాదిరిగానే, ఈ చట్టం పరిశ్రమలు, వాహనాలు మరియు ఇతర వనరుల నుండి ఉద్గారాలను నియంత్రించడం ద్వారా వాయు కాలుష్యాన్ని నిరోధించడం మరియు నియంత్రించడం లక్ష్యంగా పని చేస్తుంది . ఇది గాలి నాణ్యత నిర్వహణను పర్యవేక్షించడానికి నియంత్రణ సంస్థలను ఏర్పాటు చేస్తుంది.

**పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986:** ఈ సమగ్ర చట్టం పర్యావరణ పరిరక్షణ మరియు పరిరక్షణ కోసం చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది. ఇది వివిధ పర్యావరణ అంశాలపై నిబంధనలను రూపొందించడానికి మరియు అమలు చేయడానికి పునాదిని అందిస్తుంది.

**అటవీ (సంరక్షణ) చట్టం, 1980:** మైనింగ్ లేదా మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అటవీయేతర ప్రయోజనాల కోసం అటవీ భూముల మళ్లింపును నియంత్రించడానికి మరియు అటవీ వనరుల స్థిరమైన నిర్వహణను నిర్ధారించడానికి ఈ చట్టం రూపొందించబడింది.

**వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972:** ఈ చట్టం వన్యప్రాణులను మరియు వాటి ఆవాసాలను రక్షించడం, అంతరించిపోతున్న జాతులపై వేటాడటం, వేటాడటం మరియు వ్యాపారాన్ని నిషేధించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది జాతీయ పార్కులు మరియు వన్యప్రాణుల అభయారణ్యాల వంటి రక్షిత ప్రాంతాలను కూడా నిర్దేశిస్తుంది.

భారతదేశ పర్యావరణ చట్టాలు పర్యావరణ పరిరక్షణను, ఆర్థిక అభివృద్ధిని సమతుల్యం చేయడంలో కీలక పాత్రని పోషిస్తాయి . కాలుష్యం, వనరుల క్షీణత మరియు వాతావరణ మార్పు వంటి సవాళ్లు అభివృద్ధి చెందుతూనే ఉన్నందున, పర్యావరణ చట్టాలను మరింత సమర్థవంతంగా అమలు చెయ్యాల్సిన అవసరం ఉంది. దేశ అభివృద్ధితో పాటు, భవిష్యత్తు తరాల మనుగడలో కూడా పర్యావరణ చట్టాలు ఎంతో కీలకమయిన పాత్రని పోషిస్తాయి. అందువల్ల దేశంలోని ప్రతిఒక్కరు పర్యావరణ చట్టాల మీద అవగాహనా కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.

**1. కింది వాటిలో ఏ చట్టాన్ని భారతదేశంలో పర్యావరణ పరిరక్షణకు గొడుగు చట్టంగా భావిస్తారు?**
ఎ) వాయు (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం
బి) వన్యప్రాణుల రక్షణ చట్టం
సి) పర్యావరణ పరిరక్షణ చట్టం
డి) అటవీ సంరక్షణ చట్టం

**2. భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టం ఏ సంవత్సరంలో రూపొందించబడింది ?**
ఎ) 1980 బి) 1927
సి) 1976 డి) 1972

**3. భారతీయ పర్యావరణ చట్టంలో "సుస్థిర అభివృద్ధి" భావన కీలకమయిన అంశం ఏమిటి?**
ఎ) పర్యావరణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఆర్థిక వృద్ధి
బి) పర్యావరణ పరిరక్షణతో ఆర్థిక వృద్ధిని సాగించడం
సి) ఆర్థిక వృద్ధి కంటే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం
డి) అభివృద్ధి యొక్క పర్యావరణ అంశాన్ని విస్మరించడం

**4. పర్యావరణ చట్టంలోని "ముందు జాగ్రత్త సూత్రం" దేనిని సూచిస్తుంది:**
ఎ) పర్యావరణ పరిరక్షణ కంటే ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
బి) పరిశ్రమను ప్రోత్సహించడానికి పర్యావరణ నిబంధనలు సడలించాలి
సి) అనిశ్చిత పర్యావరణ ప్రమాదాల నేపథ్యంలో నివారణ చర్యలు తీసుకోవాలి
డి) సామాజిక సమస్యల కంటే పర్యావరణ ఆందోళనలు తక్కువ ముఖ్యమైనవి

**5. అటవీ (సంరక్షణ) చట్టం, 1980 లక్ష్యం ఏమిటి ?**
ఎ) పెద్ద ఎత్తున అటవీ నిర్మూలనను ప్రోత్సహించండి
బి) అటవీ ప్రాంతాల నుండి నీటి కాలుష్యాన్ని నియంత్రిస్తుంది
సి) అడవులను సంరక్షించడం మరియు రక్షించడం
డి) అడవులలో అనియంత్రిత పారిశ్రామిక కార్యకలాపాలను అనుమతించండి

**6. భారతీయ పర్యావరణ చట్టంలో "పబ్లిక్ ట్రస్ట్ డాక్ట్రిన్" అనే పదం ఈ క్రింది వాటిలో దేనిని సూచిస్తుంది ?**
ఎ) పర్యావరణ ప్రాజెక్టులకు ప్రజా నిధులు
బి) అన్ని పర్యావరణ వనరులపై ప్రభుత్వ నియంత్రణ
సి) రక్షిత ప్రాంతాలను యాక్సెస్ చేయడానికి ప్రజల హక్కు
డి) ప్రజా ఉపయోగం కోసం కొన్ని వనరులను రక్షించడం ప్రభుత్వ విధి

**7. వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972, వన్యప్రాణుల జాతులను ఎన్ని షెడ్యూల్లుగా వర్గీకరించింది?**
ఎ) 2 బి) 4 సి) 6 డి) 8

**8. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (CPCB) ప్రాథమిక బాధ్యత ఏమిటి ?**
ఎ) కాలుష్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడం
బి) వన్యప్రాణి సంరక్షణ ప్రాజెక్టులను అమలు చేయడం
సి) గాలి మరియు నీటి కాలుష్యాన్ని పర్యవేక్షించడం మరియు నియంత్రించడం
డి) అటవీ నిర్వహణ పద్ధతులను నియంత్రించడం

**9. భారతదేశంలో పర్యావరణ ప్రభావ అంచనా (EIA) ప్రక్రియ లక్ష్యం ఏమిటి ?**
ఎ) వేగవంతమైన పారిశ్రామికీకరణను ప్రోత్సహించండి
బి) అన్ని అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా ట్రాక్ చేయండి
సి) ఆమోదానికి ముందు ప్రాజెక్టుల వల్ల కలిగె సంభావ్య పర్యావరణ ప్రభావాలను అంచనా వేయండి
డి) ఆర్థిక వృద్ధి కోసం పర్యావరణ ఆందోళనలను విస్మరించండి

**10. "పొల్యూటర్ పేస్ ప్రిన్సిపల్" (Polluter Pays Principle) దేనిని సూచిస్తుంది ?**
ఎ) పరిశ్రమలను పర్యావరణ నిబంధనల నుండి మినహాయించాలి
బి) ప్రభుత్వం అన్ని పర్యావరణ పరిరక్షణ చర్యలకు నిధులు సమకూర్చాలి
సి) కాలుష్యం చేసేవారు కాలుష్య నియంత్రణ మరియు నివారణ ఖర్చులను భరించాలి
డి) కాలుష్య నియంత్రణకు వ్యక్తులు మాత్రమే బాధ్యత వహించాలి

**11. పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి పౌరుల ప్రాథమిక విధి అని ఏ రాజ్యాంగ సవరణ చెబుతుంది?**
ఎ) 42వ సవరణ బి) 44వ సవరణ
సి) 73వ సవరణ డి) 86వ సవరణ

**12. "ఎకో-సెన్సిటివ్ జోన్" అనే పదం దేనిని సూచిస్తుంది ?**
ఎ) కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు
బి) వేగవంతమైన పట్టణీకరణ ఉన్న ప్రాంతాలు
సి) పర్యావరణ ప్రాముఖ్యత కారణంగా ప్రత్యేక రక్షణ అవసరమయ్యే ప్రాంతాలు
డి) పారిశ్రామిక అభివృద్ధి కోసం నియమించబడిన మండలాలు

**13. జాతీయ పర్యావరణ విధానాన్ని భారత ప్రభుత్వం ఏ సవంత్సరంలో ఆమోదించింది?**
ఎ) 1980 బి) 1992
సి) 2000 డి) 2010

**14. పర్యావరణంపై ప్రభావం చూపే ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు జారీ చేసే అధికారం ఏ సంస్థకు ఉంది?**
ఎ) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (CPCB)
బి) పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (MoEFCC )
సి) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT)
డి) రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు (SPCB)

**15. మాంట్రియల్ ప్రోటోకాల్ అనే అంతర్జాతీయ ఒప్పందం లక్ష్యం ఏమిటి ?**
ఎ) వాతావరణ మార్పులను పరిష్కరించడం
బి) సముద్ర జీవుల రక్షణ
సి) ఓజోన్-క్షీణించే పదార్థాలను దశలవారీగా తొలగించడం
డి) అణ్వాయుధాల పరీక్షలను నియంత్రించడం

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1.సి | 2.డి | 3.బి | 4.సి | 5.సి |
| 6.డి | 7.బి | 8.సి | 9.సి | 10.సి |
| 11.ఎ | 12.సి | 13.బి | 14.బి | 15.సి |



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

కరెంట్ అఫైర్స్

**సుప్రీం కోర్టులో ప్రవేశానికి క్యూఆర్ కోడ్ ఈ పాస్ :** న్యాయవ్యవస్థను ఆధునీకరించడానికి, క్రమబద్దీకరించడానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సి.జె.ఐ) జస్టిస్ డి.వై. చంద్రచూడ్ 'సుస్వాగతం' పోర్టల్ ను ఆవిష్కరించారు. ఈ వినూత్న వేదిక న్యాయవాదులు, కక్షిదారులు, పౌరులకు క్యూఆర్ కోడ్ ఆదారిత ఈ పాస్‌ను పొందడానికి అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా సుప్రీం కోర్టు యొక్క గౌరవనీయమైన హాళ్లలోనికి ప్రవేశం కల్పిస్తుంది. 'సుస్వాగతం' పోర్టల్ ప్రవేశ ప్రక్రియను క్రమబద్దీకరించడం, క్యూలను తగ్గించడం, సుప్రీం కోర్టు ఆవరణలో కొంత రహిత విధానాన్ని అవలంభించడంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది.

**'రాజమార్గయాత్ర' యాప్ దేనికి సంబంధించినది? :** భారతీయ జాతీయ రహదారులపై అంతరాయం లేని ప్రయాణాన్ని అందించడానికి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఎ.ఐ) రాజమార్గ యాత్ర మొబైల్ అప్లికేషన్ ను పరిచయం చేయడం జరిగింది. ఈ యాప్ ద్వారా జాతీయ రహదారి వినియోగదారులు కోసం సమగ్ర సమాచారం, ఫిర్యాదుల పరిష్కారం, ప్రయాణ సురక్షితం, సౌకర్యవంతం చేయడం మొదలైన సేవలు లక్ష్యంగా పనిచేస్తుంది.




**'అన్వేష', 'ఉత్కర్ష్' ఉత్సవాలు :** ఇటీవల భారత రాష్ట్రపతి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 'అన్వేష' అంతర్జాతీయ సాహిత్య ఉత్సవాన్ని, జానపద గిరిజన ప్రదర్శన కళల ఉత్కర్ష్ ఉత్సవాన్ని ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 800 మందికి పైగా కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. అన్వేష ఉత్సవం ఆసియాలోనే అతిపెద్ద సాహిత్య ఉత్సవం. 102 భాషల్లో 75 కి పైగా కార్యక్రమాలలో 575 మందికి పైగా రచయితలు పాల్గొనే ఈ ఉత్సవం ప్రపంచంలోనే అతిపెద్ద సాహిత్య ఉత్సవం జానపద, గిరిజన వ్యక్తీకరణల భారతదేశపు గొప్ప వారసత్వానికి ప్రతీకగా ఉత్కర్ష్ నిలుస్తుంది. దీని ద్వారా భారతదేశం తన సాంస్కృతిక వైవిధ్యం యొక్క స్పష్టమైన చిత్రపటాన్ని సగర్వంఆ ప్రదర్శిస్తుంది.

**విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించిన గుకేష్ :** 17 ఏళ్ల చెస్ దిగ్గజం డి. గుకేష్ లైవ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌ను వెనక్కినెట్టి భారత్ చెస్ ప్లేయర్స్‌లో అగ్రగణ్యుడుగా నిలిచాడు. ఫిడే వరల్డ్ కప్ 2వ రౌండ్‌లో మిస్త్రాడిన్ ఇస్కందరోవ్‌ను ఓడించి 2755.9 లైవ్ రేటింగ్‌ను సాధించి క్లాసిక్ ఓపెన్ విభాగంలో 9వ స్థానానికి ఎగబాకడం ద్వారా గుకేష్ ఈ ఘనత సాదించాడు. విశ్వనాధన్ ఆనంద్ రేటింగ్ 2754.0తో 10వ స్థానానికి పడిపోయింది. 1986 తర్వాత ఆనంద్ అగ్రస్థానం నుంచి వైదొలగడం ఇది 2వ సారి. 25 రేటింగ్ పాయింట్లతో లైవ్ రేటింగ్ 2755.9 కి గుకేష్ చేరుకోగా, ఆనంద్ రేటింగ్ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యున్నత చెస్ ప్లేయర్‌గా 9వ స్థానంలో వున్నాడు. 2838 రేటింగ్‌లో మాగ్నాస్ కార్లసెన్ మొదటి స్థానంలో వున్నాడు.



AU SMALL FINANCE BANK

**వీడియో బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న తొలి బ్యాంకు 'ఎ.యు' :** భారతదేశంలోనే అతిపెద్ద స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు అయిన ఎ.యు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు వినూత్నంగా 24×7 వీడియో బ్యాంకింగ్ ప్లాట్‌ఫాం ప్రారంభిచుట ద్వారా కస్టమర్ సేవలో గణనీయమైన ముందడుగు వేసింది. ఇందులో వినియోగదారులు వీడియో కాల్స్ మాదిరిగా నిపుణులైన బ్యాంకర్లతో ముఖాముఖి వీడియో ఇంటరాక్షన్‌లలో పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది. సెలవు దినాలలో కూడా ఇది 24 గంటలు పనిచేస్తుంది. ఇలా భారతదేశంలోనే లైవ్ వీడియో బ్యాంకింగ్ పరిష్కారాలను అందించే సర్వీస్ ప్రొవైడర్‌గా ఎ.యు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ చరిత్రలో నిలిచిపోయింది.



**అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి :** ఆగస్టు 16న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా దేశమంతా ఢిల్లీలోని 'సదైవ్ అటల్' స్మారక చిహ్నం వద్ద వివిధ రాజకీయ, అనుబంధ నాయకులు సమావేశమయ్యారు. ఉపాధ్యక్షుడు జగదీష్, దంఖర, అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కారీ రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ, ప్రఫుల్ పటేల్, అర్జున్‌రామ్ మేఘవాల్, కేంద్రమంత్రి అనుప్రియా పటేల్, హెచ్.ఎ.ఎమ్. జితన్ రాయ్ కూడా అటల్ బిహారీ వాజ్‌పేయ్ 5వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు.




**భారతదేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 2023 :** భారతదేశం తన 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆగస్టు 15, 2023 న జరుపుకుంది. ఈ సంవత్సరం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకలో భాగంగా 'నేషన్ ఫస్ట్, ఆల్వేస్ ఫస్ట్' అనే థీమ్ తో ఈ వేడుకలు జరుపుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగుర వేయాలని ప్రజలను ప్రోత్సహిస్తూ 'హర్ ఘర్ తిరంగా' ప్రచారానికి కూడా ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.